# భారత శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 20 | సంచిక : 304 | మంగళవారం,మే 26 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00


## తెలంగాణలో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం..

### కూలిన భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు



**హైదరాబాద్ (భారత శక్తి)** హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. రాజధాని నగరంలోని వనస్థలిపురం, హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట తదితర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. జనగామ జిల్లా నర్మెట్ట

2లో..



## సీఎం రేవంత్ రెడ్డితో సీపీఐ ప్రతినిధి బృందం సమావేశం

**హైదరాబాద్ (భారత శక్తి)** సీపీఐ శాసనసభ్యుడు కూనమనేని సాంబశివ రావు నేతృత్వంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి కలిశారు. కార్మికులకు కనీస వేతనాల పెంపు నిర్ణయంపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రైతుల అంశంపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం సహకరించక పోయినప్పటికీ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో మొక్కజొన్న దిగుబడి బాగా వచ్చిందని అన్నారు. కేంద్రం మొక్కజొన్న కొనుగోలు చేయడం లేదని చెప్పారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా రైతులు ఇబ్బందులు పడొద్దని మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ ఎమ్మెల్సీ సత్యం, నాయకులు పశ్య పద్మ, ఈ. నరసింహ చాడ వెంకట్ రెడ్డి, బాగం హేమంతరావు,శంకర్, బాల నరసింహ,వీఎస్ బోసు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ఉన్నారు.

## పోక్సో కేసులో దోషికి రెండు మరణశిక్షలు విధిస్తూ కోర్టు తీర్పు

- తమిళనాడులో కీలక తీర్పు వెలువరించిన పోక్సో కోర్టు
- విద్యార్థినిపై అత్యాచారం, అతి దారుణంగా హత్య
- అరుదైన కేసుగా పేర్కొన్న పోక్సో కోర్టు



**తమిళనాడు భారత శక్తి** తమిళనాడులో 12వ తరగతి విద్యార్థిని హత్యాచారం కేసులో దోషికి రెండు మరణశిక్షలను విధిస్తూ పోక్సో కోర్టు కీలక తీర్పును వెలువరించింది. విలాతికుళం

2లో..

# మేధావి వర్గంపై కక్షసాధింపు?

## కూటమి దూకుడుపై 'తెలంగాణ' ఆగ్రహజ్వాలలు!

- ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌పై ఏ.పీలో వరుస కేసులు..
- హైదరాబాద్‌లో అరెస్టుకు పోలీసుల రంగప్రవేశం?
- 'తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించం'..
- చంద్రబాబు నివాసం ముట్టడికి 'కవితక్క' పిలుపు!
- బేషరతుగా వెనక్కి తీసుకున్నా వేధింపులా?
- భావప్రకటనా స్వేచ్ఛపై దాడి అంటూ ప్రజాస్వామ్యవాదుల మండిపాటు!

సారూ.. ఇదా మన 'ప్రజాస్వామ్య' ప్రగతి? తప్పుగా మాట్లాడానని మే 21నే ప్రొఫెసర్ నాగేశ్వర్ బేషరతుగా క్షమాపణలు చెప్పి వెనక్కి తీసుకున్నా, ఏపీ కూటమి ప్రభుత్వానికి కసి తీరలేదు కాబోలు! నయా చట్టాల (BNS 192, 196, 352) పదును చూపిస్తూ, హైదరాబాద్ గడ్డపై అరెస్టుల కోసం వేటగాళ్లలా ఏపీ పోలీసులు వాలిపోవడం భలే విచిత్రం.రాజకీయ విమర్శలని ఎదుర్కొనే సత్తా లేక, ఒక విద్యావేత్త గొంతు నొక్కడానికి సరిహద్దులు దాటి మరీ ఇంత కక్షసాధింపా? 'తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకోం' అంటూ కవితక్క చంద్రబాబు నివాస ముట్టడికి పిలుపునివ్వడం, బీసీ నేత రామకోటి ప్రాణత్యాగానికైనా సిద్ధమనడంతో వాతావరణం అప్పుడే హీటెక్కింది. తప్పు తెలుసుకుని తగ్గిన మేధావిని కూడా ఇలా వేటాడటం చూస్తుంటే.. భావప్రకటనా స్వేచ్ఛకు కాలం చెల్లిందనిపిస్తోంది!




**హైదరాబాద్, మే 25: భారత శక్తి** తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో రాజకీయ సెగలు ఒక్కసారిగా రాజేసుకున్నాయి. ప్రముఖ విద్యావేత్త, రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌ను లక్ష్యంగా చేసుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వరుస కేసులు నమోదు చేయడం, ఆయన అరెస్టుకు ఏపీ పోలీసులు హైదరాబాద్‌లో రంగంలోకి దిగారన్న ప్రచారం తెలంగాణ సమాజంలో తీవ్ర కలకలం రేపుతోంది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారంటూ ఏపీలో నమోదైన ఎఫ్ఐఆర్‌లపై తెలంగాణ మేధావి వర్గం, రాజకీయ శ్రేణులు నిప్పులు చెరుగుతున్నాయి. ఒక విద్యావేత్తపై ఈ తరహా నిరంకుశ పోకడలకు దిగడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టని పలువురు మండిపడుతున్నారు.

### 'బాబు' నివాసం ముట్టడిస్తాం : కె. కవిత తీవ్ర హెచ్చరిక

తెలంగాణ మేధావుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని తెలంగాణ రక్షణ సేన (౦=ూ) అధినేత్రి కె. కవిత స్పష్టం చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను వేధించడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని సవాలు చేయడమేనని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. "రాజకీయ విమర్శలను ఎదుర్కొనే ధైర్యం లేకనే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

2లో..



## హైదరాబాద్ మెట్రోకు భారీ ఊరట

### రూ.13,600 కోట్ల రుణాల రీఫైనాన్స్!

- ఐఆర్ఎఫ్‌సీతో రూ.13,600 కోట్ల భారీ డీల్
- 20 ఏళ్ల పాటు చెల్లింపుల వెసులుబాటు
- ప్రభుత్వానికే మెట్రో 100 శాతం వాటా
- నగరంలో మరింత పెరగనున్న మెట్రో విస్తరణ

**హైదరాబాద్ (భారత శక్తి)** మెట్రో రైలు ప్రాజెక్టుకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చేలా కీలక ఒప్పందం కుదిరింది. రూ. 13,600 కోట్ల రుణాలను రీఫైనాన్స్ చేయడానికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (IRFC) ముందుకు వచ్చింది. ఈ మేరకు ఢిల్లీలో ఇరు సంస్థల ఉన్నతాధికారులు అధికారికంగా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

### 20 ఏళ్ల పాటు ఊరట

ఐఆర్ఎఫ్‌సీ సీఎండీ మనోజ్‌కుమార్ దూబె, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సమక్షంలో ఈ డీల్ ఖరారైంది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం రాబోయే 20 ఏళ్ల కాలపరిమితితో, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ రుణాన్ని చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. దీనివల్ల హైదరాబాద్ మెట్రోపై ఉన్న తక్షణ ఆర్థిక భారం తగ్గనుంది. ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు కీలక విషయాన్ని వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టులో 100 శాతం యాజమాన్య వాటా పూర్తిగా ప్రభుత్వానికే బదిలీ అయినట్లు స్పష్టం చేశారు. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

దేశ ఆర్థిక వృద్ధిలో హైదరాబాద్ నగరం కీలక ఇంజిన్‌లా మారుతోందని సీఎస్ పేర్కొన్నారు. మెట్రో రైలు కనెక్టివిటీని మరింత విస్తరించడం ద్వారా నగరంలో ట్రాఫిక్ రద్దీ చాలావరకు తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రీఫైనాన్స్ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వం, ఐఆర్ఎఫ్‌సీ, ఎల్‌అండ్‌టీ, హెచ్ఎంఆర్ఎల్ బృందాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఇదేనా ప్రజా పాలన హరీష్ ఫైర్




**హైదరాబాద్, (భారత శక్తి)** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైద్య సేవలు కుప్పకూలాయని మాజీ మంత్రి హరీష్ రావు ట్విట్టర్ వేదికగా ఆరోపించారు. తాండూరులో అంబులెన్స్ రాక రైల్వే ప్లాట్‌ఫారమ్‌పై మహిళ ప్రసవించడం, భద్రాచలంలో వాహనం లేక మృతదేహాన్ని భుజాలపై మోసుకెళ్లడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో పేదల కోసం తెచ్చిన 108 అంబులెన్స్, పరమపద వాహనాలను నిర్వీర్యం చేశారని మండిపడుతూ.. ప్రజలు కోరుకున్న ప్రజా పాలన ఇదేనా అని ప్రశ్నించారు. తక్షణమే అత్యవసర సేవలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెప్పుకుంటున్న ప్రజా పాలనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీష్ రావు సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సంరక్షణ వ్యవస్థ తీవ్రంగా అస్తవ్యస్తమైందని పేద

2లో..

## బీ అలర్ట్.. రోళ్లు పగిలే 'రోహిణి కార్తె' ప్రారంభం

- జూన్ 7 వరకు కొనసాగనున్న రోహిణి కార్తె
- మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యధికంగా ఉండనున్న ఎండ ప్రభావం
- అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడమే మంచిది



**హైదరాబాద్ (భారత శక్తి)** తెలుగు పంచాంగం ప్రకారం నేటి (మే 25) నుంచి అత్యంత శక్తిమంతమైన 'రోహిణి కార్తె' ప్రారంభమైంది. జూన్ 7 వరకు కొనసాగే ఈ కాలంలో ఎండల తీవ్రత గరిష్ఠ స్థాయికి చేరుకుంటుందని, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వైద్య, వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన ఎండల వల్ల ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగి, వడగాలులు, ఉక్కపోత తీవ్రరూపం దాలుస్తాయి. ఈ కాలంలో శరీరంలోని నీటి శాతం వేగంగా తగ్గిపోయి డీహైడ్రేషన్, వడదెబ్బ, తీవ్ర అలసట వంటి ముప్పులు పొంచి ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ ప్రభావం అత్యధికంగా

2లో..

## ఇంధన ధరల పెంపు..

### ట్యాక్స్ తగ్గిస్తే రూ.1 లక్ష కోట్ల నష్టం: నిర్మలా సీతారామన్

- పన్నులు తగ్గిస్తే లక్ష కోట్ల నష్టమన్న నిర్మల
- '3-ఎఫ్' అంశాలపై కేంద్రం ప్రత్యేక నిఘా
- దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందన్న మంత్రి
- భయాందోళనలు సృష్టించొద్దంటూ రాహుల్ గాంధీకి పరోక్ష కౌంటర్



**న్యూఢిల్లీ (భారత శక్తి)** దేశంలో ఇంధన ధరలు మరోసారి పెరగడంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం స్పందించారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను తగ్గిస్తే ప్రభుత్వం దాదాపు రూ. లక్ష కోట్ల ఆదాయం నష్టపోతుందని వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందన్నారు. కొందరు పనిగట్టుకొని ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని, అలాంటి వాటికి తావులేదని స్పష్టం చేశారు.

### రాహుల్‌కు పరోక్ష కౌంటర్

స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ఐడీబీఐ) 37వ వార్షికోత్సవంలో మాట్లాడిన మంత్రి ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. పశ్చిమాసియా సంక్షోభం ఉన్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందని స్పష్టం చేశారు. కానీ కొంతమంది అంతా మునిగిపోతోందనేలా భయాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పరోక్షంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఆయన దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభం ఎదుర్కోబోతోందని హెచ్చరించిన విషయం తెలిసిందే.

### '3-ఎఫ్' ఫార్ములా

పశ్చిమాసియా సంక్షోభం మొదలై మూడు నెలలు కావస్తున్న తరుణంలో ప్రభుత్వం '3-ఎఫ్' (ఫ్యూయల్,

2లో..

## పుష్కరాల పనులను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

### - బోటులో పర్యటించి క్షేత్రస్థాయి పరిశీలన



**రాజమండ్రి,(భారత శక్తి)** గోదావరి నదిలోకి కలిసే కాలుష్యకారక వ్యర్థాలు, మురుగు జలాలు, వాటి నిర్వహణపై పూర్తిస్థాయి ఆడిట్ చేపట్టి తక్షణమే నివేదిక ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర ఉన్నతాధికారులను, తూర్పు గోదావరి జిల్లా అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు కాలుష్య నివారణకు తీసుకున్న చర్యలు ఏంటో తెలపాలని, భవిష్యత్తులో చేయబోయే పనులపై స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. మనకు జీవితాన్ని ఇచ్చే నదులను చంపవద్దని.. గోదావరి,

2లో..

## పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై స్పందించిన మల్లికార్జున ఖర్గే

- దేశంలో ఇంధన ధరల భారం రోజురోజుకూ పెరుగుతోందన్న ఖర్గే
- రోజువారీ దోపిడీ వల్ల ఎవరు బాగుపడుతున్నారని ప్రశ్న
- సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి ప్రభుత్వం పెట్రోల్ జల్లుతోందని విమర్శ



**న్యూఢిల్లీ (భారత శక్తి)** అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతుండటంతో ప్రభుత్వరంగ చమురు సంస్థలు ఆ భారాన్ని వినియోగదారులకు బదలాయిస్తున్నాయి. ఈరోజు మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. దీంతో లీటర్ పెట్రోల్‌పై రూ. 2.84, డీజిల్‌పై రూ. 2.86 చొప్పున పెరిగింది. పెట్రోల్, డీజిల్ ధరలు గత రెండు వారాల్లో పలుమార్లు పెరిగాయి. దీంతో ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 102.12, లీటర్ డీజిల్ రూ. 95.25గా, హైదరాబాద్‌లో పెట్రోల్ రూ. 115.58, డీజిల్ ధర రూ. 103.74గా ఉంది.

2లో..

# మేధావి వర్గంపై కక్షసాధింపు? కూటమి దూకుడుపై 'తెలంగాణ' ఆగ్రహజ్వాలలు!





ఇక్కడి మేధావులపై కక్షసాధింపు చర్యలకు దిగుతోంది. చట్టాన్ని అతిక్రమించి హైదరాబాద్ గడ్డపై ప్రొఫెసర్‌ను అరెస్ట్ చేయడానికి ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోం. అవసరమైతే హైదరాబాద్‌లోని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు నివాసాన్ని ముట్టడించడానికి కూడా వెనుకాడం."

**కె. కవిత, టీఆర్ఎస్ చీఫ్,**

**ప్రాణత్యాగానికైనా సిద్ధం:** బీసీ నేత అల్లంపల్లి రామకోటి ఈ వివాదంపై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు అల్లంపల్లి రామకోటి తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వ వైఖరిని ఉతికారేశారు.
మేధావులకు రక్షణగా నిలుస్తాం: తెలంగాణ గడ్డపై ఉన్న విద్యావేత్తలకు, మేధావులకు ఎలాంటి అన్యాయం జరిగినా సహించేది లేదు.'కవితక్క' పిలుపే మాకు శాసనం: అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే.. కవితక్క పిలుపు మేరకు ఎంత దూరమైనా వెళ్తాం. పోలీసుల దౌర్జన్యాలను అడ్డుకుంటాం: అక్రమ అరెస్టే లక్ష్యంగా వస్తున్న ఏపీ పోలీసుల దౌర్జన్యాలను అడ్డుకోవడానికి, తెలంగాణ ఆత్మగౌరవ రక్షణ కోసం అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధమని రామకోటి ప్రకటించారు.

### వెనక్కి తీసుకున్నా వేటాడటమేనా? సర్వత్రా విమర్శలు

గత మే 19న ఒక డిబేట్‌లో చేసిన వ్యాఖ్యలను ప్రొఫెసర్ నాగేశ్వర్ మే 21 నాడే బేషరతుగా వెనక్కి తీసుకున్న విషయాన్ని మేధావులు గుర్తుచేస్తున్నారు.

నిందితుడు స్వయంగా వివరణ ఇచ్చి, వ్యాఖ్యలను ఉపసంహరించుకున్న తర్వాత కూడా క్రిమినల్ సెక్షన్ల (BNS 192, 196, 352) కింద అరెస్టులకు ప్రయత్నించడం కేవలం రాజకీయ కక్షపూరిత చర్యేనని ప్రజాస్వామ్యవాదులు అభిప్రాయపడుతున్నారు.

### కూటమి మిత్రపక్షాల్లోనూ అసంతృప్తి!

ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వ తీరుపై అటు వైఎస్సార్‌సీపీ, ఇటు టీఆర్ఎస్ నేతలతో పాటు, కూటమిలోని మిత్రపక్షమైన బీజేపీకి చెందిన కొందరు నేతలు కూడా లోలోపల తప్పుబడుతుండటం గమనార్హం. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఏపీ పోలీసుల కదలికలపై తెలంగాణ శ్రేణులు నిఘా ఉంచినట్లు, ఏ క్షణంలోనైనా చంద్రబాబు నివాస ముట్టడికి భారీగా తరలివెళ్లేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు రెండు రాష్ట్రాల మధ్య సరికొత్త రాజకీయ ఉత్కంఠకు దారితీస్తున్నాయి.

# రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదుల నిరసన




ఎల్బీనగర్, మే 25 (భారత శక్తి): మహా నగరంలో న్యాయవాదులపై దాడులను నిరసిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేసిన బార్ అసోసియేషన్ సభ్యులు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గోలి విప్లవ రెడ్డి, జనరల్ సెక్రెటరీ వోద్యారపు రవికుమార్ మాట్లాడుతూ, న్యాయవాదులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మాసబ్ ట్యాంక్ లో న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ ను కారుతో యాక్సిడెంట్ చేసి దారుణంగా చంపడం క్రూరమైన చర్య అని, వక్ఫ్ బోర్డ్ ఆస్తులపై గతం నుంచి కొట్లాడుతున్న న్యాయవాదిపై గతంలోనూ దాడులు జరిగాయని, అప్పుడే పోలీసులకు ఫిర్యాదులు చేసినా సరైన పద్ధతిలో పట్టించుకోలేదని,అందువల్లే దారుణ హత్యకు గురి అయ్యాడని,రాష్ట్ర గవర్నర్ దగ్గర పెండింగ్ ఉన్న న్యాయవాదుల రక్షణ కోసం చట్టం వెంటనే అమలు చేయాలని కోరారు. న్యాయవాదులపై దాడులు చేసే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బొడ్డు రమేష్ కుమార్, జాయింట్ సెక్రటరీ పి.మల్లేష్, లైబ్రరీ కార్యదర్శి పిఆర్వి ప్రసాద్ తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## హోంగార్డు నాముండ్ల సుందరయ్యకు సీపీ గౌస్ ఆలం ఘన వీడ్కోలు

**కరీంనగర్ (భారత శక్తి)** హోంగార్డుగా చేరి, మూడు దశాబ్దాలుగా నిస్వార్థంగా సేవలందించిన నాముండ్ల సుందరయ్య పదవీ విరమణ సందర్భంగా సోమవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై,సుందరయ్యను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ.నైట్ డ్యూటీ కోర్టు వాచ్ విధులు నిర్వహించిన సుందరయ్య , 16-3-1996 న విధుల్లో చేరి తన 30 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో ఎంతో అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. పోలీసు శాఖలో హోంగార్డుల పాత్ర కీలకమని, క్షేత్రస్థాయిలో వారు అందించే సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన సుందరయ్య శేష జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో గడవాలని ఆయన ఆకాంక్షించారు.?అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది సమక్షంలో సుందరయ్యకు పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.తన సర్వీసు కాలంలో తోటి సిబ్బందితో స్నేహపూర్వకంగా ఉంటూ, విధుల్లో క్రమశిక్షణ పాటించిన ఆయనను పలువురు అధికారులు అభినందించారు.ఈ వీడ్కోలు కార్యక్రమంలో ఏసీపీ ఏఆర్ ప్రతాప్,రిజర్వ్ ఇన్‌స్పెక్టర్, హోంగార్డ్స్ శ్రీధర్ రెడ్డి,హెడ్ కానిస్టేబుల్ రవి, కమిషనరేట్‌కు చెందిన ఇతర పోలీసు అధికారులు, హోంగార్డులు పాల్గొన్నారు

## 44వ మహానాడును విజయవంతం చేయండి

**నందవరం (భారత శక్తి)**మండలం తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 44వ మహానాడు వేడుకలను అత్యంత ఘనంగా, విజయవంతంగా నిర్వహించాలని మండల కన్వీనర్ కాసిం వలి, టిడిపి నాయకులు కార్యకర్తలకు,అభిమానులకు పిలుపునిచ్చారు. ఈ ఏడాది మహానాడు నెల్లూరు జిల్లాలోని కోడవలూరు మండలం, రాచార్లపాడు వద్ద గల ఐఎఫ్ఎఫ్సీఓ సెజ్ ప్రాంగణంలో మే 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు జరగనుంది.పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జరుగుతున్న మొదటి మహానాడు కావడంతో,దీన్ని చారిత్రక ఘట్టంగా మలచాలని నాయకులు పిలుపునిచ్చారు.మండలంలోని ప్రతి గ్రామం నుండి కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున నెల్లూరుకు తరలివచ్చి ఈ మహానాడును విజయవంతం చేయాలని కోరారు.మహానాడు ప్రాంగణంలో పార్టీ క్రమశిక్షణను పాటిస్తూ, క్రమపద్ధతిలో కార్యక్రమాలు జరిగేలా నాయకులకు సహకరించాలని సూచించారు.ప్రభుత్వ విధానాల చర్చ: రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు కార్యాచరణ మరియు ప్రజలకు చేరువయ్యే అంశాలపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు."పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మహానాడు, రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చబోతోంది. మన జిల్లాలోనే ఈ మహానాడు జరగడం మనందరికీ గర్వకారణం. కార్యకర్తలందరూ ఐక్యంగా ఉండి, ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేద్దాం." - మండల టీడీపీ అధ్యక్షులు కాసిం వలి నాయకులు.మహానాడుకు హాజరయ్యే కార్యకర్తల కోసం రవాణా,వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు స్థానిక పార్టీ కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై స్పందించిన మల్లికార్జున ఖర్గే

పెట్రోల్, డీజిల్ పెరుగుదలపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఇంధన ధరల భారం రోజురోజుకూ పెరుగుతోందని అన్నారు. రోజువారీ దోపిడీ వల్ల ఎవరు బాగుపడుతున్నారని ప్రశ్నించారు. సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లుతోందని విమర్శించారు. రెండు వారాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగుసార్లు పెరిగాయని మండిపడ్డారు. 2014లో లీటర్ పెట్రోల్ రూ.71.41గా ఉంటే ఇప్పుడు రూ.102.12కు చేరుకుందని గుర్తు చేశారు. రోజువారీ ఇంధన దోపిడీ ఇంకా ముగిసిపోలేదని హెచ్చరించారు. గత పన్నెండేళ్లలో మోదీ ప్రభుత్వం ఇంధనంపై రూ.43 లక్షల కోట్లు దోచుకుందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగోసారి పెరగడంతో ఈరోజు హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐవోసీ షేర్లు పెరిగినట్లు చెప్పారు. ప్రజల అవసరాల కంటే లాభానికే ప్రాధాన్యం ఇవ్వడం బీజేపీ నైజమని విమర్శించారు. ఇంధన ధరల పేరుతో రైతుల నుంచి ఎంఎస్ఎంఈల వరకు, సమాజంలోని ప్రతి వర్గం బీజేపీ దోపిడీ భారాన్ని మోస్తోందని అన్నారు.

## ఇంధన ధరల పెంపు..

ఫెర్టిలైజర్, ఫారెక్స్ - ఇంధనం, ఎరువులు, విదేశీ మారకం)పై ప్రత్యేక దృష్టి సారించిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. అంతర్జాతీయ ఒత్తిళ్ల వల్ల ఎరువుల ధరలు ఊహించని స్థాయికి చేరాయని, బంగారం ధరలు పెరగడం కూడా సవాలుగా మారిందని చెప్పారు. బయటి సంక్షోభాలను తట్టుకునేలా మోదీ నేతృత్వంలో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు.ప్రస్తుత సవాళు అన్నీ అంతర్జాతీయ పరిస్థితుల వల్ల వచ్చినవేనని, దేశీయంగా ఆర్థిక పరిస్థితి సానుకూలంగానే ఉందని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. సామాన్య ప్రజలు సాధిస్తున్న విజయాలను మరిచిపోయి, కేవలం నెగటివిటీని ప్రచారం చేయడం సరికాదన్నారు. మన దేశం ఇలాంటి భయానక ప్రచారాలను భరించలేదని, మన మాటలు, చేతల ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని, ధైర్యాన్ని నింపాల్సిన అవసరం ఉందని హితవు పలికారు.

## ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను నిర్వహించుకోవాలి



**తుగ్గలి:(భారత శక్తి)** ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగ వేడుకలను నిర్వహించుకోవాలని జొన్నగిరి ఎస్సై మల్లికార్జున తెలియజేశారు.బక్రీద్ పండుగను పురస్కరించుకొని కర్నూలు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం శాంతి సమావేశం నిర్వహించారు.జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి హిందూ,ముస్లిం మత పెద్దలు,గ్రామ ప్రముఖులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్ఐ మల్లికార్జున మాట్లాడుతూ బక్రీద్ పండుగను సోదరభావంతో,మత సామరస్యంతో జరుపుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు,గొడవలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.పండుగ వేళ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెట్టవద్దని,వదంతులు నమ్మవద్దని సూచించారు.మత పెద్దలు మాట్లాడుతూ గ్రామంలో అన్ని మతాల వారు కలిసిమెలిసి ఉంటున్నామని,పోలీసుల సూచనల మేరకు పండుగను ప్రశాంతంగా జరుపుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎర్రగుడి వెంకటస్వామి, ఉప్పర్లపల్లె శ్రీనివాస గౌడ్,రాము నాయక్, జొన్నగిరి పోలీస్ సిబ్బంది,ఇరు మతాలకు చెందిన పెద్దలు,యువకులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

### - జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ (భారత శక్తి)** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 353 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం..

మండలంలో భారీగా వచ్చిన ఈదురుగాలులకు ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.ఘట్‌కేసర్‌లో వడగళ్ల వర్షం కురిసింది. మెదక్, సూర్యాపేట జిల్లాల్లోనూ వర్షం కురవడంతో ఎండల తీవ్రతకు ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. మెదక్ పట్టణంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మెదక్ సహా పలు ప్రాంతాల్లో మార్కెట్ యార్డులు, ధాన్యం సేకరణ కేంద్రాల్లో బస్తాలు తడవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

## పోక్సో కేసులో దోషికి రెండు మరణశిక్షలు విధిస్తూ కోర్టు తీర్పు

ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థినిపై ధర్మ మునీశ్వరన్ అనే వ్యక్తి అత్యాచారం చేసి హత్య చేసినట్లు విచారణలో తేలింది.ఈ కేసును విచారించిన న్యాయస్థానం, విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడటమే కాకుండా అతి దారుణంగా ప్రవర్తించినందుకు గానూ ఈ శిక్షలు విధిస్తున్నట్లు తెలిపింది. దీనిని అరుదైన కేసుగా పేర్కొన్న పోక్సో కోర్టు, గతంలోనూ పలు నేరాల్లో అతడికి ప్రమేయం ఉన్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపింది.విలాతికుళం సమీపంలోని వేదనాథం గ్రామానికి చెందిన పన్నెండో తరగతి చదువుతున్న విద్యార్థిని మార్చి 10వ తేదీ సాయంత్రం నుంచి కనిపించకుండా పోయింది. తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు వేదనాథం అటవీ ప్రాంతంలో తీవ్ర గాయాలతో విగతజీవిగా కనిపించింది. తాము ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు వెంటనే స్పందించలేదని తల్లిదండ్రులు ఆరోపించారు.ఈ కేసుకు సంబంధించి ఉన్నతాధికారులు స్థానిక ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేశారు. అనంతరం దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా మార్చి 19న నిందితుడిని అరెస్టు చేశారు. అతడు గతంలోనూ ఓ వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థినిపై హత్యాచారం జరిగిన సమయంలో అతడు బెయిల్‌పై బయట ఉన్నాడు

## ఇదేనా ప్రజా పాలన హరీష్ ఫైర్

ప్రజల ప్రాణాలకు రక్షణ కరువైందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల తాండూరు మరియు భద్రాచలం ప్రాంతాల్లో చోటుచేసుకున్న రెండు వేర్వేరు హృదయవిదారక సంఘటనలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టారు. ఈ మేరకు ఆయన చేసిన ట్వీట్ చేశారు.'వికారాబాద్ జిల్లా తాండూరులో ఒక నిరుపేద గర్భిణీ స్త్రీ ప్రసవ వేదనతో తల్లడిల్లుతూ అత్యవసర సహాయం కోసం 108 అంబులెన్స్ సేవలకు పలుమార్లు ఫోన్ చేసింది. అయితే ఎన్నిసార్లు పిలిచినా అంబులెన్స్ సకాలంలో స్పందించకపోవడంతో విధిలేక ఆమె రైల్వే ప్లాట్‌ఫారమ్‌పైనే బిడ్డకు జన్మనివ్వాల్సి వచ్చింది. ఒక గర్భిణీకి కనీస వైద్య రవాణా సదుపాయం కల్పించలేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి పరాకాష్ట' అని హరీష్ రావు దుయ్యబట్టారు. అలాగే భద్రాచలంలో జరిగిన మరో సంఘటన అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఒక నిరుపేద కుటుంబంలో వ్యక్తి మరణిస్తే మృతదేహాన్ని గౌరవప్రదంగా స్వగ్రామానికి తరలించేందుకు భద్రాచలం ఏరియా ఆసుపత్రి యాజమాన్యం కనీసం ఒక ఉచిత అంబులెన్స్ కూడా సమకూర్చలేదన్నారు. దీనితో ఆ పేద కుటుంబ సభ్యులు తమ బంధువు శవాన్ని భుజాలపైనే మోసుకుంటూ వెళ్లాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రతికున్నప్పుడు ప్రాణాలు కాపాడటానికి అంబులెన్స్‌లు లేవు.. చనిపోయాక కనీస మానవీయ గౌరవంతో తీసుకెళ్లడానికి వాహనాలు లేవని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు.గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పేద, నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు 108 అత్యవసర సేవల వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు మృతదేహాలను ఉచితంగా తరలించేందుకు పరమపద వాహన సేవలను ప్రవేశపెట్టామని హరీష్ రావు గుర్తుచేశారు. నాడు పేదల పాలిట రక్షణ కవచాలుగా ఉన్న ఈ ఉచిత సేవలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నిర్వీర్యం చేసిందని ఆయన ప్రశ్నించారు. ఇవి కేవలం పరిపాలనాపరమైన సాధారణ లోపాలు మాత్రమే కావని.. అత్యవసర పరిస్థితులు, అనారోగ్యం, ప్రసవాలు, మరణాల సమయంలో పూర్తిగా ప్రభుత్వ వైద్యంపైనే ఆధారపడే నిరుపేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి ఇవి నిలువెత్తు సాక్ష్యాలని మండిపడ్డారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా నిద్ర మత్తు వీడి, తక్షణమే అత్యవసర ఆరోగ్య సేవలను పునరుద్ధరించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. అన్ని జిల్లాల్లో 108 అంబులెన్స్‌లు, శవవాహన సేవలు నిరంతరాయంగా, సక్రమంగా పనిచేసేలా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘోర పరిణామాలకు కారణమైన అధికారులను, వ్యవస్థలను జవాబుదారీలను చేస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలకు జీవితంలోనూ, అత్యవసర సమయాల్లోనూ, ఆఖరికి మరణంలోనూ కనీస మానవీయ గౌరవాన్ని పొందే హక్కు ఉందని దాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని ఆయన తన ట్వీట్‌లో స్పష్టం చేశారు.

## బీ అలర్ట్.. రోళ్లు పగిలే 'రోహిణి కార్తె' ప్రారంభం

ఉంటుంది. కాబట్టి ఆ సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడం మంచిది. ఒకవేళ వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలి. దాహం వేయకపోయినా తరచుగా మంచి నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, ఓఆర్ఎస్ (రా=రా) వంటి పానీయాలు తీసుకోవడం ద్వారా శరీరాన్ని చల్లగా ఉంచుకోవచ్చు. అలాగే పుచ్చకాయ, దోసకాయ వంటి నీటి శాతం ఎక్కువ ఉన్న పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలి.

## పుష్కరాల పనులను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

కృష్ణ నదులను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు.వచ్చే 6 నెలల్లో నదుల్లో కాలుష్యం నిర్వహణలో స్పష్టమైన మార్పు కనిపించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను 'కాలుష్యరహిత గోదావరి' అనే ప్రత్యేక థీమ్‌తో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిశ్చయించుకుందని వెల్లడించారు. గోదావరి పుష్కరాలు జూన్ 26 నుండి జూలై 7, 2027 వరకు నిర్వహించేందుకు ఏపీ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.రాజమహేంద్రవరం పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం 6 గంటలకే పవన్ కళ్యాణ్ పుష్కరాల ఘాట్ నుంచి కోటిలింగాలు ఘాట్ వరకు పడవలో ప్రయాణించి, గోదావరి జలాల కాలుష్యకారక ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా గోదావరి పుష్కరాల పనుల తీరును, త్వరలో చేపట్టబోయే ప్రణాళికలను పవన్ కళ్యాణ్ స్వయంగా సమీక్షించారు. గోదావరి గట్ల సుందరీకరణ పనులు ఎంతవరకు వచ్చాయి, పుష్కరాల నేపథ్యంలో గట్లను ఎలా తీర్చిదిద్దబోతున్నారు అనే వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా చింతలమ్మ ఘాట్ వద్ద నల్లా ఛానల్ ద్వారా రాజమహేంద్రవరం నగర మురుగునీరు గోదావరిలోకి కలిసే ప్రాంతాన్ని పవన్ కళ్యాణ్ స్వయంగా పరిశీలించారు. నదీ తీరంలో జరుగుతున్న కాలుష్యాన్ని కళ్లారా చూసిన ఆయన, నీటిని శుద్ధి చేస్తున్న విధానంపై ఆరా తీశారు. అక్కడే ఉన్న క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడి, వ్యర్థాలను వేరు చేసే పద్ధతులను పరిశీలించారు. నగర గృహాల నుండి రోజువారీగా సుమారు 55 ఎం.ఎల్.డి. మురుగునీరు వస్తోందని, ఈ నీటిని శుద్ధి చేసే విధానం పూర్తిగా శాస్త్రీయంగా జరగాలని అధికారులను ఆదేశించారు. మురుగునీటిని నేరుగా నదిలోకి వదలడం వల్లే జలాలు కలుషితం అవుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని హెచ్చరించారు.గోదావరి పుష్కరాలకు ఖర్చు చేసే ప్రతి పైసాను ప్రజలకు ఉపయోగపడేలా, నది తీరాన్ని కాపాడే మంచి పనులకే వినియోగించాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. కేవలం కాగితాల్లో లెక్కలతో సరిపెట్టకుండా పూర్తిస్థాయి యాక్షన్ ప్లాన్‌తో ముందుకు వెళ్లాలని సూచించారు. కేంద్ర జల శక్తి ద్వారా ఎన్.ఆర్.సి.పి. నిధులు రూ. 416 కోట్లలో, ఇప్పటికే రూ. 95 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు వచ్చాయని వెల్లడించారు. ఈ నిధులతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కొత్త ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నిర్మించాలని, పూర్తిస్థాయిలో మురుగు లేకుండా జలాలను శుద్ధి చేసిన తర్వాతే గోదావరిలోకి విడిచిపెట్టే బాధ్యతను అధికారులు తీసుకోవాలని ఆదేశించారు.అదేవిధంగా ఆంధ్ర పేపర్ మిల్స్ కాలుష్య జలాలు గోదావరిలోకి విడుదల కావడంపై పవన్ కళ్యాణ్ తీవ్రంగా ఆరా తీశారు. దీనిపై రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య స్పందిస్తూ.. ప్రస్తుతం పేపర్ మిల్లు ద్వారా బయటకు వచ్చే వ్యర్థాలను దూరంగా ఉన్న లంక గ్రామాల్లో విడిచి పెడుతున్నారని, దీనికి ప్రత్యామ్నాయంగా ఆ కంపెనీ మరో ప్రాంతంలో శుద్ధి చేసేందుకు యోచిస్తోందని వివరించారు. దీనిపై పవన్ కళ్యాణ్ స్పందిస్తూ.. ప్రత్యామ్నాయ పనులు వేగంగా జరిగేలా చూడాలని, అప్పటివరకు సదరు కంపెనీ మరో సొంత శుద్ధి ప్లాంట్ నిర్మించుకునేలా యాజమాన్యానికి కఠిన ఆదేశాలు ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు.బోటు ప్రయాణం ప్రారంభించినప్పటి నుండి మున్సిపల్ కార్యాలయానికి చేరుకునే వరకు పవన్ కళ్యాణ్ ప్రతి అంశాన్ని పరిశీలించారు. ప్రత్యక్షంగా ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్దకు వెళ్లి వేరు చేస్తున్న వ్యర్థాలను చూసి, వాటిని తర్వాత ఏం చేస్తారని అడిగి తెలుసుకున్నారు. వ్యర్థ జలాల శుద్ధికి సరికొత్త అంతర్జాతీయ విధానాలు వస్తున్నాయని, దానికి అనుగుణంగా అధికారులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలని సూచించారు. అనంతరం పుష్కరాల పనుల ఉన్నత స్థాయి సమీక్ష కోసం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయానికి పవన్ కళ్యాణ్ చేరుకున్నారు.ఈ పర్యటనలో ఆయనతో పాటు మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర పోలీసు హౌసింగ్ బోర్డ్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహ కిషోర్, కార్పొరేషన్ కమిషనర్ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## తెలుగు రాష్ట్రాల్లో సర్ సెగలు

దేశవ్యాప్తంగా పలు వివాదాలతో సంచలనం రేపుతున్న ఓటర్ల జాబితా ప్రక్షాళన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) సెగ ఇక తెలుగు రాష్ట్రాలకు తాకనుంది. వేసవి కాలం ముగిసి తొలకరి రుతుపవనాలు ప్రవేశించే జూన్ నెలలో తెలంగాణలో 'సర్' వేడి మొదలుకానుంది. ఇప్పటికే దేశంలో రెండు దశల్లో ముగిసిన ఓటర్ల జాబితా ప్రక్షాళన తుది మూడో దశలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో సహా మొత్తం 16 రాష్ట్రాల్లో, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో చేపట్టనున్నారు. మొదటి రెండు దశల్లో పశ్చిమబెంగాల్, అసోం, బీహార్, తమిళనాడు, కేరళ, రాష్ట్రాల్లో అక్కడి అసెంబ్లీ ఎన్నికల ముందు 'సర్' ప్రక్రియ నిర్వహించడంతో ఎన్నికల్లో కీలకాంశంగా మారింది. ఇప్పుడు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు చాలా కాలం ఉన్నా రాష్ట్రంలో 'సర్' రాజకీయ వేడి పుట్టించింది. స్వయం ప్రతిపత్తి సంస్థ అయిన ఎన్నికల సంఘం ఎలాంటి విమర్శలు ఎదుర్కోకుండా నిష్పక్షపాతంగా తెలంగాణలో 'సర్'ను విజయవంతంగా పూర్తిచేయాలని రాష్ట్ర ఓటర్లు కోరుకుంటున్నారు. కాలానుగుణంగా దేశంలో ఓటర్ల జాబితాను ప్రక్షాళించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. దేశంలో ఇంతకుముందు 195152, 1960, 1980, 1993, 1995, 2002 2004 సంవత్సరాల్లో దేశంలో 'సర్' ప్రక్రియ నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాను సవరించారు. 2025 26లో భాగంగా తొలుత బీహార్‌లో, అనంతరం 12 రాష్ట్రాల్లో 'సర్' నిర్వహించి, ఇప్పుడు చివరగా 16 రాష్ట్రాల్లో, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 'సర్' చేపట్టేందుకు సిద్ధమైంది. ఓటర్ల జాబితాలో డూప్లికేట్, చనిపోయిన వారు, చిరునామా మారిన వారు, రెండు చోట్ల ఓట్లు ఉన్నావారు, అర్హత లేని వారి పేర్లను తొలగించి ప్రక్షాళన చేయడమే 'సర్' లక్ష్యమని ఎన్నికల సంఘం పదేపదే చెబుతున్నా దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ కూటమియేతర పార్టీలు మాత్రం 'సర్' ప్రక్రియను 'ఎంపిక చేసిన ప్రక్షాళన'గా విమర్శిస్తున్నాయి. దీనిపై పలు రాజకీయ పార్టీలు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నాయి. 'సర్' ప్రక్రియ ఏ ఒక్క పార్టీకి అనుకూలంగా నిర్వహించడం లేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత భారత ఎన్నికల సంఘంపైన ఉంది. ఓటర్ల జాబితా ప్రక్షాళన పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని ఎన్నికల సంఘం చెబుతున్నా తెలంగాణలో రాజకీయ పార్టీలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం అధికారులను కలిసి తమ సందేహాలు, సూచనలు తెలియజేస్తున్నారు. పార్టీలు తమ నేతలను, కార్యకర్తలను 'సర్'పై జాగృతం చేశాయి. మొదటి రెండు దశ 'సర్' ప్రక్రియలో దాదాపు 7.2 కోట్ల ఓట్లు తొలగించబడ్డాయి. అదే సమయంలో సుమారు 2 కోట్ల మంది ఓటర్లను చేర్చారు. రాష్ట్రాలవారీగా పరిశీలిస్తే బీహార్‌లో 65 లక్షలు (8.3%), ఉత్తరప్రదేశ్‌లో 2.5 కోట్లు (13%), తమిళనాడులో 97.3 లక్షలు (14%), పశ్చిమబెంగాల్‌లో 90 లక్షలు (11%), గుజరాత్‌లో 70 లక్షలు (14.5%), మధ్యప్రదేశ్‌లో 34.25 లక్షలు (6%), రాజస్తాన్‌లో 31 లక్షలు (5.7 ౘ), చత్తీస్‌గఢ్ లో 25 లక్షలు (11%) ఓట్లు 'సర్'లో తొలగించారు. మరోవైపు గోవా, లక్షద్వీప్, అండమాన్ నికోబార్‌లో పూర్తి గణాంకాలు వెల్లడి కాలేదు. సర్' ప్రక్రియ చేపట్టిన రాష్ట్రాల్లో ప్రధానంగా బీహార్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, గుజరాత్, అసోంలో వివాదాలు రేగాయి. బీహార్‌లో మొదట కోటి వరకు ఓట్లు తొలగిస్తారనే ప్రచారం జరిగినా రాజకీయ దుమారం, న్యాయస్థానాల జోక్యంతో చివరికి 65 లక్షల ఓట్లు రద్దు అయ్యాయి. ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్‌లో 'సర్' దేశవ్యాప్తంగా సంచనలం రేపింది. ఉన్నత న్యాయ స్థానం సుప్రీం కోర్టు పారదర్శకత కోసం న్యాయమూర్తులను పరిశీలకులుగా నియమించి ప్రజాస్వామ్యంపై భరోసా కలిగించింది. పలు సందర్భాల్లో ఎన్నికల సంఘానికి, రాష్ట్ర ప్రభుత్వానికి పలు సూచనలు, సలహాలు ఇచ్చింది. పశ్చిమబెంగాల్‌లో బిఎల్‌ఒలపై ఒత్తిడి పెరిగి దురదృష్టవశాత్తు కొంత మంది మరణించిన ఘటనలు కూడా జరిగాయి. అసెంబ్లీ ఎన్నికల ముగిసిన తర్వాత కూడా ఇంకా పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల తొలగింపు కేసులు న్యాయస్థానాల్లో ఉన్నాయి. తమిళనాడులో నాడు అధికారంలో ఉన్న డిఎంకె 97 లక్షల ఓట్ల తొలగింపుపై ఎన్నికల సంఘాన్ని తప్పుపట్టింది. అసోంలో అక్రమ బంగ్లాదేశ్ వలసదారుల అంశంతో 'సర్' సున్నితంగా మార్చింది. పలు రాష్ట్రాల్లో 'సర్' వివాదాస్పదమైన నేపథ్యం లో తెలంగాణలో కూడా ఎలా జరుగుతుందో అదే ఆందోళన కలగడం సహజమే. తెలంగాణలో 'సర్' నిర్వహణలో భాగంగా 2026 జూన్ 25 నుంచి జూలై 24 వరకు బిఎల్‌ఒలు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను ధ్రువీకరించనున్నారు. జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి, ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. తుది జాబితా అక్టోబర్ 1 లేదా అక్టోబర్ 10న విడుదల చేసే అవకాశముంది. రాష్ట్రంలో ఇప్పటికే ర్యాండవ్? మ్యాపింగ్ చేపట్టారు. 2002 ఓటర్ల జాబితాతో సరిపోలుస్తూ మ్యాపింగ్ నిర్వహిస్తున్నారు. తెలంగాణలో ప్రస్తుతం 3.32 కోట్ల మంది ఓటర్లుండగా ఇప్పటివరకు జరిగిన మ్యాపింగ్ ఆధారంగా 50 లక్షలకుపైగా ఓటర్లు తగ్గవచ్చనే అంచనాలున్నాయి. ఎన్నికల సంఘం రూపొందించిన 'డెమోగ్రఫీ సిమిలర్ ఎంట్రీస్' సాఫ్ట్‌వేర్‌తో బోగస్, డూప్లికేట్, రెండు చోట్ల ఉండే ఓట్లు తొలగించే వీలుంది. ప్రధానంగా గ్రేటర్ శివార్లలో, కొత్త కాలనీల్లో భారీగా ఓట్లు తొలగించడం, జోడించడం జరిగే అవకాశాలున్నాయి.

బిఎల్‌ఒలు, ఎన్యూమరేటర్లు రెండు మూడు సార్లు వచ్చి మరీ తనిఖీలు చేసిన తర్వాతనే తుది జాబితాను రూపొందిస్తారు. ఓటరు రిసిప్ట్ కాపీని డిజిటల్ రికార్డులో భద్రపరుస్తారు. ఓటర్లు 11 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి తమ రుజువుగా చూపించవచ్చని ఎన్నికల సంఘం ప్రకటించింది ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్‌లో 'సర్'లో కేంద్రబిందువుగా మారే అవకాశాలున్నాయి. నగరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో ఏపి నుంచి వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడిన వారితోపాటు ఇతర దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు భారీగా ఉన్నారు. వీరిలో కొందరికి రెండు రాష్ట్రాల్లోనూ ఓట్లుండే అవకాశాలున్నాయి. మ్యాపింగ్‌లో ఓటర్లు కనిపించకపోవడంతో ఇక్కడ 'సర్' ప్రక్రియలో ఓట్లు తొలగింపు వివాదం కావచ్చు. నగరంలో బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు నకిలీ పత్రాలతో ఓటర్లుగా ఉన్నారనే ఆరోపణలున్న నేపథ్యంలో సదరు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు నెలకొనే అవకాశాలుంటాయి. సున్నిత ప్రాంతాల్లో అధికారులు పూర్తి జాగ్రత్తలు తీసుకొని 'సర్'ను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే నగరంలో మ్యాపింగ్ చేపట్టడంలో కొన్ని రాజకీయ పార్టీలు జోక్యం చేసుకోవడంతో అనర్హులు విధులు నిర్వహిస్తున్నరనే ప్రచారం జరుగతున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకపోతే తెలంగాణలో కూడా 'సర్' వివాదాస్పదమయ్యే అవకాశాలున్నాయి.

ఓటర్ల జాబితా ప్రక్షాళనలో ఎన్నికల సంఘంతోపాటు రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. పోలింగ్ బూత్ స్థాయిలో అధికారిక బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్‌ఒ), రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్ (బిఎల్‌ఎ) పాత్ర క్రియాశీలకమైంది. తెలంగాణలో ఒక్కో బిఎల్‌ఒ పరిధిలో సగటున 930 మంది ఓటర్లున్నారు. రాజకీయ పార్టీలు బూత్ స్థాయిలోనే ఓటర్ల జాబితా రూపొందిస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉంటే వివాదాలు అరికట్టవచ్చు. ప్రజాస్వామ్యానికి ఎన్నికల ప్రక్రియ పునాది. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా కీలకం.

ఓటర్ల జాబితా ప్రక్షాళన 'సర్'పై రాజకీయ ఒత్తిళ్లు లేకుండా, పారదర్శకంగా ప్రక్రియ సాగితేనే ప్రజల్లో ఎన్నికల వ్యవస్థపై నమ్మకం పెరుగుతుంది. అనర్హులను తొలగించి అసలైన అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తే దేశంలో వివాదాస్పదం అవుతున్న 'సర్' నిర్వహణలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది. కాబట్టి 'సర్' ప్రక్రియ రాజకీయ వివక్ష లేకుండా నిజాయితీగా, పారదర్శకంగా జరిగితేనే ఎన్నికల సంఘం చెబుతున్న "ప్యూరిఫికేషన్"పై ప్రజల్లో "క్లారిఫికేషన్" వస్తుంది. 'సర్' అందరికీ సమ్మతం కావాలి. లేదంటే తెలంగాణలో కూడా 'సర్' మరో రాజకీయ తుపానుగా మారే అవకాశాన్ని కొట్టిపారేయలేం.

# అన్నం పెట్టే రైతన్న కంట కన్నీరు మంచిది కాదు..

- ధాన్యం కొనుగోళ్లను వెంటనే చేపట్టాలి..- హమాలీలు, లారీల కొరత నివారించాలి..
- జిన్నారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే జీఎంఆర్..





జిన్నారం మే 25 భారత శక్తి రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని.. వర్షాకాలం ఆరంభమయ్యే సమయం ఆసన్నమైనప్పటికీ ధాన్యం కొనుగోలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తుందని. అన్నం పెట్టే రైతన్న కంట కన్నీరు ప్రభుత్వానికి మంచిది కాదని.. వెంటనే కొనుగోళు ృ ప్రారంభించాలని పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిన్నారం, సోలక్పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యపు కొనుగోలు కేంద్రాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్ల అంశంలో ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు ఎమ్మెల్యే జిఎంఆర్ కు వివరించారు. కష్టనష్టాలను ఎదుర్కొని ధాన్యం పండించి కొనుగోలు కేంద్రాలకు తీసుకొని వస్తే.. అధికారుల నిర్లక్ష్యం మూలంగా గత 15 రోజులుగా కొనుగోలు చేయకపోవడం మూలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు కన్నీటి పర్యంతమయ్యారు. వర్షాలు ఎప్పుడు వస్తాయన్న భయాందోళనతో ప్రతిరోజు ధాన్యాన్ని కాపాడుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో గత పది సంవత్సరాల పాటు రాష్ట్రంలోని రైతాంగానికి స్వర్ణయుగం నడిచిందని అన్నారు. రైతుకి రైతుబంధు, రైతు భీమా, సాగునీరు, పండించిన ప్రతి పంటకు మద్దతు ధర, సకాలంలో కొనుగోళ్లు చేయడంతో పాటు వెంటనే డబ్బులు సైతం డిపాజిట్ చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. పటాన్చెరు నియోజకవర్గంలో వ్యవసాయం అంతంత మాత్రమే ఉందని.. పండించిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మరో వారం రోజుల్లో రుతుపవనాలు ప్రారంభమయ్యే సమయం ఆసన్నమైనప్పటికిని.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యపు రాశులు అలాగే ఉండడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అర్థం పడుతుందని అన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న కంట కన్నీరు ప్రభుత్వానికి మంచిది కాదని ప్రభుత్వానికి సూచించారు. రవాణా, హమాలీలు, గన్ని బ్యాగుల కొరత పేరుతో రైతులను ఇబ్బందులకు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ రోజు నుండే ధాన్య కొనుగోలు చేపట్టాలని జిల్లా పౌరసరఫల శాఖ అధికారికి ఫోన్ లో సూచించారు. రాబోయే రెండు రోజుల్లో నియోజకవర్గంలో రైతు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేయడంతోపాటు.. ఇందుకు సంబంధించిన డబ్బులు సైతం డిపాజిట్ చేయాలని ఆయన అధికారులకు ఆదేశించారు. లేనిపక్షంలో రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ సంక్షేమ సంఘం కోసం
# వెయ్యి గజాల స్థలం.. భవన నిర్మాణం..

- అర్హులైన సెంట్రింగ్ కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు..
- ప్రతి కార్మికుడికి గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ అందించేలా చర్యలు..- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





పటాన్‌చెరు మే 25 భారత శక్తి శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ రంగానికి కీలకంగా మారిన సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని..

అతి త్వరలో వెయ్యి గజాల స్థలం కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నట్లు పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రికి సమీపంలో నియోజకవర్గస్థాయి సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో సెంట్రింగ్ కాంట్రాక్టర్లు కార్మికుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనులు చేయాలని కోరారు. సంఘం సభ్యుల కోరిక మేరకు..

అతి త్వరలో వెయ్యి గజాల స్థలంతో పాటు భవన నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని ప్రకటించారు. కార్మిక శాఖ అధికారులతో చర్చించి ప్రతి కార్మికుడికి ఆరోగ్య భద్రతను అందించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి సెంట్రింగ్ కార్మికుడికి స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇల్లు.. లేనివారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, నర్రా బిక్షపతి, శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, రాజు, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు యాదగిరి, అధ్యక్షులు కృష్ణ, ప్రధాన కార్యదర్శి జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో పింఛన్
# లబ్ధిదారుల ముఖ గుర్తింపు (FRS) ధృవీకరణ.

-ఈ నెల 29 నుండి జూన్ 1 వరకు వార్డు కార్యాలయాలలో ప్రక్రియ.. ఆధార్ కార్డులతో హాజరు కావాలని అధికారుల సూచన

బడంగ్‌పేట్: మే 25 భారత శక్తి, బడంగ్‌పేట్ సర్కిల్-16 పరిధిలోని పూర్వపు బడంగ్‌పేట్ మున్సిపాలిటీకి సంబంధించిన పింఛన్ లబ్ధిదారులకు అధికారులు కీలక సూచన చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పింఛన్ లబ్ధిదారుల ధృవీకరణ కార్యక్రమాన్ని 'ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్' (ఫ్రీ=షా - ముఖ గుర్తింపు) విధానంలో నిర్వహించనున్నారు. ఈ నెల 29వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు సంబంధిత వార్డు కార్యాలయాలలో అధికారుల సమక్షంలో ఈ ప్రక్రియ జరుగుతుంది. పింఛన్ లబ్ధిదారులు తమకు కేటాయించిన ధృవీకరణ కేంద్రాలలో నిర్ణీత తేదీలలో తప్పనిసరిగా హాజరై, ఈ ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు కోరారు.

### - ఆధార్ కార్డు తప్పనిసరి

ధృవీకరణకు వచ్చే లబ్ధిదారులు తమ ఆధార్ కార్డుతో పాటు ఇతర అవసరమైన పత్రాలను వెంట తీసుకురావాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను ఎటువంటి ఇబ్బందులు లేకుండా, సజావుగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

### - ధృవీకరణ కేంద్రాల వివరాలు

పింఛన్ లబ్ధిదారుల సౌకర్యార్థం ఆయా ప్రాంతాలను బట్టి ధృవీకరణ కేంద్రాలను కేటాయించారు. అల్మాస్‌గూడ ప్రాంత లబ్ధిదారులు అల్మాస్‌గూడ వార్డు కార్యాలయంలోనూ, నాదర్‌గుల్ మరియు కుర్మల్‌గూడ ప్రాంతాల వారు నాదర్‌గుల్ వార్డు కార్యాలయంలోనూ హాజరుకావలసి ఉంటుంది. గుర్రంగూడ ప్రాంత వాసులు గుర్రంగూడ వార్డు కార్యాలయానికి, బడంగ్‌పేట్ పరిధిలోని వారు ఎంఆర్‌ఓ కార్యాలయం సమీపంలోని కమ్యూనిటీ హాల్‌కు వెళ్ళాలి. అలాగే బాలాపూర్ ప్రాంత లబ్ధిదారులు బాలాపూర్ వార్డు కార్యాలయంలో, మల్లాపూర్ మరియు వెంకటాపూర్ ప్రాంతాల వారు మల్లాపూర్ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాలలో తమ ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. పింఛన్ లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని, అధికారులకు సహకరించి ధృవీకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



# బావుసాయిపేటలో వివాహిత అదృశ్యం.

## -ఆందోళనలో కుటుంబ సభ్యులు.




భారత శక్తి,రాజన్న సిరిసిల్ల జిల్లా, మే 25: కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైన ఘటనపై కోనరావుపేట పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది.పోలీసుల కథనం ప్రకారం బావుసాయిపేట గ్రామానికి చెందిన భవాని (25) భర్త బొజ్జ అనిల్ ముదిరాజ్ కులానికి చెందిన మహిళా ఈనెల 23వ తేదీ ఉదయం ఆరు గంటల నుండి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆమె తండ్రి లాలా హనుమంతు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి అదృశ్యమైన మహిళ కోసం గాలింపు చర్యలు చేపట్టామని దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. భవాని ఆచూకీ తెలిసిన వారు వెంటనే కోనరావుపేట పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

# వేములవాడలో కల్వకుంట్ల హిమాన్షు సందడి.

## -భీమేశ్వరస్వామికి కోడె మొక్కు చెల్లించిన కేటీఆర్ తనయుడు.




భారత శక్తి ,రాజన్న సిరిసిల్ల జిల్లా, మే 25: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయం భీమేశ్వరాలయంలో సోమవారం తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మనుమడు, కేటీఆర్ తనయుడు హిమాన్షు తన స్నేహితులతో కలిసి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా సంప్రదాయ ప్రకారం హిమాన్షు కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం గర్భాలయంలో స్వామివారికి అభిషేకం, విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వచనం అందించగా, దేవస్థాన ఈఓ స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. హిమాన్షు రాకతో ఆలయ ప్రాంగణం ఒక్కసారిగా సందడిగా మారింది. ఆయనను చూసేందుకు, సెల్ఫీలు తీసుకునేందుకు యువత, అభిమానులు పోటీపడ్డారు.

# వేములవాడలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం.



భారత శక్తి,రాజన్న సిరిసిల్ల జిల్లా, మే 25: వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్ స్టాండ్ సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. మృతురాలి వయస్సు సుమారు 25 నుండి 30 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. తీవ్రమైన ఎండల కారణంగానే ఆమె మృతి చెంది ఉండవచ్చని ప్రాథమిక విచారణలో భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న వేములవాడ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు లేదా ఆమెను గుర్తించిన వారు వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌ను 8712656413 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి : మంత్రి అడ్లూరి






జగిత్యాల, మే 25 (భారత శక్తి): కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి, ఆర్డీఓ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు.

మంత్రి మాట్లాడుతూ పెరిగిన ఇంధన ధరలు సామాన్య ప్రజలపై భారం మోపుతున్నాయని విమర్శించారు. కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ ఎన్నికల అనంతరం ఇంధన ధరలు పెంచారని ఆరోపించారు.బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావు, జీవన్ రెడ్డిలు బీజేపీ పై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేనని ఆరోపించారు.ధాన్యం,మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో కేంద్రం స్పందించడం లేదని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలో ఇప్పటికే 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మిగిలిన లక్షా 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందయ్య, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేయాలి

## -జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
## -అన్ లోడింగ్ లో జాప్యం కాకుండా పర్యవేక్షణ చేయాలి.



భారత శక్తి ,రాజన్న సిరిసిల్ల జిల్లా, మే 25: జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ శరవేగంగా పూర్తి చేయాలని, అన్ లోడింగ్ లో జాప్యం కాకుండా పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, అన్ లోడింగ్ వేగవంతం చేయడం, గోదాంలలో నిల్వ చేయడం, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ పురోగతి, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సోమవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న పరిస్థితులు, ధాన్యం నిల్వ సామర్థ్యం పూర్తి అయిన గోదాముల వివరాలను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ చేయాలని, నిరంతరం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మిల్లులకు టార్గెట్ ఇవ్వాలని ఆదేశించారు. వారం రోజుల్లోగా కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని సూచించారు.రైస్ మిల్లులు, గోదాంలు, అపెరల్ పార్క్ లో హమాలీల సంఖ్యను పెంచి, అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. తుది దశలో ఉన్న కేంద్రాల్లో కొనుగోళ్లు మరింత వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో గన్నీ బ్యాగుల కొరత లేదని, కేంద్రాల వారీగా ఎన్ని గన్నీ బ్యాగులు అవసరం ఉన్నాయో ముందే తెలుసుకుని, సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. తూకం వేసిన ధాన్యం బస్తాలు తరలించేందుకు సరిపడా వాహనాలను సమకూర్చాలని, ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు ఈ దిశగా వాహనాలు సమకూర్చేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ శరవేగంగా పూర్తి చేయాలని, అన్ లోడింగ్ లో జాప్యం కాకుండా పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, అన్ లోడింగ్ వేగవంతం చేయడం, గోదాంలలో నిల్వ చేయడం, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ పురోగతి, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సోమవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న పరిస్థితులు, ధాన్యం నిల్వ సామర్థ్యం పూర్తి అయిన గోదాముల వివరాలను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ చేయాలని, నిరంతరం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మిల్లులకు టార్గెట్ ఇవ్వాలని ఆదేశించారు. వారం రోజుల్లోగా కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని సూచించారు.రైస్ మిల్లులు, గోదాంలు, అపెరల్ పార్క్ లో హమాలీల సంఖ్యను పెంచి, అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. తుది దశలో ఉన్న కేంద్రాల్లో కొనుగోళ్లు మరింత వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో గన్నీ బ్యాగుల కొరత లేదని, కేంద్రాల వారీగా ఎన్ని గన్నీ బ్యాగులు అవసరం ఉన్నాయో ముందే తెలుసుకుని, సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. తూకం వేసిన ధాన్యం బస్తాలు తరలించేందుకు సరిపడా వాహనాలను సమకూర్చాలని, ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు ఈ దిశగా వాహనాలు సమకూర్చేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

# వాస్తవాధారిత వివరాలతో వినతులు సమర్పించాలి.

## -డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా పిలుపు



వై ఎస్ ఆర్ కడప, మే 25(భారత శక్తి ) : గ్రామీణ, పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేస్తున్న "డెడికేటెడ్ కమిషన్"కు వాస్తవాధారిత సమాచారంతో కూడిన వినతులనే సమర్పించాలని ప్రజలు, కుల సంఘాలు, ప్రజాప్రతినిధులకు.. డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఐఏఎస్ (రిటైర్డ్) సూచించారు. సోమవారం కడప కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ సి.మల్లికార్జునతో కలసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన నిర్వహించిన "గ్రామీణ పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలు"పై అధ్యయనం మరియు వినతుల స్వీకరణ" కార్యక్రమంలో డెడికేటెడ్ కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా పాల్గొని ప్రసంగించి అనంతరం విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా రాజీవ్ రంజన్ మిశ్రా ఐఏఎస్ (రిటైర్డ్) మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ.ఎం.ఎస్. నెం.03, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా గౌరవ సుప్రీంకోర్టు వివిధ తీర్పుల మేరకు ట్రిపుల్ టెస్ట్ నిబంధనలను అమలు చేయడానికి ఈ డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల శాతం నిర్ణయించేందుకు రాజ్యాంగబద్ధంగా, శాస్త్రీయంగా, అనుభవాధారితంగా అధ్యయనం చేయడం కమిషన్ ప్రధాన ఉద్దేశమని వివరించారు.బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనుకబడిన స్థితిగతులు ఏ మేరకు ఉన్నాయో క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, వాటి ప్రభావాన్ని అంచనా వేయడం జరుగుతుందని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే వినతులు,మెమోరాండములు కమిషన్‌కు ఎంతో ఉపయోగపడతాయని, అందులో పేర్కొనే ప్రతి అంశం వాస్తవాధారితంగా ఉండాలని స్పష్టం చేశారు.వినతిపత్రాలతో పాటు సంబంధిత పత్రాలు, ఆధారాలు,గణాంకాలు, నివేదికలు, ధృవీకరణ పత్రాలు కూడా సమర్పించాలని సూచించారు. తమ వద్ద లేని పత్రాలు ఎవరి నుంచి పొందవచ్చో వారి వివరాలను కూడా తెలియజేయాలని కోరారు. కమిషన్ పరిశీలనలో పారదర్శకత, నిష్పాక్షికతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు.స్థానిక సంస్థల్లో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు.ఈ ప్రక్రియ లో ప్రజల భాగస్వామ్యం కీలకమని,బీసీల స్థితిగతులపై అవగాహన ఉన్న ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను తెలియజేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ డాక్టర్. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల ప్రకారం జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. కమిషన్ నిర్వహిస్తున్న అధ్యయనం బీసీ వర్గాల భవిష్యత్తు ప్రాతినిధ్యానికి కీలకమైందని పేర్కొన్నారు. ప్రజలు సమర్పించే వినతులు సమగ్రంగా, స్పష్టంగా ఉండేలా అధికారులు మార్గనిర్దేశనం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈ ఓ సుబ్రమణ్యం, డిపిఓ వెంకట సుబ్బయ్య, సీపీఓ హజరతయ్య, జిల్లా బిసి సంక్షేమ మరియు సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, మున్సిపల్ కమిషనర్లు,కడప, అన్నమయ్య జిల్లాల సంబంధిత శాఖల అధికారులు,కుల సంఘాల ప్రతినిధులు,ప్రజా ప్రతినిధులు,పౌర సమాజ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.


# సిరిసిల్ల బి.వై.నగర్ ఉన్నత పాఠశాలలో ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.

## -2006-07 బ్యాచ్ పూర్వ విద్యార్థుల మధుర జ్ఞాపకాల నెమరువేత.




భారత శక్తి,రాజన్న సిరిసిల్ల జిల్లా, మే 25: 2006-07 బ్యాచ్ పూర్వ విద్యార్థుల మధుర జ్ఞాపకాల నెమరువేత కార్యక్రమం ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్వ విద్యార్థులు సందడి చేశారు. సుమారు 50 మందికి పైగా హాజరైన పూర్వ విద్యార్థులు, జ్ఞాపకాలను పంచుకుంటూ మాజీ విద్యార్థులు ఉద్వేగానికి లోనైయ్యారు.కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు ఎన్.ప్రతాప్, తిరుపతిరావు, ఎస్. శ్రీనివాస్, కె.జయరాజ్, ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు ఉపాధ్యాయుల పిలుపు నిచ్చారు.ఉద్యోగ, వ్యాపార, వృత్తి రంగాల్లో రాణించాలని గురువులు ఆకాంక్షించారు.తమను పిలిచి ఆత్మీయంగా సత్కరించిన పూర్వ విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న మద్యం ప్రియుల పేరిట వినతి!



భారత శక్తి ,రాజన్న సిరిసిల్ల జిల్లా, మే 25:మద్యం ధరల పెంపుపై సోషల్ మీడియాలో కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు.ఇప్పటికే ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణలోనే మద్యం ధరలు ఎక్కువని లేఖలో పేర్కొన్నారు.మద్యం ధరలను 20 నుంచి 30 శాతం పెంచే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్న వార్తలతో ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు.ధరలు పెంచకుండా పాత ధరలనే కొనసాగించాలని కోరుతూ కలెక్టర్ కు మందుబాబులు వ్రాసిన లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.

# ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

## -పనులను పరిశీలించిన సర్పంచ్ కాడ వేణి సరిత


రేగొండ, మే 25 (భారత శక్తి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరి కొత్తపల్లి మండలం వెంకటేశ్వర్ల పల్లి గ్రామంలోని సీతారాం కుంట ప్రాంతంలో సాగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పనులను గ్రామ సర్పంచ్ కడవేణి సరిత- యుగేందర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండుటెండల్లో పనిచేస్తున్న కూలీల దాహార్తినీ తీర్చేందుకు చల్లని మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా కూలీలు ఉదయం 5 గంటల నుండి 10 గంటల లోపే పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్మికులకు చల్లటి తాగునీరు నిరంతరం అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్ ను ఆదేశించారు. పనుల పరిశీలనకు వచ్చిన ఏపీవో దివాసి విటల్ తో సర్పంచి మాట్లాడుతూ. కూలీల వేతనాలను త్వరగా జమ చేయాలని, తొలగించిన జాబు కార్డుల పేద కుటుంబాలకు వెంటనే పని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పొన్నం రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ పనస శంకర్, మరియు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో తీవ్రరూపం దాల్చిన రైతుల ఆందోళన

భారత శక్తి,రాజన్న సిరిసిల్ల జిల్లా, మే 25:తంగళ్ళపల్లి మండలం సారంపల్లి గ్రామంలో సిద్ధిపేట--హైదరాబాద్ ప్రధాన రహదారిపై రైతులు బైఠాయించి ధర్నాకు దిగారు.రెండు నెలలు గడుస్తున్నా వడ్ల కొనుగోలు పూర్తి చేయకపోవడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.కొనుగోలు కేంద్రాల్లో వడ్లు పేరుకుపోవడంతో ఆందోళన చెందిన రైతులు రోడ్డెక్కి తమ నిరసనను తెలియజేశారు. రైతుల ధర్నాతో సిద్ధిపేట--హైదరాబాద్ ప్రధాన రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి.దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వడ్ల కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజావాణిలో 138 దరఖాస్తులు

## - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే 25 : ప్రతి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 138 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు ఇస్తూ, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజావాణికి వచ్చిన అర్జీలలో భూ సమస్యలు, పింఛన్లు, ఉపాధి, ధాన్యం కొనుగోళ్లు, కుటుంబ సమస్యలు, సంక్షేమ పథకాలకు సంబంధించిన వినతులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్ వి గిరి, బాన్సువాడ, ఎల్లారెడ్డి ఆర్డీవోలు, జెడ్ పి సిఈఓ చందర్, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా బుక్ ఆఫ్ రికార్డ్ అచీవ్మెంట్ అవార్డు అందుకున్న జర్నలిస్ట్ పోతరాజు బిక్షపతి

**-వరల్డ్ రికార్డ్ అచీవ్మెంట్ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది - జర్నలిస్ట్ పోతరాజు బిక్షపతి**




మెదక్ జిల్లా నర్సాపూర్ (భారత శక్తి న్యూస్): మే 25: హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభ లో మయూరి సంస్థ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అమెరికా బుక్ ఆఫ్ రికార్డ్ – – అచీవ్మెంట్ అవార్డ్స్ ప్రధానోత్సవ కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురు ప్రముఖులను సన్మానించారు.ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, అమెరికా ఎన్ఆర్ఐలు, సినీ సామాజిక రంగ ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సామాజిక, సాంస్కృతిక రంగాల్లో విశేష సేవలు అందిస్తూ దళిత ఉద్యమ నాయకుడిగా, పాత్రికేయుడిగా, కళాకారుడిగా గుర్తింపు పొందిన జర్నలిస్ట్ పోతరాజు బిక్షపతికి అమెరికా బుక్ ఆఫ్ రికార్డ్ అచీవ్మెంట్ అవార్డు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా జర్నలిస్ట్ పోతరాజు బిక్షపతి మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ గౌరవాన్ని అందజేసిన మయూరి సంస్థ అధినేతలు మయూరి రాధ, దత్తుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
భవిష్యత్తులో మరింత బాధ్యతతో పాత్రికేయుడిగా, సామాజిక సాంస్కృతిక కళాకారుడిగా, దళిత ఉద్యమ నాయకుడిగా ప్రజాసేవలో కొనసాగుతానని పేర్కొన్నారు. తన ప్రయాణంలో వెన్నంటి నిలిచి ప్రోత్సహించిన గురువులకు, మిత్రులకు, అభిమానులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళల భద్రతే ప్రథమ ప్రాధాన్యం

**-జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**




ములుగు జిల్లా ప్రతినిధి, మే 25 (భారత శక్తి): పని ప్రదేశాలలో మహిళలకు పోష్ చట్టం ఒక రక్షణ కవచంలా ఉంటుందని, మహిళల భద్రతే ప్రథమ ప్రాధాన్యత అని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు.99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 25 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాలలో భాగంగా "మహిళల భద్రత -- రక్షణ" కార్యక్రమం సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ, పని ప్రదేశాల్లో మహిళలు గౌరవంగా, భయభ్రాంతులు లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని అన్నారు. పోష్ చట్టం మహిళా ఉద్యోగులకు రక్షణ కవచంలా పనిచేస్తుందని పేర్కొన్నారు.ప్రతి కార్యాలయంలో 10 మందికి పైగా ఉద్యోగులు ఉంటే అంతర్గత ఫిర్యాదుల కమిటీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.వేధింపులకు గురైన మహిళలు మౌనంగా ఉండకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని,ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా, బాధ్యులపై నిర్దేశిత గడువులోపు చర్యలు తీసుకునేలా చూస్తామని అన్నారు.
పోష్ చట్టంపై ప్రతి ఉద్యోగికి అవగాహన కల్పించాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు.మహిళా ఉద్యోగుల భద్రతకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, ఎక్కడైనా ఉల్లంఘనలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. షీ-టీమ్స్, భరోసా కేంద్రాల సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు.జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత మాట్లాడుతూ పోష్ చట్టంపై ప్రత్యేక కార్యక్రమాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు."బాల్య వివాహం -- బతుకు ఆగం" అనే నినాదంతో బాల్యవివాహాల రహిత ములుగు జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.అనంతరం పోష్ చట్టం, న్యూట్రిషన్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్ రావుతో కలిసి ఆవిష్కరించారు.అంతకముందు చట్టబద్ధమైన దత్తతను ప్రోత్సహించడం కొరకు, చట్టబద్ధమైన దత్తతపై అవగాహన పెంచుట కొరకు దత్తత సహాయక కేంద్రంను ప్రారంభించి, మహిళా భద్రత పై సంతకాల సేకరణను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చంద్రకళ, ఆర్డీవో వెంకటేష్, డీఎస్పీ కిషోర్, జిల్లా అధికారులు, సీడీపీఓలు, మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి


**- అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలి.**
**జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు.**




ములుగు జిల్లా ప్రతినిధి,మే 25 (భారత శక్తి): జూన్ 2 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణపై జిల్లా కలెక్టర్ అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేడుకలు జరిగే ప్రాంగణంలో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, కూర్చునే ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రత తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు.పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు పటిష్టంగా చేపట్టాలని, అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అత్యవసర వైద్య సిబ్బంది, అంబులెన్స్ సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు.ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.ప్రతి శాఖ తమకు కేటాయించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేసి వేడుకలు విజయవంతం అయ్యేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, డి.ఎస్.పి కిశోర్, అన్ని శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పి జి ఆర్ ఎస్ లో అందిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించండి

**- జాయింట్ జిల్లా కలెక్టర్ డా.నిధి మీనా**



వై ఎస్ ఆర్ కడప, మే 25(భారత శక్తి ) : అర్జీదారుల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని పి జి ఆర్ ఎస్ లో అందిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి జేసీ డా. నిధి మీనా తో పాటు డీఆర్వో మల్లిఖార్జునుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ వ్యవస్థ ద్వారా అర్జీదారులకు సంతృప్తి కరమైన, నాణ్యమైన వేగవంతమైన పరిష్కారాన్ని అందిస్తోందన్నారు. ప్రభుత్వ ఆశయానికి కట్టుబడి ప్రతి శాఖ జిల్లా అధికారితో పాటు ఆయా శాఖల మండల స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.?
ముఖ్యంగా ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలోనే ప్రజల సమస్యలను గుర్తించి స్థానికంగానే పరిష్కరించేలా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అర్జీదారుల వినతులను మండల స్థాయిలోనే స్వీకరించిపరిష్కరించాలన్నారు. అలాగే వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా శాఖల అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్య శాఖ, ఐసిడిఎస్ శాఖలు ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక దృష్టి సారించాలని, పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వేసవి తీవ్రతను అధిగమిస్తూ ఎక్కడా తాగునీటి కొరత లేకుండా పంచాయతీ, మున్సిపల్ శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదుల పట్ల పరిష్కార నివేదిక అందివ్వడంలో గ్రీవెన్స్ రిడ్రెసల్ అథారిటీ అధికారులు పొంతనలేని సమాధానాలు అర్జీదారులకు అందివ్వకూడదని, అర్జీదారుడు అందించే ఫిర్యాదుకు సరైన, సూటి సమాధానం ఇవ్వాలన్నారు. ఈ విషయంలో తహసీల్దార్లు, శాఖాధిపతులు ఎల్లపుడు పైస్థాయి అధికారులు, పిజిఆర్ఎస్ సిబ్బంది, ఫిర్యాదుదారులు సమాచారం అందిపుచ్చుకునేలా అందుబాటులో ఉండాలని, ఎక్కడా కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చేసుకోవాలన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు.**

1) బి. కోడూరు మండలం కు చెందిన బాలయ్య అనే వ్యక్తి తమ రేషన్ కార్డు నందు పేరును మార్చవలసింది గా అర్జీ సమర్పించారు.
2) కడప మండలంకు చెందిన జి.నాగేశ్వరరావు అనే వ్యక్తి యు జి డి బిల్స్ త్వరగా మంజూరు చేయవలసిందిగా అర్జీ సమర్పించారు.
3) కడప మండలం కు చెందిన షేక్ సయ్యద్ బేగం రేషన్ కార్డ్ మంజూరు కొరకు అర్జీ సమర్పించారు.
5) గోపవరం మండలం కు చెందిన ఆర్ దేవదాసు అనే వ్యక్తి తమ భూ సమస్యను పరిష్కరించ వలసిందిగా అర్జీ సమర్పించారు.
6) కాజీపేట మండలం కు చెందిన ఓబులరెడ్డి అనే వ్యక్తి తన ఇంటి స్థలం నందు ఇల్లు నిర్మించుట కొరకు అర్జీ సమర్పించారు.
7) కడపకు చెందిన వెంకటరమణ అనే వ్యక్తి తన ఇంటికి మౌలిక వసతులు కల్పించాలని అర్జీ సమర్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సి ఇ ఓ రామచంద్రారెడ్డి,డి.ఆర్.డి.ఏ. పిడి రాజ్యలక్ష్మి,జిల్లా పర్యాటక అధికారి సురేష్, ఎస్ఎస్ఏ పి ఓ అనురాధ, ఎస్డీసిలు శాంతమ్మ, వెంకటపతి,శివరామిరెడ్డి మరియు అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


## తీవ్రమైన ఎండలను సైతం లెక్క చేయని బ్లూ కోల్టు సిబ్బంది.

**-అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్న బ్లూ కోల్టు సిబ్బంది సేవలు ప్రశంసనీయం.**

నిర్మల్ జిల్లా ప్రతినిధి, భారత శక్తి, మే 25: నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఆదేశాల మేరకు తీవ్ర ఎండలు మండుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కూడా ప్రజల భద్రత, సమస్యల పరిష్కారమే ప్రధాన కర్తవ్యంగా భావిస్తూ నిర్మల్ జిల్లా బ్లూ కోల్టు సిబ్బంది అహర్నిశలు విధులు నిర్వహిస్తున్నారు.మండుతున్న ఎండలను, అలసటను సైతం లెక్కచేయకుండా ప్రజల కోసం నిరంతరం రోడ్లపై విధులు నిర్వహిస్తూ తమ కర్తవ్య నిబద్ధతను చాటుతున్నారు.జిల్లాలో ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు తలెత్తినా, ప్రజల నుండి ఫిర్యాదులు అందినా, డయల్-100 ద్వారా సమాచారం వచ్చిన వెంటనే బ్లూ కోల్టు సిబ్బంది వేగంగా స్పందిస్తూ క్షణాల్లో సంఘటన స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపడుతున్నారు. ప్రమాదాలు, గొడవలు, కుటుంబ కలహాలు, రోడ్డు ప్రమాదాలు, అనుమానాస్పద ఘటనలు వంటి ప్రతి అంశంలో ప్రజలకు అండగా నిలుస్తూ పోలీసులు సేవలు అందిస్తున్నారు.ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే లక్ష్యంగా బ్లూ కోల్టు సిబ్బంది రాత్రింబవళ్లు అప్రమత్తంగా పనిచేస్తున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు.ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి సేవలందించడం నిజమైన పోలీసింగ్‌కు నిదర్శనమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.తీవ్ర ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రజల భద్రత కోసం నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ, అత్యవసర




సమయాల్లో వేగంగా స్పందిస్తున్న బ్లూ కోల్టు సిబ్బంది పనితీరు ప్రశంసనీయమని, అలాగే విధులతో పాటు బ్లూ కోల్టు సిబ్బంది తమ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని, తగినంత నీరు తీసుకోవడం, ఎండలో బయటకెళ్ళేటప్పుడు,వెంట మజ్జిగ, నీళ్ళు



తీసుకెళ్లాలని,ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,సూచించారు.

# పారిశ్రామిక రంగానికి పెద్దపీట

**-కడపలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీల నిర్మాణానికి త్వరలోనే డిమాండ్ సర్వే: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి**
**-కడప నగర సమగ్ర అభివృద్ధి కూటమితోనే సాధ్యం: ప్రభుత్వ విప్ మరియు కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి**

వైఎస్ఆర్ కడప జిల్లా,మే 25(భారత శక్తి) : కడప నియోజకవర్గం లో పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడానికి, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీల కాన్సెప్ట్‌ను తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. సోమవారం విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో ఎం ఎస్ ఎం ఈ గ్రోత్ సమ్మిట్ 2026 లో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టు నకు శంకుస్థాపన చేయగా కడప నగరంలోని ఇండస్టియల్ డెవలప్మెంట్ పార్క్ లో 2.07 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు కానున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ ఎఫ్ సి) నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలు సాధారణ అపార్ట్ మెంట్ ల వలె కాకుండా, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక డిజైన్లతోరూపొందుతున్నాయని స్పష్టం చేశారు. ఒక స్క్వేర్ మీటర్‌కు దాదాపు ఐదు టన్నుల బరువును మోయగల సామర్థ్యంతో, భారీ ఎక్విప్‌మెంట్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని ప్రొడక్షన్ చేయడానికి వీలుగా వీటిని డిజైన్ చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే, పై అంతస్తులకు ముడిసరుకును తరలించడానికి మరియు ఫినిష్డ్ ప్రొడక్ట్సను కిందికి తెచ్చేందుకు పారిశ్రామిక గ్రేడ్ లిఫ్ట్ సౌకర్యాలను కల్పిస్తున్నట్లు చెప్పారు.ప్రస్తుతం నిర్మిస్తున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ లో సుమారుగా 25 యూనిట్లు అందుబాటులోకి రానున్నాయని కలెక్టర్ తెలిపారు. పారిశ్రామికవేత్తల అవసరాలకు అనుగుణంగా ఇంటర్నల్ పార్టిషన్స్ మార్చుకునే వీలుందని, ఎవరికి ఎంత స్థలం (500 ాట్ లేదా 1500 ాట్) కావాలో తెలుసుకోవడానికి వీలుగా తక్షణమే డిమాండ్ సర్వే నిర్వహించాలని ాా××జ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రూ. 15 కోట్లతో 50,000 ాట్ విస్తీర్ణంలో ఫేజ్-1 పనులు జరుగుతుండగా,ఇది పూర్తి కాగానే ఇదే ప్రాంగణంలో మరో రూ. 15 కోట్లతో ఫేజ్-2 (మరో 50,000 ాట్) నిర్మించడానికి తగిన స్థలం అందుబాటులో ఉందని కలెక్టర్ వివరించారు.
దాదాపు 300 ఎకరాల్లో విస్తరించి ఉన్న కడప ఇండస్ట్రియల్ పార్కులో ప్రస్తుతం 165కు పైగా పరిశ్రమలు విజయవంతంగా నడుస్తున్నాయని, ఇవి ఏటా రూ. 250 నుండి రూ. 300 కోట్ల



టర్నోవర్‌తో నగర ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. వీటి ద్వారా సుమారు 4,000 మందికి నేరుగా ఉపాధి లభిస్తోందని పేర్కొన్నారు. కడప నగరంలో ప్రైవేట్ వ్యక్తులకు 2,000 స్క్వేర్ మీటర్ల పైబడి భూమి ఉంటే, వారు సొంతంగా లేదా ాా××జతో జాయింట్ వెంచర్ ద్వారా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలను నిర్మించుకోవచ్చని తెలిపారు. వీటికి అవసరమైన రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక వసతులను ప్రభుత్వం ప్రాధాన్యతపై కల్పిస్తుందని, గరిష్టంగా 60 శాతం వరకు సబ్సిడీ పొందే అవకాశం కూడా ఉందని స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్టమొదటిసారిగా ఒక టైర్-3 నగరంలో యువతను టార్గెట్‌గా చేసుకుని "స్టార్టప్ కడప"ను వచ్చే నెలలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ప్రారంభించబోతున్నామని కలెక్టర్ ప్రకటించారు.పారిశ్రామికవేత్తలకు పెట్టుబడి సాయం, బ్యాంకింగ్ రుణాలు మరియు ప్రభుత్వ అనుమతుల ప్రక్రియను డిజిటల్ విధానంలో వేగవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. రాబోయే ఆరు నెలల్లో ఈ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్ మరియు కడప శాసన సభ్యురాలు రెడ్డప్పగారి మాధవి రెడ్డి మాట్లాడుతూ కడప నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రాయలసీమను ఐటీ, పారిశ్రామిక రంగాలుగా తీర్చిదిద్ది, ఇక్కడి రైతుల బిడ్డలు సాఫ్ట్వేర్ ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా స్థిరపడేలా చేసిన ఘనత నారా చంద్రబాబు నాయుడు గారిదేనని ఆమె కొనియాడారు.



ఇప్పుడు 'పూర్వోదయ' పథకం ద్వారా రూ. 40,000 కోట్లతో రాయలసీమను ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని తెలిపారు. అలాగే, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ గారి చొరవతో కేవలం 30 నుండి 45 రోజుల్లోనే ప్రక్రియ పూర్తి చేసి, పొరుగు రాష్ట్రాల పోటీని తట్టుకుని అనంతపురం జిల్లా పుట్టపర్తి పరిధిలో ఫిఫ్త్ జనరేషన్ 'ఫైటర్ జెట్స్' పరిశ్రమకు భూమి పూజ చేయడం జరిగిందని, ఇది మన స్వదేశీ టెక్నాలజీతో రూపుదిద్దుకోనుందని ఆమె వెల్లడించారు.కడపలో సరికొత్త పారిశ్రామిక విప్లవానికి నాంది పలుకుతూ, చిన్న తరహా పరిశ్రమలు, వ్యాపారస్తుల (కార్పెంటర్స్, సోఫాలు, మంచాలు, గార్మెంట్స్ తదితర రంగాలు) కోసం ఈ ఎంఎస్ఎమ్ఈ పార్కులో రెంట్ లేదా కొనుగోలు పద్ధతిలో 25 గదులతో కూడిన ప్లగ్ అండ్ ప్లే మోడల్ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ పారిశ్రామిక పార్కులో 50 శాతం ఆక్యుపెన్సీ పూర్తి కాగానే రెండవ వెంచర్ కూడా ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ వెంచర్‌లో కామన్ ఫెసిలిటీ సెంటర్, ఫస్ట్ ఎయిడ్ సెంటర్, సైబర్ కేర్, ఏటీఎం, రా మెటీరియల్ స్టోరేజ్, విశాలమైన పార్కింగ్ మరియు సీసీ రోడ్ల వంటి అత్యాధునిక వసతులు కల్పించినట్లు చెప్పారు.దీనితో పాటు రాబోయే ఒకటి రెండు నెలల్లో యువత, ఐటీ నిపుణుల కోసం "స్టార్టప్ కడప"ను ప్రారంభించబోతున్నామని, దీని ద్వారా యువ పారిశ్రామికవేత్తలకు లోన్లు, మెంటార్‌షిప్ సేవలు అందుతాయని ఆమె ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీఓ మురళి, ఏపిఐఐసి జెడ్ ఎం శ్రీనివాస మూర్తి, ఇండస్ట్రీస్ జీఎం చాంద్ బాష సంబంధిత అధికారులు, ప్రోత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

# త్రుటిలో తప్పిన అగ్ని ప్రమాదం.!
## -అప్రమత్తమైన గ్రామస్తులు



మణుగూరు, మే 25 (భారతశక్తి): మండలంలోని పగిడేరు గ్రామపంచాయితీ పరిధిలోని కోడిసెలకుంట గ్రామంలో సోమవారం భారీ అగ్ని ప్రమాదం త్రుటిలో తప్పింది. ఊరి వెలుపల ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా గ్రామం వైపు వ్యాపించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. అయితే గాలి వేగానికి మంటలు మరింత ఉద్ధృతంగా మారి గ్రామం దిశగా దూసుకువచ్చాయి. మంటలను గమనించిన గ్రామస్తులు వెంటనే అప్రమత్తమై బకెట్లు, మోటార్ల సహాయంతో నీరు చల్లి మంటలను అదుపులోకి తెచ్చినట్లు, గ్రామస్తుల సమయస్ఫూర్తి, ఐక్యత వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. మంటలు మరింత వ్యాపించి ఉంటే ఇళ్లు, పశువులు, వ్యవసాయ భూములకు భారీ నష్టం వాటిల్లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

# ప్రజావాణి దరఖాస్తుల సమస్యలను
## పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్



ములుగు జిల్లా ప్రతినిధి,మే25(భారత శక్తి): ప్రజావాణిలో అర్జీదారులు అందించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఛోర్ఘడే హేమంత్ సహదేవరావు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 113 దరఖాస్తులు రాగా, వాటిలో ఇందిరమ్మ ఇళ్లకు 25, పెన్షన్లకు 51, ఇతర శాఖలకు సంబంధించినవి 37 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించడం జరిగిందని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, సమస్యను పరిష్కరించాలని, ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. గతవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా కారణాలవల్ల క్రింది స్థాయి కార్యాలయాల్లో సమస్యను పరిష్కరించలేకపోతే, వాటికి సంబంధించిన పూర్తి వివరాలను ఫిర్యాదుదారునికి తెలియజేయాలని, పై స్థాయి కార్యాలయంలో ఏ అధికారికి, ఏ విధంగా తమ సమస్యను తెలియజేయాలో క్షుణ్ణంగా వివరించాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజావాణి దరఖాస్తులు అధికారుల వద్ద పెండింగ్‌లో ఉండకూడదని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, సంపత్ రావు, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు
## ఘనంగా నిర్వహించాలి
### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 25(భారత శక్తి) జూన్ 02 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, కలెక్టరేట్ లో నిర్వహించే వేడుకల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులతో సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించే వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఇందుకోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టరేట్ ను అందంగా అలంకరించాలని చెప్పారు. ప్రధాన వేదికను పూలతో అందంగా ముస్తాబు చేయాలని వివరించారు. వేడుకల ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులను పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్రావతరణ వేడుకలకు ప్రోటోకాల్ ప్రకారం అందరినీ ఆహ్వానించాలని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖుల కోసం సరిపడినంత సీటింగ్, తాగునీరు, సౌండ్ సిస్టమ్, షామియానా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని చెప్పారు.జూన్ 2 ఉదయం నిర్ణీత సమయానిక అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరై వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీ ఉపేంద్రా రెడ్డి, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15లోపు యాతాలకుంట
# టన్నెల్ లైనింగ్ పనులు పూర్తి చేయాలి

-రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు
-వచ్చే వర్షాకాలానికే బేతుపల్లి చెరువుకు గోదావరి జలాలు చేరాలి
-డిస్ట్రిబ్యూటరీ కాలువల భూసేకరణలో రైతులు, ప్రజాప్రతినిధులు సహకరించాలి
-యాతాలకుంట టన్నెల్ ను పరిశీలించిన మంత్రి తుమ్మల





భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 25 (భారతశక్తి): ఆగస్టు 15 లోపు యాతాలకుంట టన్నెల్ లైనింగ్ పనులను ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామంలో నిర్మాణంలో ఉన్న యాతాలకుంట టన్నెల్ ను సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు అంకిత్, దివాకర్ టిఎస్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ లను వెంట తీసుకొని మంత్రి స్వయంగా ట్రాక్టర్ నడుపుకుంటూ టన్నెల్ లోపలికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందించడం ఇక్కడి ప్రజల చిరకాల స్వప్నమని అన్నారు. ఏటూరునాగారం నుంచి పాపికొండల వరకు గోదావరి పరివాహక ప్రాంతం ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఆ జలాలను వినియోగించు కోలేకపోయామని తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఖమ్మం సరిహద్దుల వరకు వచ్చినా సిల్ట్ సమస్యలు, ఇతర ప్రాంతాల ఆయకట్టు కారణంగా జిల్లాకు నీరు అందలేదన్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కొంత మేర ఉపశమనం ఇచ్చినా, ఖమ్మం జిల్లా ఎత్తైన ప్రాంతంలో ఉండటంతో గోదావరి జలాలను వినియోగించు కోవాలంటే లిఫ్ట్ ఇరిగేషన్ మాత్రమే మార్గమని తెలిపారు. ఎన్టీఆర్ హయాం నుంచి ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరకు ప్రతి ముఖ్యమంత్రిని ఖమ్మం జిల్లాకు లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయాలని కోరుతూ పోరాడానని తెలిపారు. 1997-98లో నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం రైట్ లైన్ కెనాల్ వరకు లిఫ్ట్ పనులను రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేశామని, అదే సమయంలో దేవాదుల, దుమ్ముగూడెం లిఫ్ట్ ప్రాజెక్టులను ప్రతిపాదించామని తెలిపారు. నిధుల కొరత కారణంగా అప్పట్లో దేవాదుల ప్రాజెక్ట్ మాత్రమే ప్రారంభమైందన్నారు. వైఎస్సార్ హయాంలో దుమ్ముగూడెం ప్రాజెక్టును ఇందిరాసాగర్, రాజీవ్ సాగర్ పేర్లతో తీసుకువచ్చారని, రాష్ట్ర విభజన అనంతరం ఇందిరాసాగర్ హెడ్‌వర్క్స్ ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిపోవడంతో పాటు అవసరమైన అనుమతులు కూడా లేకపోవడంతో ప్రాజెక్ట్ ముందుకు సాగలేదన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటి ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి దుమ్ముగూడెం ప్రాజెక్టును ముందుకు తీసుకువచ్చామని, ఈ ప్రాంతానికి శ్రీ సీతారాములతో ఉన్న అనుబంధం కారణంగా దీనికి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అని పేరు పెట్టామని తెలిపారు. 2016లో 13 వేల కోట్ల పరిపాలనా అనుమతులు వచ్చినప్పటికీ గత ప్రభుత్వ హయాంలో పనులు చాలా నెమ్మదిగా సాగాయన్నారు. 100 కిలోమీటర్ల ప్రధాన కాలువ, మూడు పంప్ హౌస్‌లు మాత్రమే పూర్తయ్యాయని, ప్రస్తుతం నాలుగో పంప్ హౌస్ పనులు కొనసాగు తున్నాయని, వాటిని పూర్తి చేస్తామని చెప్పారు. సత్తుపల్లి ట్రంక్‌లో భాగమైన యాతాలకుంట టన్నెల్ ద్వారానే ప్రధాన కాలువ నుంచి నీరు సరఫరా అవుతుందని వివరించారు. గత ప్రభుత్వం టన్నెల్ నిర్మించాలా, పైపులైన్ వేయాలా అనే విషయంలో నిర్ణయం తీసుకోలేదని, భద్రాచలం పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఒత్తిడి తీసుకువచ్చి పెండింగ్ పనులను ప్రారంభించామని తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై 10 వేల కోట్లు ఖర్చు చేశామని, మరో 7 నుంచి 8 వేల కోట్లు వెచ్చిస్తే కాలువల పనులు పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తి స్థాయిలో పూర్తి చేయవచ్చని తెలిపారు. రాజీవ్ లింక్ కాలువను ఆరు నెలల్లో పూర్తి చేశామని, వచ్చే జూన్ నాటికి గోదావరి జలాలతో వైరా ప్రాజెక్టును నింపి లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. యాతాలకుంట టన్నెల్ పూర్తైతే మరో లక్ష ఎకరాలకు గోదావరి జలాలు అందుతాయని పేర్కొన్నారు. యాతాలకుంట టన్నెల్ పనులు 16 నెలల క్రితం ప్రారంభమై, ఏజెన్సీ అధికారులు రాత్రింబవళ్లు కష్టపడి టన్నెల్ నిర్మాణాన్ని పూర్తి చేశారని అభినందించారు. టన్నెల్ లైనింగ్ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని, రెండు వైపులా పనులు వేగవంతం చేయాలని సూచించారు. వచ్చే వర్షాకాలానికే యాతాలకుంట టన్నెల్ ద్వారా గోదావరి జలాలు బేతుపల్లి చెరువుకు చేరాలనేది తన కోరిక అని అన్నారు. ప్రధాన కాలువ భూసేకరణ పూర్తి చేసిన కలెక్టర్ లకు మంత్రి అభినందనలు తెలిపారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల కోసం ఇంకా 11వేల ఎకరాల భూమి అవసరమని, భూసేకరణపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గత ప్రభుత్వం డిస్ట్రిబ్యూటరీ కాలువలను నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం సవరించిన అంచనాలకు ఆమోదం తెలిపిందని తెలిపారు. మొదట పినపాక, తరువాత కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలకు ఈ ఏడాదిలోనే ప్రయోజనం చేకూరుతుందని, కాలువల పనులు త్వరగా పూర్తవ్వాలంటే ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు రైతులతో సమన్వయం చేసి భూసేకరణకు సహకరించాలని కోరారు. యాతాలకుంట టన్నెల్ లైనింగ్ పనులు ఆగస్టు 15లోపు పూర్తి చేయాలని, ఏ సమస్య వచ్చినా వెంటనే ఎమ్మెల్యేలు, కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలని ఏజెన్సీకి సూచించారు. భూమి ఇచ్చిన రైతులకు మంచి పరిహారం అందిస్తున్నామని, ప్రాజెక్ట్ కోసం రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మొత్తం 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, జూలూరుపాడు టన్నెల్ పూర్తైతే పాలేరు వరకు గోదావరి జలాలు చేరుతాయని, ఖమ్మం జిల్లాలో మొత్తం 10 లక్షల ఎకరాలు సాగునీటి పరిధిలోకి వస్తాయని మంత్రి తెలిపారు. జూలూరుపాడు టన్నెల్ టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని, యాతాలకుంట టన్నెల్ లైనింగ్ అనంతరం జూలూరుపాడు టన్నెల్ పనులు వేగవంతం అవుతాయని అన్నారు. భూసేకరణ సమస్యలను త్వరగా పరిష్కరించి పనులు పూర్తి చేయాలని సూచించారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల పనులు స్థానిక ఎమ్మెల్యేలు, రైతుల సహకారంపైనే ఆధారపడి ఉన్నాయని చెప్పారు. గోదావరి జలాలు అందితే ఆయిల్‌పామ్ సాగు విస్తృతంగా పెరుగుతుందని, రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని మంత్రి తెలిపారు. ఉద్యాన పంటలకు తక్కువ నీరు సరిపోతుందని, ఒక ఎకరం వరి సాగు నీటితో ఐదు ఎకరాల ఆయిల్‌పామ్ సాగు సాధ్యమవుతుందని అన్నారు . వరి సాగులో ఎరువులు, మార్కెటింగ్, అకాల వర్షాలు రైతులను ఇబ్బంది పెడుతున్నాయని అన్నారు. దేశంలో ప్రతి పంటను కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని, వరి, మొక్కజొన్న, జొన్నలు, సన్‌ఫ్లవర్ వంటి పంటలను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమవుతున్నా యని విమర్శించారు. డీజిల్ సరఫరా, హమాలీల కొరత, గన్నీ బ్యాగుల సరఫరా తగ్గినా తెలంగాణ దేశంలో అత్యధిక ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రంగా నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం కనీస మద్దతు ధర ప్రకటిస్తోందే తప్ప పంటలను కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. రైతుల సమస్యలను రాజకీయాలకు ఉపయోగించు కోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏసిపి వసుంధర, ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు, రైతులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన విద్యార్థుల సమ్మర్ క్యాంపు.

**అధిక సంఖ్యలో సద్వినియోగం చేసుకున్న విద్యార్థులు..**

**కళాకారులు ముత్యం ను సన్మానించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు..**




ఆర్మూర్, భారత శక్తి,మే 25: ఆర్మూర్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో 15 రోజులుగా సాగిన వేసవి ఉచిత శిక్షణ తరగతులను ప్రధానోపాధ్యాయులు వనజ ఆధ్వర్యంలో విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వేసవి శిక్షణ తరగతులు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడ్డాయి. వేసవి సెలవులను విద్యార్థులు తమకిష్టమైన కలలపై ఆసక్తి చూపి ఎంతో మంచి మేలుకువలు నేర్చుకున్నారు. ఈ శిక్షణ తరగతులకు ఇన్స్ట్రక్టర్స్ గా ఆర్టిస్టు ఒ సింగర్ మంథని ముత్యం శాస్త్రీయ సంగీతం, డ్రాయింగ్ నేర్పించగా, యోగ ఇన్స్ట్రక్టర్గా హిమబిందు, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ కు రజిత, శిక్షణను అందించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు ఇన్స్ట్రక్టర్ లను ఘనంగా సన్మానించారు. 15 రోజులపాటు బాధ్యతగా పిల్లల తల్లిదండ్రులు పిల్లలను శిక్షణ తరగతులకు క్రమం తప్పకుండా తీసుకొచ్చి విద్యార్థుల ప్రతిభకు సహకారాన్ని అందించారు. సంగీతము, డ్రాయింగ్ యోగ, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ నేర్చుకున్న విద్యార్థులను కాంపిటీషన్ నిర్వహించి విద్యార్థులకు బహుమతులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సత్య కుమారి, భాగ్యలక్ష్మి, కాంచన తదితరు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జనగాం జిల్లాకు సర్దార్ పాపన్న పేరు
## రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి



జనగామ (భారత శక్తి) మే25 : రాష్ట్ర ప్రభుత్వం ఎలక్షన్ మేనిఫెస్టోలో ఇచ్చిన మాటను వెంటనే అమలు చేయాలి. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ గవర్నర్, అలై బలై దత్తన్న తో ఈ రోజు, సర్దార్ పాపన్న చక్రవర్తి గారి ఫోటో ఇవ్వడం జరిగినది, సర్దార్ సర్వాయి పాపన్న సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పంజాల శ్రవణ్ కుమార్ గౌడ్, తీగల రామన్న గౌడ్ సర్దార్ సర్వాయి పాపన్న సంఘం ప్రధాన కార్యదర్శి , నితీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం కూలీలకు
## మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



జనగామ(భారత శక్తి)మే25: దేవరుప్పుల మండలకేంద్రంలో కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను సోమవారం దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ఆదేశాల మేరకు వార్డు సభ్యులు,కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్నతీరును, కూలీల హాజరును వారు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఎండల తీవ్రత విపరీతంగాపెరిగిపోయిందని, ఉష్ణోగ్రతలు సైతం రికార్డు స్థాయిలో 47 డిగ్రీలకు చేరుకుంటున్న తరుణంలో కూలీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని, ఎండ తీవ్రత దృష్ట్యా పనులకు వచ్చే కూలీలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పని ప్రదేశంలో నీడ సౌకర్యం కల్పించుకోవాలని సూచించి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు గోడిశాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు ఉప్పుల అనిల్, తోటకూరిమహేష్, పత్తేపురపుశేఖర్, కారుపోతులసురేష్, తదితరులు పాల్గొన్నారు.

# సాయిరాం కాలనీలో 'మీ సురక్ష' పై
## అవగాహన సదస్సు నిర్వహణ



ఎల్బీనగర్, మే 25 (భారత శక్తి): మల్కాజ్ గిరి పోలీస్ కమీషనర్ సుమతి ఆదేశాల మేరకు కర్మన్‌ఘాట్‌లోని సాయి రామ్ నగర్ కాలనీ పార్క్‌లో సరూర్ నగర్ పోలీస్ అధికారులు మీ సురక్ష ఎన్యుమరేషన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేర నివారణ వలన జరిగే ఉపయోగం గూర్చి, నేర నిర్ధారణ గురించి విపులంగా వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రజలకు మీ సురక్ష ఎన్యుమరేషన్ యొక్క ఉపయోగాలు మరియు ప్రాముఖ్యతను స్పష్టంగా వివరించారు.ఈ కార్యక్రమంలో సరూర్ నగర్ సీఐ శ్రీశైలం, చంపాపేట్ సెక్టార్ ఎస్సై మారయ్య పలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీఐఐసి, బడా కంపెనీలు మాకొద్దు

**- మా భూములకు పట్టాలు ఇవ్వండి..రైతులు**

**- రైతుల భూములు దొడ్డిదారిన లాక్కునేందుకు ప్రభుత్వం కుట్ర....**

**(భారత శక్తి)**ఏ కొండూరు మండలం చీమలపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో రామచంద్రాపురం గ్రామపంచాయతీలో 318 ఎకరాలు పైచిలుకుల భూములను ప్రభుత్వం దొడ్డిదారుల లాక్కునేందుకు కుట్ర పన్నిందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పివి ఆంజనేయులు ఆరోపించారు, గత మూడు నెలలుగా ఈ భూములను ఆన్లైన్లోని తొలగిస్తూ సర్వే నెంబర్లు మార్పు చేస్తూ రైతులకు కూడా తెలియకుండా గందరగోళ పరుస్తూ క్వాంటం వ్యాలీ, ఓూఓఇ పార్క్, ఏపీఐసి ఇలాంటి బడా కంపెనీలకు భూములు కట్టబెట్టేందుకు గుట్టుసప్పుడు కాకుండా ఆదివారం సాయంత్రం టెంట్లు వేసి శంకుస్థాపనలు చేసేందుకు ప్రయత్నం చేయగా అర్ధరాత్రి నుంచి రైతులు అడ్డుకొని అక్కడకు వచ్చిన అధికారులను రైతులను తరిమారు, సోమవారం ఉదయం ఆగ్రహించిన రైతులు అధికారుల తీరుతో విసిగిపోయి భద్రాచలం జాతీయ రహదారిపై నిరసనకు దిగవలసిన పరిస్థితి వచ్చిందని ఆయన అన్నారు, పంట పొలాలను పార్కులు పెట్టి ప్రజల జీవితాలను చిన్నబిన్నం చేసేందుకు కూటమి ప్రభుత్వం చూస్తుందని అన్నారు, ఈ విషయంలో జిల్లా కలెక్టర్ గారు జోక్యం చేసుకొని తక్షణమే సాగు చేసుకున్న రైతులకు పట్టాలు అందజేయాలని, పార్కుల పేరుతో కంపెనీల పేరుతో రైతుల భూములు లాక్కోవడం నిలిపివేయాలని లేని పక్షంలో రైతులంతా ఆందోళన చేయవలసిన పరిస్థితి ప్రభుత్వం కల్పించినట్లు అవుతుందని ఆయన తెలిపారు, స్థానిక ఎమ్మెల్యే తీరు మార్చుకోవాలని పేదల తరపున నిలబడాల్సిన ఎమ్మెల్యే పేద రైతుల భూముల్లో గుర్తు చప్పుడు కాకుండా ఈ రకంగా శంకుస్థాపన చేయటం సరైన తీరుగాదని ఎమ్మెల్యేకి సూచించారు, ఎంపీ ఇంత జరుగుతున్న నోరు మెదపకుండా విజయవాడ నగరంలో కూర్చొని ఉండటం కాదు స్థానిక ప్రజల వద్దకు వచ్చి భూ సమస్యలు తెలుసుకొని సమస్య పరిష్కరించాలని ఎంపీకి హితవుపలికారు, తక్షణమే భూ సమస్యపై స్పష్టమైన హామీని అధికారులు ఇవ్వకపోతే రేపటి నుంచి ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు ,ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా జెట్టి వెంకటేశ్వర్రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆనందరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, సిహెచ్ సుధాకర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఏ అమ్మిరెడ్డి, భూముల కోల్పోతున్న రైతుల సమన్వయ కమిటీ కన్వీనర్ వేములకొండ సాంబశివరావు,మాదాసు శ్రీనివాస్ రావు బండి వెంకటేశ్వర్లు చిట్టిమాద చిన్నసత్యం, వేములకొండ నరేష్, బండి వెంకటేశ్వరావు శ్రీనివాసరావు సురేష్ షేక్ శ్రీనివాసరావు కొప్పెర నాగేశ్వరరావు తుళ్లూరు లక్ష్మయ్య కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్ల నిరసన

**సికింద్రాబాద్..(భారత శక్తి)** గాంధీ ఆస్పత్రిలో జూనియర్ వైద్యులు నిరసనకు దిగారు.నిన్న రాత్రి ఏ ఏం సి లో విధుల్లో ఉన్న పీజీ మొదటి సంవత్సరం విద్యార్థి శివశంకర్ పై రోగి బంధువులు దాడికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ విధులు బహిష్కరించారు. నిన్న రాత్రి సమయంలో ఈ ఘటన జరిగిందని, రోగి బంధువులు తమ పట్ల అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారని తెలిపారు. తక్షణమే వైద్యుల పై దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాంధీ ఆసుపత్రిలో ప్రతినిత్యం వైద్యులపై ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్న ప్రభుత్వంలో చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులకు సరైన భద్రత లేదని, రక్షణ కరువైందని ఇప్పటికైనా ప్రభుత్వం వైద్యుల రక్షణ నిమిత్తం ప్రత్యేక చట్టాలు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సూపరిండెంట్ కార్యాలయంలో జూనియర్ వైద్యులతో డి.ఎం.ఈ సమావేశమై ఈ ఘటనపై చర్చించారు

## బద్వేల్‌లో మహానాడును విజయవంతం చేస్తాం

**- డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి**



**బద్వేలు (భారత శక్తి)**తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు బద్వేల్ నియోజకవర్గం లో ఉమ్మడి కడప జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం లోని అన్ని మండలలో 12 క్లస్టర్ పరిధిలో ఈ నెల 27, 28 తేదీలలో వర్చువల్ లో మహానాడు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడుతుంది.ఈ కార్యక్రమానికి బద్వేలు నియోజకవర్గంలోని అన్ని మండల పార్టీ అధ్యక్షులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, క్లస్టర్ మరియు యూనిట్ ఇంచార్జీలు, కుటుంబ సాధికార సారథులు అలాగే తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ గారి అభిమానులు మరియు ప్రజలు వేలాదిగా హాజరై, మహానాడు కార్యక్రమని జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాము.

## పోషకాహార మేళ కార్యక్రమంలో పాల్గొన్నా జిల్లా కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట (భారత శక్తి)** మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార మేళ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రాణాలిక 99 పక్రియ భాగంగా పోషకాహార మేళ లో భాగంగా స్టాల్ లో ప్రదర్శించిన పలు పదార్థాలను రుచి చూసారు. చాలా బాగున్నాయని, అంగన్వాడీ ద్వారా గర్భిణులకు ఇలాంటి ఆహారం అందించాలని తెలిపారు. అనంతరం మహిళా శిశు సంక్షేమ సంబంధించి పలు పోస్టర్ లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రక్రియలో ప్రతి వారం ఒక్కో థీమ్ తో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఈ వారం మహిళ శిశు సంక్షేమం భాగంగా ఇక్కడ పోషకాహార మేళ నిర్వహించడం జరిగిందని తెలిపారు.ప్రభుత్వం గర్భిణీ మహిళలకు, శిశు సంక్షేమం కోసం అంగన్వాడీ ద్వారా పలు పోషక విలువలు కలిగిన బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తుంది.పోషకాహార మేళ ను ప్రజలకు, అధికారులకు ఒక అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమం నిర్వహించాం.ప్రతి వారం వారిగా గర్భిణీ మహిళలకు ఆకుకూరలు, పండ్లు, ప్రకృతిలో లభించే రకరకాల ఆహారాలు ఇలా ప్రతిదీ ప్రభుత్వం అందిస్తుందనీ వీటిని తినడం ద్వారా గర్భిణీలు ఆరోగ్యంగా ఉంటూ ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిస్తుందని శిశువు జన్మించిన తరవాత కూడా కొన్ని వారాల పాటు ఈ పోషకాహారం ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూ ఓ శారద,డిఆర్ డిఓ జయదేవ్ ఆర్య,సిపిఓ దశరథం,డి ఎచ్ ఓ సువర్ణ,డిటిసిపిఓ రాము, తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు 'గాల్లో'.. అక్రమ నిర్మాణాలు 'జోరుగా'..!

**- హయత్ నగర్‌లో నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఎస్.వి.ఎస్. గార్డెన్స్ ఫంక్షన్ హాల్**

**- మున్సిపల్ అనుమతులు లేవు.. ఫైర్ సేఫ్టీ అనుమతుల ఊసే లేదు!**

**- పక్కనే పెట్రోల్ బంక్.. ప్రమాదకరంగా మారుతున్న భారీ కట్టడం**

**- పట్టణ ప్రణాళికా విభాగం అధికారుల కళ్ళు మూతల.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న వైనం!**

**- హయత్ నగర్ సర్కిల్ 14 లో రాతపూర్వక ఫిర్యాదులపై చర్యలు శూన్యం,**

**- ఈ ఎస్వీఎస్ గార్డెన్ ఫంక్షనల్ నిర్మాణ అనుమతులు తీసుకోకుండా కోట్లల్లో పన్ను ఎగవేత..!**

**- ఎం.ఎం.సి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్, కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, విజిలెన్స్ అధికారులు దృష్టి సారించాలి..**





**హయత్ నగర్, మే 25 , భారత శక్తి:** అధికారుల పర్యవేక్షణ లోపం, కొందరి అండదండలతో హయత్ నగర్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా భారీ అక్రమ నిర్మాణం జోరుగా సాగుతోంది. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఎల్బీనగర్ జోన్ పరిధిలోని హయత్ నగర్ సర్కిల్ 14లో ఉన్న స్థానిక సాయి కాలనీ, తొర్రూర్ రోడ్డులోని సర్వే నెంబర్ 350లో గల "ఎస్.వి.ఎస్. గార్డెన్స్ ఫంక్షన్ హాల్" ఆవరణలో నగరపాలక సంస్థ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కుతూ పెద్ద ఎత్తున నిర్మాణ పనులు చేపడుతున్నారు. కేవలం 'రేషన్ వర్క్' (మరమ్మతులు) పేరుతో ఏకంగా ఎలాంటి పురపాలక అనుమతులు లేకుండానే ఈ పనులు సాగుతుండటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



### రెండు ఎకరాల విస్తీర్ణంలో నిబంధనల ఉల్లంఘన..!



దాదాపు రెండు ఎకరాల భారీ విస్తీర్ణంలో ఈ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను ఎలాంటి ప్లాన్ అప్రూవల్ లేకుండానే కొనసాగిస్తున్నారు. సాధారణంగా ఇంత పెద్ద మొత్తంలో కమర్షియల్ నిర్మాణాలు చేపట్టాలంటే స్థానిక పురపాలక సంస్థ నుండి భవన నిర్మాణ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ, ఇక్కడ ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండానే గుట్టుచప్పుడు కాకుండా పనులు కానిచ్చేస్తున్నారు.

### నిప్పుతో చెలగాటం: పక్కనే పెట్రోల్ బంక్.. శూన్యమైన ఫైర్ సేఫ్టీ!

ఈ నిర్మాణంలో అత్యంత ప్రమాదకరమైన అంశం ఏమిటంటే.. ఈ ఎస్.వి.ఎస్. గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌కు సరిగ్గా ఆనుకొనే 'భారత్ పెట్రోల్ బంక్' మరియు 'శ్రీ వైష్ణో దేవి ఫిలిం స్టేషన్'ఉన్నాయి.

### ఫైర్ సేఫ్టీ నిబంధనల ఉల్లంఘన:

అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉండే పెట్రోల్ బంక్ పక్కనే వందలాది మంది కూడే ఫంక్షన్ హాల్‌ను నిర్మిస్తున్నప్పుడు కఠినమైన ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పాటించాలి. కానీ, ఇక్కడ కనీస నిబంధనలు కూడా పాటించడం లేదు.

### బఫర్ జోన్ ఉల్లంఘన:

చట్ట ప్రకారం పెట్రోల్ బంకులు, ఫిలిం స్టేషన్ల పక్కన కమర్షియల్ నిర్మాణాలు చేపట్టేటప్పుడు నిర్దేశిత ఖాళీ స్థలాన్ని (బఫర్ జోన్) వదలాలి. ఇక్కడ ఆ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే వందలాది మంది ప్రాణాలు గాల్లో కలవడం ఖాయంగా కనిపిస్తోంది.

### టౌన్ ప్లానింగ్ నిర్లక్ష్యం.. వ్రాతపూర్వక ఫిర్యాదులున్నా నిమ్మకు నీరెత్తినట్లే!

ఈ భారీ అక్రమ నిర్మాణంపై పట్టణ ప్రణాళికా విభాగం (టౌన్ ప్లానింగ్) అధికారులైన టి.పి.ఎస్. సోమేష్, జె.సి.పి. విజయలక్ష్మి మరియు ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషనర్‌కు స్థానికులు అన్ని ఆధారాలతో వ్రాతపూర్వకంగా ఫిర్యాదులు చేశారు. పత్రికల్లో వార్తలు వచ్చినా, ఆధారాలు కళ్లముందున్నా చర్యలు తీసుకోవడంలో వీరు పూర్తిగా విఫలమయ్యారు. నిబంధనలను అమలు చేయాల్సిన అధికారులే ఇక్కడ అక్రమ నిర్మాణదారులకు పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### ప్రధాన ఉల్లంఘనలు ఇవే:

**పురపాలక అనుమతులు లేకపోవడం:**
**నిర్మాణానికి సంబంధించిన ఎలాంటి అధికారిక భవన నిర్మాణ అనుమతి లేదు.**
**ల్యాండ్ యూజ్ ఉల్లంఘన: నివాస/వాణిజ్య నిబంధనలకు విరుద్ధంగా భారీ నిర్మాణం.**
**ఫైర్ ఎన్ఓసీ లేకపోవడం: పెట్రోల్ బంక్ పక్కన నిర్మిస్తున్నా అగ్నిమాపక శాఖ నుండి ఎటువంటి అనుమతులు తీసుకోలేదు.**

### పార్కింగ్, రోడ్డు వెడల్పు సమస్యలు:

తొర్రూర్ రోడ్డు, పాత జి. స్కూల్ రోడ్డు పరిధిలో రాకపోకలకు అంతరాయం కలిగేలా, సరైన వాహన నిలుపుదల స్థలం లేకుండానే పనులు జరుగుతున్నాయి.

### ఖజానాకు గండి.. విజిలెన్స్ నిఘా అవసరం!

ఈ అక్రమ నిర్మాణాల వల్ల ప్రభుత్వ ఖజానాకు చేరవలసిన భారీ పన్నుల ఆదాయం మళ్లిపోతోందని, అధికారుల అండతోనే ఇదంతా సాగుతోందని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

ఇప్పటికైనా ఉన్నత అధికారులు, విజిలెన్స్ (నిఘా విభాగం) అధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ భారీ అక్రమ నిర్మాణాన్ని నిలిపివేసి, బాధ్యులైన అధికారులపై, నిర్మాణదారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

## ఉస్మాన్ నగర్ మల్లన్న జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్..



**రామచంద్రాపురం మే 25 భారత శక్తి** తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఉస్మాన్ నగర్ గ్రామంలో సోమవారం నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం, జాతర కార్యక్రమాలలో పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. హాజరైన సీనియర్ నాయకులు సోమిరెడ్డి, చిట్టి ఉమేష్, రామ్మోహన్ రెడ్డి, మల్లారెడ్డి, శ్రీశైలం, రవీందర్ రెడ్డి, నర్సింహా, రవీందర్ రెడ్డి, దేవేందర్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కంది కట్కూరు శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలించిన సిరిసిల్ల రూరల్ సిఐ



**రాజన్న సిరిసిల్ల మే 25 (భారత శక్తి):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూర్ గ్రామం లోని కందివారి ఆడబిడ్డ శ్రీ రేణుక ఎల్లమ్మ మహా జాతర ఈ నెల 27 28 తేదీలలో ఉండగా సోమవారం రోజు సిరిసిల్ల రూరల్ సి ఐ నాగేశ్వర్ రావు స్థానిక ఎస్ ఐ అశోక్ తో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా సి ఐ మాట్లాడుతూ జాతరలో బండ్లు తిరిగే సందర్భంలో డ్రైవర్లు మద్యం సేవించి ట్రాక్టర్లు నడపరాదని డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామని తెలిపారు భక్తులందరూ పోలీస్ సిబ్బందికి సహకరించాలని కోరారు డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడినచో వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ సిరిసిల్ల అశోక్ టెంపుల్ నిర్వాహకులు కంది రాజిరెడ్డి కంది శ్రీనివాస్ రెడ్డి కంది లింగ రెడ్డి గుర్రం వెంకట్రామిరెడ్డి గుర్రం లక్ష్మారెడ్డి కంది బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# రాజ్యసభ రేసు బీజేపీ నుంచి ఎవరు..

## – జనసేన నుంచి ఎవరు

**విజయవాడ (భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 18న జరగబోయే నాలుగు రాజ్యసభ స్థానాల ఎన్నికల వేడి క్లైమాక్స్ దశకు చేరుకుంది. అసెంబ్లీలో ఉన్న సంఖ్యా బలాన్ని బట్టి ఈ నాలుగు స్థానాలు అధికార ఎన్డీఏ కూటమి కైవసం చేసుకోవడం ఖాయం కాగా, బీజేపీకి దక్కే కోటా సీటుపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇప్పటివరకు ఈ రేసులో ఏపీ బీజేపీ స్థానిక నేతల పేర్లు బలంగా వినిపించినప్పటికీ, తాజా సమీకరణాల ప్రకారం తమిళనాడు మాజీ బీజేపీ అధ్యక్షుడు కె. అన్నామలై పేరు రేసులోకి రావడం సంచలనంగా మారింది. ఢిల్లీ బీజేపీ అధిష్ఠానం ఈ ఏకైక స్థానం కోసం అన్నామలై, మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి, మరియు ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ల పేర్లను తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. దక్షిణ భారతదేశంలో బీజేపీని బలోపేతం చేసే వ్యూహంలో భాగంగా మాజీ ఐపీఎస్ అధికారి కె. అన్నామలైను ఆంధ్రప్రదేశ్ కోటా నుండి రాజ్యసభకు పంపేందుకు ఢిల్లీ పెద్దలు మొగ్గు చూపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో బలమైన టాక్ నడుస్తోంది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వ్యూహాలు మరియు అక్కడ ప్రాంతీయ పార్టీలైన డీఎంకే, ఏఐఏడీఎంకేలతో పోటీని తట్టుకునేందుకు అన్నామలైకు పార్లమెంట్ వేదికగా ఒక జాతీయ గుర్తింపు ఇవ్వాలని బీజేపీ భావిస్తోంది. ఎన్నికల్లో ఏపీ ఐటీ మంత్రి నారా లోకేష్ కూడా అన్నామలై తరఫున ప్రచారం చేయడంతో, కూటమి భాగస్వామి అయిన తెలుగుదేశం పార్టీ కూడా ఇందుకు అభ్యంతరం చెప్పకపోవచ్చనే విశ్లేషణలు వినపడుతున్నాయి. మరోవైపు ఉమ్మడి రాష్ట్ర చివరి ముఖ్యమంత్రిగా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పేరు కూడా గట్టి పోటీ ఇస్తోంది. రాయలసీమ ప్రాంతంలో పట్టున్న సీనియర్ నాయకుడైన కిరణ్ కుమార్ రెడ్డిని రాజ్యసభకు పంపితే అటు ప్రాంతీయ బలాన్ని పెంచడంతో పాటు, పార్లమెంట్‌లో ఒక సీనియర్ వాయిస్‌ను ఉంచవచ్చని అధిష్ఠానం భావిస్తోంది. వీరిద్దరితో పాటు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటూ, క్లిష్ట సమయాల్లో కూడా ఏపీలో బీజేపీ కేడర్‌ను నడిపించిన లోకల్ సీనియర్ లీడర్ పీవీఎన్ మాధవ్ పేరు కూడా పరిశీలనలో ఉంది.

జూన్ 1న అధికారికంగా నోటిఫికేషన్ విడుదల కానుండటంతో, ఈ ముగ్గురిలో అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందనేది మరికొద్ది రోజుల్లోనే తేలనుంది. కూటమితో సఖ్యతగా ఉండే నేతకే అవకాశం ఇవ్వాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. జనసేన కోటాలో ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 18న జరగబోయే రాజ్యసభ ఎన్నికలలో జనసేన పార్టీకి దక్కే ఒకే ఒక్క స్థానంపై పవన్ కళ్యాణ్ పక్కా వ్యూహంతో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఇతర పార్టీలు కార్పొరేట్ శక్తులకు పెద్దల సభ సీట్లు ఇచ్చినట్లు కాకుండా, ఈసారి కేవలం జనసేన సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న నేతకే అవకాశం ఇవ్వాలని డిమాండ్ వినిపిస్తోంది. ఈ రేసులో మొదటి నుండి పవన్ కళ్యాణ్‌కుఅన్ని విధాలా అండగా నిలిచిన ప్రముఖ పారిశ్రామికవేత్త, జనసేన నేత లింగమనేని రమేష్ పేరు దాదాపు ఖరారైనట్లు పార్టీ వర్గాల్లో బలమైన టాక్ నడుస్తోంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వెన్నుదన్నుగా నిలిచిన రమేష్‌ను పెద్దల సభకు పంపడం ద్వారా పవన్ కళ్యాణ్ ఒక బలమైన సందేశాన్ని ఇవ్వాలని చూస్తున్నారు. లింగమనేని రమేష్‌తో పాటు పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడిన కాపు సామాజిక వర్గానికి చెందిన మరికొందరు సీనియర్ లీడర్ల పేర్లను కూడా పవన్ కళ్యాణ్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ఉమ్మడి గోదావరి జిల్లాకు చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు పేరు కూడా పరిశీలనలో ఉంది.

అసెంబ్లీ ఎన్నికల్లో సీటు త్యాగం చేసిన నాయకులకు లేదా పార్టీ వాయిస్‌ను ఢిల్లీ స్థాయిలో హిందీ, ఇంగ్లీష్ భాషల్లో పవర్‌ఫుల్‌గా వినిపించగల జనసేన ముఖ్య నేతలకు ఈ ఛాన్స్ ఇస్తే బాగుంటుందని అంతర్గత చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు లోక్‌సభ మరియు రాజ్యసభ రెండింటిలోనూ జనసేనకు అధికారిక ప్రాతినిధ్యం లేదు. ఈ ఎన్నికతో తొలిసారిగా రాజ్యసభలో జనసేన జెండా ఎగరబోతుండటంతో, పవన్ కళ్యాణ్ ఎంపిక చేసే అభ్యర్థిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కేవలం జనసేన పార్టీ ఐడెంటిటీని, రాష్ట్ర హక్కులను ఢిల్లీలో గట్టిగా వినిపించే పక్కా జనసేన వాడికే ఈ సీటు దక్కుతుందని పార్టీ శ్రేణులు నమ్ముతున్నాయి. జూన్ 1న నోటిఫికేషన్ విడుదల కానుండటంతో, ఈ వారంలోనే పవన్ కళ్యాణ్ జనసేన అభ్యర్థి పేరును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

# ఎన్‌ఆర్ ఐ తమ్ముళ్ల మధ్య విభేధాలు

**నెల్లూరు (భారత శక్తి):** తెలుగుదేశం ఎన్‌ఆర్‌ఐ విభాగంలో వర్గ విభేదాలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయని అంటున్నారు. గల్ఫ్ దేశాల్లో టీడీపీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. విదేశాల్లోనూ ఈ తరహా రాజకీయంతో పార్టీకి తలనొప్పిగా మారుతున్నారని పలువురు ఎన్‌ఆర్‌ఐ టీడీపీ నేతలపై కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలంగా గల్ఫ్ టీడీపీ విభాగంలో కొనసాగుతున్న ఆధిపత్య పోరుతో పార్టీ నేతలు పరస్పరం ముఖాలు కూడా చూసుకోని బద్ధ విరోధుల్లా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఈ పరిస్థితులతో గల్ఫ్ టీడీపీలో గందరగోళం చోటుచేసుకుందని చెబుతున్నారు. ఇక ఎన్‌ఆర్‌ఐ నేతల వ్యవహారశైలితో గల్ఫ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో పాల్గొనేందుకు వెళుతున్న రాష్ట్ర నేతలు కూడా ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్నారు. అయితే ఒక నేత మాత్రం వర్గాలను పెంచేలా వ్యవహరిస్తున్నారని జరుగుతున్న ప్రచారం మరింత హీట్ పుట్టిస్తోందని అంటున్నారు. తరచూ గల్ఫ్ కు వస్తున్న ఆ నేత అగ్నికి ఆజ్యం పోసేలా ప్రవర్తిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక గల్ఫ్ టీడీపీలో విభేదాలు ఉన్నట్లు జరుగుతున్న ప్రచారం ఎన్‌ఆర్‌ఐ టీడీపీలో కలవరం పుట్టిస్తోందని అంటున్నారు. ఎన్‌ఆర్‌ఐ నేతలుగా చెప్పుకునే వారు కూడా పార్టీ కార్యక్రమాలకు అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారని, స్థానికంగా ఉన్న కార్యకర్తలను కూడా కలవడం లేదని అంటున్నారు. విదేశాల నుంచి వచ్చే పార్టీ నేతలను కలిసేందుకు కూడా గల్ఫ్ లో ఉన్న ఒక పెద్ద ఇష్టపడటం లేదని అంటున్నారు. ఆయన అలా ఎందుకు ప్రవర్తిస్తున్నారనేది ఎవరికీ అంతుచిక్కడం లేదన్న చర్చ ఆసక్తి రేపుతోంది. రాజకీయంగా కీలకమైన గల్ఫ్ ప్రాంతాన్ని పార్టీ నాయకత్వం నిర్లక్ష్యం చేయడంపై కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారని అంటున్నారు. మరోవైపు పార్టీ హైకమాండ్ గల్ఫ్ టీడీపీని పట్టించుకోవడం లేదని, ఎక్కువగా అమెరికా, బ్రిటన్ లో ఉండే పార్టీ నేతలకే అవకాశాలు ఇస్తున్నారని, ఆయా శాఖలకే ప్రాధాన్యం ఇస్తున్నారని పశ్చిమాసియాలో ఉన్న కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, గల్ఫ్ టీడీపీ విభేదాలు ఉన్నాయనే విషయం తాజాగా మరోమారు బయటపడింది. పార్టీ మహానాడుకు ముందు జిల్లాల్లో మినీ మహానాడు నిర్వహించినట్లే, విదేశాల్లో సమావేశాలు జరుగుతున్నాయి. ఇక శుక్రవారం ఖతార్ లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కొలుసు పార్థసారథి హాజరయ్యారు. అయితే మరోవర్గం కూడా ఖతార్ లో సమావేశం ఏర్పాటు చేసి దీనికి పెనమలూరు ఎమ్మెల్యే బొడే ప్రసాద్ ను ముఖ్య అతిథిగా తీసుకువచ్చింది. దీంతో ఒకే రోజు, ఒకే దేశంలో రెండు వేర్వేరు సమావేశాలు జరగడం కార్యకర్తల్లో గందరగోళానికి దారితీసిందని అంటున్నారు. ఈ పోటాపోటీ కార్యక్రమాలను అడ్డుకునేందుకు రెండు పక్షాలు చివరి వరకు ప్రయత్నించాయని కూడా చెబుతున్నారు. ఈ పరిణామాలు గల్ఫ్ లో ఉంటున్న టీడీపీ కార్యకర్తలను ఆవేదనకు గురిచేస్తున్నాయి. పశ్చిమాసియాలో సుమారు 5 లక్షల మంది తెలుగువారు పనిచేస్తున్నారని చెబుతున్నారు. ఇందులో గోదావరి జిల్లాల వాసులతోపాటు రాయలసీమ ప్రాంతానికి చెందిన వారు ఎక్కువగా ఉన్నారని అంటున్నారు. పార్టీలో పరిణామాలను ప్రత్యర్థులు అనుకూలంగా మలచుకునే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. గల్ఫ్ లోనే ఉంటున్న మలయాళీలు పార్టీలను బలోపేతం చేసుకుంటుంటే, టీడీపీలో మాత్రం భిన్నమైన పరిస్థితులు ఉన్నాయని కార్యకర్తలు వాపోతున్నారు. ప్రధానంగా గ్రూపు రాజకీయాలు, కులాల ఆధిపత్యం వల్ల పార్టీకి నష్టం చేస్తోందన్న వాదన వినిపిస్తోంది. ఈ పరిస్థితిని సరిదిద్దేందుకు హైకమాండ్ తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# 11 లక్షల మంది ఉద్యోగాలు

## – .3.6 లక్షల కోట్లఐటీ ఎగుమతులు

**హైదరాబాద్, (భారత శక్తి)** హైదరాబాద్ ఐటీ రంగానికి తిరుగులేదని మరోసారి నిరూపితమైంది! మన భాగ్యనగరం సరికొత్త రికార్డుల వైపు దూసుకుపోతోంది. కొత్త కంపెనీలు, గ్లోబల్ సెంటర్ల రాకతో ఈ ఏడాది చివరికల్లా ఇక్కడి ఐటీ ఉద్యోగుల సంఖ్య ఏకంగా 11 లక్షలకు చేరబోతోందని ఐటీ శాఖ అంచనా వేస్తోంది. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాల వేటలో ఉన్నవారికి, హైదరాబాద్ గ్రోత్‌ను చూస్తున్నవారికి ఇది నిజంగా సూపర్ గుడ్ న్యూస్. ఈ ఐటీ జోరు మున్ముందు ఎలా ఉండబోతోందో ఇప్పుడు చూద్దాం ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారం చూస్తే, గతేడాది డిసెంబర్ నాటికే హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగుల సంఖ్య దాదాపు 10.2 లక్షల వరకు ఉంది. ఇక అంటే ఇప్పటికే మన సిటీలో ఒక భారీ ఐటీ సైన్యం కొలువుదీరి ఉందన్నమాట. ఇప్పుడు ఆ నెంబర్ మరింత పెరిగి 11 లక్షల మార్కును తాకడానికి రెడీ అవుతోంది. ఉద్యోగాలు పెరగడానికి కారణం ఏంటి?: హైదరాబాద్‌కు క్యూ కడుతున్న కొత్త ఇంటర్నేషనల్ కంపెనీలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ఈ భారీ వృద్ధికి ముఖ్య కారణం. ఇక్కడి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, టాలెంట్ పూల్ ఆకట్టుకోవడంతో గ్లోబల్ కంపెనీలు తమ కార్యాలయాలను ఇక్కడే స్థాపించేందుకు ముందుకు వస్తున్నాయి. దీంతో స్థానిక ప్రతిభకు విస్తృతమైన అవకాశాలు లభిస్తున్నాయి. ఎగుమతుల్లోనూ రికార్డుల వేట: ఉద్యోగాలే కాదు, ఆదాయం పరంగా కూడా హైదరాబాద్ ఐటీ రేంజ్ మారిపోయింది. ఇక ఆర్థిక సంవత్సరంలో మన రాష్ట్రం నుంచి జరిగిన ఐటీ ఎగుమతుల విలువ అక్షరాలా రూ.3.13 లక్షల కోట్లు. ఇక ఈసారి ఆ రికార్డును బ్రేక్ చేస్తూ.. ఐటీ ఎగుమతులు ఏకంగా రూ.3.6 లక్షల కోట్లకు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. మొత్తానికి చూస్తే, ఐటీ హబ్‌గా హైదరాబాద్ ఇప్పట్లో తగ్గేదేలే అంటోంది. ఇక 11 లక్షల మంది ఉద్యోగులు, రూ.3.6 లక్షల కోట్ల ఎగుమతుల లక్ష్యంతో సిటీ గ్లోబల్ మ్యాప్‌లో మరింత స్ట్రాంగ్‌గా నిలబడబోతోంది. ఇక ఈ గ్రోత్ ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో మరిన్ని అద్భుతమైన అవకాశాలు మన యువత సొంతం కావడం ఖాయం.

# నాగర్ కర్నూల్ జిల్లాలో ఆందోళనకు దిగిన మొక్కజొన్న రైతులు

## – రోడ్డుపై బైఠాయించి ఆందోళన

**నాగర్ కర్నూలు(భారత శక్తి)** మొక్కజొన్న రైతులు అందోళన బాట పట్టారు. తాడూరు మండలంలో ఇంద్రకల్ రోడ్డు మొక్కజొన్న సేకరణ గోదాముల వద్ద పది రోజులుగా మొక్కజొన్న ట్రాక్టర్లతో రైతుల నిరీక్షణ ధర్నా కు దారి తీసింది. రోడ్డుకు ఇరువైపులా భారీగా కిలోమీటర్ల మేర మొక్కజొన్న ట్రాక్టర్లు, లారీలు నిలిచిపోయాయి. ఒక గోదాం నిండిందని మరొక గోదాంకు పంపించారని, ఆ గోదాంలో కూడా నిండుతుందని.. మా పరిస్థితి ఏంటని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. రైతుల అందోళనతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. తిండి తిప్పలు లేకుండా పడిగాపులు కాస్తున్నామంటున్నారు రైతులు. కొనుగోళ్లు వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# కాక్రోచ్ జనతా పార్టీ హిస్టరీ తెలుసా

**న్యూఢిల్లీ,(భారత శక్తి)** దశ రాజకీయాలను మారుస్తాం.. అవినీతి లేని పరిపాలన అందిస్తాం.. యువత నుంచి మొదలు పెడితే వృద్ధుల వరకు మెరుగైన పరిపాలన అందిస్తాం.. ఇలా సంచలన హామీలతో ఆన్లైన్లో ఏర్పాటు అయింది కాక్రోచ్ జనతా పార్టీ. ఈ పార్టీ ఇప్పటికే ఇన్స్టాగ్రామ్ లో చాలామంది ఫాలోవర్స్ ను పొందింది.. సంచలన ప్రకటనలతో ఇంకా ఇంకా సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడిగా అభిజిత్ కొనసాగుతున్నారు. ఈయన అమెరికాలో చదువుతున్నారు. కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడిగా ఈయన సంచలన విషయాలను ఎప్పటికప్పుడు వెల్లడిస్తున్నారు. దేశ రాజకీయాలను మారుస్తామని, ప్రజలు తమకు సహకరించాలని కోరుతున్నారు. ఎక్కడో అమెరికాలో ఉంటూ.. ఇటువంటి ప్రకటనలు చేస్తున్న అభిజిత్ మీద కొంతమంది విమర్శలు చేస్తుండగా.. మరికొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ అభిజిత్ ఇప్పుడు దేశ రాజకీయాలలో ఒక సంచలన వ్యక్తిగా మారిపోయారు. జనరేషన్ జెడ్ ఉద్యమాన్ని తీసుకురావాలని కోరుతున్న ఈయన.. గతంలో ఆమ్ ఆద్మీ పార్టీకి పని చేశారు. ఇప్పుడు ఈయన బోస్టన్ లో చదువుకుంటున్నారు. అక్కడి నుంచే కాక్రోజ్ జనతా పార్టీ వ్యవహారాలను నడుపుతున్నారు. సోషల్ మీడియాలో సంచలన సృష్టిస్తున్న అభిజిత్ కు ఇప్పుడు ఒక్కసారిగా దిమ్మ తిరిగిపోయింది.

ఆయన ఇన్స్టాగ్రామ్ అకౌంట్ హ్యాక్ అయినట్టు తెలుస్తోంది. దాన్ని రికవరీ చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. దానికి సంబంధించిన స్క్రీన్ షాట్లను కూడా ఆయన ఎక్స్ లో పోస్ట్ చేశారు. అయితే ఇప్పుడు పార్టీకి సంబంధించిన సోషల్ మీడియా ప్లాట్ఫామ్ మీద ఆయనకు యాక్సిస్ లేకుండా పోయింది. ఒకవేళ ఎవరైనా పోస్టులు చేస్తే.. వాటిని అధికారిక ప్రకటనలుగా భావించవద్దని అభిజిత్ వెల్లడించారు. మనదేశంలో సోషల్ మీడియాలో రకరకాల వ్యక్తులు పుట్టుకొస్తుంటారు. కొంతమంది సెలబ్రెటీలు అవుతుంటారు. వారిని చాలామంది ఫాలో అవుతుంటారు. అలా అయినంత మాత్రాన వారేమీ దేశ పరిపాలకులు కాలేరు. మహా అయితే సెలబ్రిటీల హోదా అనుభవిస్తారు. డబ్బు కూడా సంపాదిస్తారు. అంతవరకే వారి స్థాయి ఆగిపోతుంది. అంతకుమించి ఊహించుకుంటే మాత్రం మొదటికే మోసం వస్తుంది. ఇప్పుడు అభిజిత్ విషయంలో కూడా అదే జరుగుతుందని విశ్లేషకులు అంటున్నారు. సోషల్ మీడియాలో ఒక పార్టీ ఏర్పడినంత మాత్రాన అది దేశాన్ని పరిపాలిస్తుందని ఎలా అనుకుంటున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అనవసరంగా హడావిడి తప్ప ఉపయోగం లేదని వారు స్పష్టం చేస్తున్నారు.

# డ్యామేజ్ కంట్రోల్‌లో జగన్

**విజయవాడ,(భారత శక్తి)** ఏపీలో ఆసక్తికర రాజకీయ పరిణామం ఒకటి చోటుచేసుకుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని గొడ్డలి పార్టీగా టిడిపి చెప్తోంది. ఒక పద్ధతి ప్రకారం ప్రజల్లోకి తీసుకెళ్తోంది. అయితే ఇది పొలిటికల్ గా డ్యామేజ్ చేస్తుందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళన చెందుతోంది.. అందుకే జగన్మోహన్ రెడ్డి మొన్న ప్రెస్మీట్లో ఎవరిది గొడ్డలి పార్టీ అంటూ విరుచుకుపడ్డారు. గొడ్డలి పార్టీతో పాటుగాగన్ కల్చర్ అనేది తెలుగుదేశం పార్టీ పేటెంట్ అంటూ మాట్లాడారు. ఎవరి హయాంలో బాబాయ్ హత్య జరిగిందో చెప్పాలని సవాల్ చేశారు. అంతకుముందు మాజీమంత్రి విడదల రజిని సైతం ఎవరిది గొడ్డలి పార్టీ అంటూ ప్రశ్నించారు. తమను అనవసరంగా అలా అనవద్దని కూడా హెచ్చరించారు. అయితే ఒక పద్ధతి ప్రకారం టిడిపి నాయకత్వం గొడ్డలిని హైలెట్ చేసింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అని పిలిచే కంటే గొడ్డలి పార్టీగా ఎలివేట్ అయ్యేలా చేసింది.

అయితే ఆ డ్యామేజ్ కంట్రోల్ లో భాగంగా జగన్మోహన్ రెడ్డి సైతం రంగంలోకి దిగారు. వివరణ ఇచ్చే ప్రయత్నంలో భాగంగా టిడిపి పై ఎదురుదాడికి దిగారువైయస్ వివేకానంద రెడ్డి హత్య అనేది వచ్చే ఎన్నికల్లో కూడా సజీవంగా నిలుస్తుంది అనేది బహిరంగ రహస్యం. 2019 మార్చి 15న దారుణ హత్యకు గురయ్యారు వివేకానంద రెడ్డి. తొలుత గుండెపోటుగా చిత్రీకరించారు వాళ్లే. కాదు కాదు గొడ్డలితో నరికి చంపారు అన్నది వాళ్లే. జగన్మోహన్ రెడ్డి నోటి నుంచి గొడ్డలి అనే మాట పదే పదే వచ్చింది. అయితే ఆ తర్వాత కాలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం.. సొంత కుటుంబ సభ్యులే హత్య చేశారని ఆరోపణలు రావడం.. నిందితులను జగన్మోహన్ రెడ్డి వెనుకేసుకొస్తున్నారని సొంత కుటుంబ సభ్యులు ఆరోపించడం వంటివి ఈ కేసులో హైలైట్ అయ్యాయి. సిబిఐ విచారణను సైతం అప్పటి వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించలేదు కదా.. దర్యాప్తు పై సైతం ప్రభావం చూపిందని ఆరోపణలు వచ్చాయి. వివేకానంద రెడ్డి హత్య అంశం మొన్నటి ఎన్నికల్లో విపరీతమైన ప్రభావం చూపింది. అందుకే ఈ అంశాన్ని సజీవంగా ఉంచి జగన్మోహన్ రెడ్డిని ఇరుకున పెట్టాలని టిడిపి భావిస్తుంది. గొడ్డలి పార్టీగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని చూపే ప్రయత్నం చేస్తోంది టిడిపి. అయితే తమది గొడ్డలి పార్టీ ఎలా అని జగన్మోహన్ రెడ్డి ప్రశ్నించడం విశేషం. వివేకానంద రెడ్డి హత్య జరిగింది టిడిపి సమయంలోనని.. ఆయనను హత్య చేసిన ప్రధాన నిందితుడు ఇప్పుడు టిడిపితో కలిసి పని చేస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారు జగన్ మోహన్ రెడ్డి. అయితే చనిపోయింది స్వయానా తన బాబాయ్. కచ్చితంగా నిందితులను శిక్షించాల్సింది ఆయనే. కానీ ఐదు సంవత్సరాలు అధికారం చేపట్టిన జగన్మోహన్ రెడ్డి మాత్రం వివేకా హత్య కేసులో సీరియస్ గా దృష్టి పెట్టినట్టు లేదన్న విమర్శలు వచ్చాయి. పైగా నిందితులను కాపాడారన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకే గొడ్డలి పార్టీ అనే ముద్ర బలంగా వెళ్తోంది ఆ పార్టీపై.

# వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను హతమార్చిన భార్య

## – ప్రియుడితో కలిసి హత్య చేసి, జేసీబీ సహాయంతో మృతదేహం పూడ్చివేత

**సంగారెడ్డి (భారత శక్తి)** వివాహేతర సంబంధానికి అడ్డుగా వున్నాడని భర్తను భార్యే హతమార్చింది. పైగా ప్రియుడితో కలిసి మృతదేహాన్ని జేసీబీ సహాయంతో పూడ్చివేసింది. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం గంగాపూర్ గ్రామంలో నివసిస్తూ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కల్పన నర్సుగా పని చేస్తోంది. కొన్ని నెలలుగా ఎల్గోయి గైని పండరి అలియాస్ చింటూ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుని, అడ్డుగా ఉన్నాడని ఈ నెల 16వ తేదీన భర్త ముత్యంరెడ్డిని హతమార్చింది.

చనిపోయిన తన సోదరుడికి సమాధి కట్టిస్తామని చెప్పి జేసీబీ సహాయంతో గ్రామ శివారులోని తన పొలంలో గుంత తవ్వించి, భర్త మృతదేహాన్ని పూడ్చిపెట్టింది. తరువాత ఈ నెల 18వ తేదీన భర్త కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది నిందితురాలు. విచారణ క్రమంలో అనుమానం వచ్చి నిలదీయగా, తన ప్రియుడితో కలిసి తానే ముత్యం రెడ్డిని హతమార్చినట్లు అంగీకరించింది. దీంతో 9 రోజుల తరువాత పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి, నిందితులిద్దరిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

# అటెన్షన్ డైవర్షన్ ముఠా అరెస్టు

**నల్లగొండ (భారత శక్తి)** అటెన్షన్ డైవర్షన్ అంతర్ రాష్ట్ర దొంగలను నల్లగొండ వన్టౌన్ పోలీసులు పట్టుకున్ననారు. నిందితులకు రైతన్నలే టార్గెట్. బ్యాంకుల వద్ద రైతుల కష్టార్జిత డబ్బులపై కన్నేసిన అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్ అయింది. బ్యాంకు నుంచి నగదు తీసుకున్న రైతులను ఫాలో అవుతూ, డబ్బులు పడిపోయాయి..బైక్కు ఆయిల్ కారుతోంది..బట్టలపై మురికి పడింది.. అంటూ మాటల్లో పెట్టి దృష్టి మళ్లించి ముఠా నగదు దోచేస్తుంది. నల్గొండ, నకిరేకల్ ప్రాంతాల్లో రైతులను టార్గెట్ చేసిన దొంగలు 24 గంటల్లోనే వన్ టౌన్ పోలీసుల వలలో చిక్కారు. నిందితులనుంచి రూ.2.20 లక్షల నగదు, బైక్, సెల్ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ డి.ఎస్.పి శివరాం రెడ్డి మట్లాడుతూ బ్యాంకుల నుంచి భారీ నగదు తీసుకొస్తే ఒంటరిగా వెళ్లొద్దు. అపరిచితులు మాట్లాడితే అప్రమత్తంగా ఉండండి. × బైక్ దగ్గర, నగదు దగ్గర అపరిచితులను నమ్మొద్దు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వండి. ఒక్క క్షణం నిర్లక్ష్యం? జీవితాంతం నష్టం అవుతుంది. రైతన్నలు, ప్రజలు అవగాహనతో నడుచుకోవాలని సూచించారు.

# కేంద్రమంత్రులకు ర్యాంకింగ్స్..

**న్యూఢిల్లీ, (భారత శక్తి)** కేంద్ర మంత్రివర్గ విస్తరణ త్వరలో ఉంటుందన్న ప్రచారం జరుగుతోంది. ఈసారి విస్తరణలో తెలంగాణకు మరో మంత్రి పదవి రావొచ్చన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ తరుణంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తన పాలనా శైలిలో మరో కీలక మలుపు తీసుకుంది. కేంద్ర మంత్రులు, వారి శాఖల పనితీరును వివిధ పారామీటర్ల ఆధారంగా మొదటిసారి ర్యాంకులు ఇచ్చారు. వీటిని క్యాబినెట్ సమావేశంలో ప్రదర్శించడం ఒక సానుకూల అభివృద్ధి. ఈ చర్య ప్రభుత్వ యంత్రాంగాన్ని మరింత జవాబుదారీగా, ఫలితాల దిశగా నడిపించే దిశలో ముఖ్యమైన అడుగు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మొదటి నుంచి తన కేబినెట్‌లో మంత్రులకు, నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు పనితీరులో ర్యాంకులు ఇస్తున్నారు. మోదీ ఇప్పుడు చంద్రబాబును అనుసరిస్తున్నారు. తాజాగా మోదీ ప్రకటించిన ర్యాంకుల్లో కన్జ్యూమర్ అఫైర్స్, బొగ్గు, విద్యుత్, వైద్య శాఖలు వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరు చూపాయి. ఫిర్యాదుల పరిష్కారం, సంక్షోభ నిర్వహణ, ఫైల్ పారవేయడం, పరిపాలనా సమర్థత వంటి కీలక అంశాల్లో ఈ శాఖలు ముందుండటం గమనార్హం. ముఖ్యంగా వినియోగదారుల సమస్యల పరిష్కారం, పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో తీసుకున్న చర్యలు కన్జ్యూమర్ అఫైర్స్ శాఖను ప్రత్యేకంగా హైలైట్ చేశాయి. ఈ ర్యాంకింగ్స్ ప్రజలకు మేలు చేసే నిర్ణయాలను త్వరగా అమలు చేయడం, సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడం వంటి లక్ష్యాలతో రూపొందించబడింది. ఇది పాలకుల్లో పోటీ మనస్తత్వాన్ని ప్రోత్సహిస్తుంది. నిర్లక్ష్యానికి తావు లేకుండా చేస్తుంది. ప్రభుత్వాలు తరచూ పథకాలు ప్రకటిస్తాయి, కానీ వాటి అమలు, ఫలితాలు చాలా సార్లు వెనుకబడి ఉంటాయి. ఇలాంటి సమయంలో శాఖల పనితీరును కొలిచే స్పష్టమైన మెకానిజం ఉండటం ప్రజా సేవా ధోరణిని బలపరుస్తుంది. ఇది మంత్రులు మాత్రమే కాక, సచివాలయాలు, అధికారుల వరకు కూడా జవాబుదారీతనాన్ని పెంచుతాయి. ఈ విధానం ద్వారా ప్రభుత్వం తన నిర్వహణను కార్పొరేట్ స్టైల్‌లో వ్యవస్థీకరించడం స్పష్టంగా కనిపిస్తోంది. ఫలితాల ఆధారంగా ప్రశంసలు, సూచనలు, అవసరమైతే సవరణలు చేయడం ద్వారా పాలనా సామర్థ్యం మెరుగుపడే అవకాశం ఎక్కువ. అయితే, ఈ ర్యాంకింగ్ వ్యవస్థ పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా ఉండాలి. కొన్ని శాఖలు సహజంగా సవాళ్లు ఎక్కువ ఎదుర్కొంటాయి కాబట్టి, పారామీటర్లు సమగ్రంగా, వాస్తవికంగా ఉండాలి. అలాగే, ఈ వ్యవస్థ నిరంతరం కొనసాగి, కేవలం ఒక్క సమావేశానికి పరిమితం కాకుండా ఉండాలి. మొత్తం మీద, ఈ చర్య ప్రభుత్వ యంత్రాంగాన్ని మరింత చురుకుగా, ఫలితభిరుచిగా మార్చడానికి ఉపయోగపడుతుందని ఆశించవచ్చు. ప్రజల సమస్యలు త్వరగా పరిష్కారం కావడం, పథకాలు సకాలంలో అమలు కావడం ద్వారా మాత్రమే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ కొత్త ప్రయత్నం విజయవంతమైతే, భారత పాలనా చరిత్రలో ఇది ఒక మైలురాయిగా నిలుస్తుంది. మంత్రులు మాత్రమే కాదు, మొత్తం ప్రభుత్వ వ్యవస్థ ఫలితాల మీద దృష్టి సారించే సంస్కృతి ఏర్పడటం దేశం కోసం శుభ సూచన.

# బొగ్గు నుంచి గ్యాస్...

**ముంబై, (భారత శక్తి)** భారతదేశం ఇంధన దిగుమతులపై ఎంతగా ఆధారపడి ఉందో ఇటీవలి ఘటనలు మరోసారి ఉద్ఘాటించాయి. ఎల్ఎన్‌జీలో 42 శాతం ఖతార్ నుంచి భారత్ దిగుమతి చేసుకుంటోంది. అయితే తాజాగా పశ్చిమాసియా యుద్ధం కారణంగా అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడిచేశాయి. ఇరాన్ గల్ఫ్ దేశమైన ఖతార్‌పై దాడిచేసింది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తలెత్తడంతో భారత్‌కు ఎల్ఎన్‌జీ సరఫరా 30 శాతం పడిపోయింది. ప్రపంచవ్యాప్తంగా 17 శాతం గ్యాస్ సరఫరా తగ్గడం కేవలం భారత్ సమస్య మాత్రమే కాదు, అంతర్జాతీయ ఇంధన మార్కెట్ స్థిరత్వానికి కూడా హెచ్చరిక. కేంద్ర ప్రభుత్వం ఎల్ఎన్‌జీ కొరత తీర్చడానికి కీలక నిర్ణయం తీసుకుంది. 37,500 కోట్ల రూపాయలతో కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుకు చేపట్టిన నిర్ణయం సమయోచితం మాత్రమే కాదు, దూరదృష్టి కలిగిన వ్యూహాత్మక చర్య. బొగ్గు నుంచి గ్యాస్ ఉత్పత్తి చేసే ఈ సాంకేతికత ద్వారా దేశం దీర్ఘకాలికంగా విదేశీ ఆధారాలను తగ్గించుకోవడం సాధ్యమవుతుంది. ఖతార్, దుబాయ్ వంటి దేశాలపై ఎల్ఎన్‌జీ కోసం అత్యధికంగా ఆధారపడటం భారత్ శక్తి భద్రతకు పెద్ద ముప్పు. భౌగోళిక రాజకీయ సంక్షోభాలు ఎప్పుడు ఏ రూపంలో మన సరఫరా గొలుసును దెబ్బతీస్తాయో చెప్పలేం. గతంలో రష్యా?ఉక్రెయిన్ యుద్ధం కూడా ఇంధన ధరలను పెంచి భారత్‌ను ఇబ్బంది పెట్టింది. ఇలాంటి సందర్భాల్లో స్థానిక ఉత్పాదకతను పెంచకపోతే, ఆర్థిక వ్యవస్థ మీద ఒత్తిడి పెరుగుతుంది. ఈ నేపథ్యంలో మోదీ సర్కారు చేపట్టిన కోల్ గ్యాసిఫికేషన్ కార్యక్రమం భారత్ చరిత్రలో మొదటి సారి ఇంత పెద్ద స్థాయిలో చేపట్టిన ప్రయత్నం.

దేశంలో సమృద్ధిగా ఉన్న బొగ్గు వనరులను సమర్థవంతంగా వినియోగించుకుని, సింథటిక్ గ్యాస్ ఉత్పత్తి చేయడం ద్వారా దిగుమతులు తగ్గించి, విదేశీ మారక నిల్వలను కాపాడవచ్చు. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే ఖతార్‌పై మాత్రమే కాక, మొత్తం ఇంధన దిగుమతులపై ఆధారం తగ్గుతుంది. ఉపాధి అవకాశాలు పెరగడం, బొగ్గు ఉత్పత్తి ప్రాంతాల అభివృద్ధి, శక్తి భద్రత వంటి బహుముఖ ప్రయోజనాలు ఉన్నాయి. అంతేకాకుండా, ఇది ప్రపంచానికి ఒక మార్గదర్శకంగా నిలవవచ్చు. ఖతార్ వంటి దేశాలపై ఆధారపడిన అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా ఇలాంటి మార్గాలు అన్వేషించేలా చేస్తుంది. అయితే, ఈ ప్రయత్నం సవాళ్లు లేకుండా కాదు. పర్యావరణ భద్రత, కార్బన్ ఉద్గారాల నియంత్రణ, ఆధునిక టెక్నాలజీ అవసరం ఉంది. కార్బన్ క్యాప్చర్ అండ్ స్టోరేజ్ (సీసీఎస్) వంటి సాంకేతికతలను తప్పనిసరిగా అనుసరించాలి. ప్రారంభ దశలో ఖర్చులు ఎక్కువైనా, దీర్ఘకాలిక లాభాలు భారీగా ఉంటాయి. ఇంధన రంగంలో స్వాతంత్ర్యం సాధించడం ఏ దేశానికైనా జాతీయ భద్రతకు సమానం. ఖతార్ సంక్షోభం భారత్‌కు ఒక కఠిన హెచ్చరికగా మారి, స్వయం సమృద్ధి వైపు వేగంగా అడుగులు వేయడానికి కారణమైంది. మోదీ సర్కారు చేపట్టిన కోల్ గ్యాసిఫికేషన్ కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేస్తే, ఇది కేవలం ఒక ప్రాజెక్టు కాకుండా, భారత్ ఇంధన విధానంలోనే ఒక చారిత్రక మలుపుగా నిలుస్తుంది. ఈ దిశలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయం. సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణ రక్షణ, సమర్థవంతమైన అమలుతో ఈ ప్రయత్నం పూర్తి విజయం సాధించాలని ఆశిద్దాం.

# ప్రారంభమైన రోహిణి కార్తె..

## భానుడి భగభగలు...


### – అప్రమత్తంగా ఉండాలని నిపుణుల హెచ్చరిక!

**బ్రహ్మంగారిమఠం** సోమవారం నుంచి రోహిణి కార్తె ప్రారంభం కానుంది. జూన్ 8వ తేదీ వరకు కొనసాగే ఈ కార్తె కాలంలో ఎండల తీవ్రత గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఎండ వేడిమి వల్ల శరీరంలోని నీటి శాతం తగ్గి డీహైడ్రేషన్, తీవ్ర అలసట, తలనొప్పి వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకో వడానికి రోజంతా తరచుగా నీరు తాగాలని, కేవలం దాహం వేసినప్పుడే కాకుండా మధ్యమధ్యలో పానీయాలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి, అత్యవసరమైతే తప్ప బయటకు రావ ద్దని కోరారు. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ ధరించాలని, లేత రంగు కాటన్ దుస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. శరీరాన్ని చల్లబరిచేందుకు మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం మరియు ఓఆర్ఎస్ (రాఖీూ) పానీయాలు తీసుకోవడం మేలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే పుచ్చకాయ, దోసకాయ, ఖర్బూజ వంటి నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లను ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండవచ్చని స్పష్టం చేశారు.

## అధికారిక ప్రకటనే ఆలస్యం




తమిళ అగ్రనటుడు, ఇళయ దళపతి విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగానే, ఆయన తాజా సినిమా 'జన నాయగన్' విడుదలకు అన్ని ఆటంకాలు తొలిగిపోయినట్టయింది. ఇక ఆ సినిమా విడుదల కోసం విజయ్ అభిమానులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. లేటెస్ట్ బజ్ ప్రకారం ఈ సినిమా కొత్త రిలీజ్ డేట్ ఫిక్స్ అయినట్టు తెలుస్తున్నది. జూన్ 22న విజయ్ పుట్టినరోజు. కాబట్టి, జూన్ 19న సినిమాను గ్రాండ్‌గా విడుదల చేయాలని మేకర్స్ నిశ్చయించారట. ఇప్పటికే కొన్ని ఆన్‌లైన్ బుకింగ్ యాప్స్‌లో డేట్ వచ్చేసింది. ప్రస్తుతం అధికారిక ప్రకటన కోసం అంతా ఎదురుచూస్తున్నారు. తెలుగులో బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి' చిత్రానికి రీమేక్‌గా ఈ చిత్రం రూపొందినట్టు వినికిడి. మమితా బైజు కీలక పాత్ర పోషించిన ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయిక. హెచ్ వినోద్ దర్శకత్వంలో కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై ఈ పానిండియా చిత్రం తెరకెక్కింది.




## ఓటీటీలోకి ధనుష్ 'కర'..

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన తాజా రూరల్ యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ సినిమా 'కర' థియేటర్లలో విడుదలైన నెల రోజుల్లోపే ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను దక్కించుకుంది. మే 28 (2026) నుండి ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారికంగా మేకర్స్ ప్రకటించారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం మరియు హిందీ భాషల్లో ఈ చిత్రం అందుబాటులో ఉండబోతుంది. మమితా బైజు (మలయాళ 'ప్రేమలు' ఫేమ్) ఇందులో కథానాయికగా నటించగా.. కేఎస్ రవికుమార్, జయరామ్, సూరజ్ వెంజరమూడు కీలక పాత్రల్లో నటించారు. విఘ్నేశ్ రాజా దర్శకత్వం వహించాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇది 1991 గల్ఫ్ వార్ నేపథ్యంలో సాగే ఒక పీరియడ్ యాక్షన్ థ్రిల్లర్. ఇందులో కరస్వామి అలియాస్ కర (ధనుష్) ఒక ప్రొఫెషనల్ దొంగ. తాను ప్రాణంగా ప్రేమించిన మల్లి (మమితా బైజు) కోసం ఆ నేర జీవితాన్ని వదిలేసి, సొంతంగా ఒక హోటల్ పెట్టుకుని బతకాలని అనుకుంటాడు. పెట్టుబడి కోసం తన ఊరిలో ఉన్న తాతల నాటి పొలం కాగితాలను బ్యాంకులో తాకట్టు పెట్టాలని ప్లాన్ చేస్తాడు. కానీ, కొన్ని అనుకోని పరిస్థితుల్లో ఆ పొలాన్ని బ్యాంకు జప్తు చేస్తుంది. దాంతో తన కుటుంబ ఆస్తిని కాపాడుకోవడానికి కర మళ్లీ దొంగగా మారాల్సి వస్తుంది. ఒకే బ్యాంకుకు చెందిన వివిధ బ్రాంచ్‌లలో బ్యాంక్ రాబరీలకు పాల్పడుతుంటాడు. ఆ తర్వాత ఏం జరిగింది అనేదే సినిమా కథ.

## యాక్షన్ మోడ్‌లోకి అక్షయ్



గత కొన్నేళ్లుగా వినోదప్రధానమైన చిత్రాలు, భావోద్వేగ కథలతో ఆడియన్స్‌ని అలరిస్తున్న బాలీవుడ్ సూపర్‌స్టార్ అక్షయ్‌కుమార్ త్వరలో యాక్షన్ మోడ్‌లోకి రానున్నారు. పూర్తిస్థాయి యాక్షన్ సినిమాలో ఆయన నటించి చాలా ఏళ్లయింది. ఆ లోటును భర్తీ చేస్తూ అక్షయ్ చేస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'సముక్'. కనిష్క్ వర్మ దర్శకుడు. విపుల్ అమృత్‌లాల్ షా నిర్మాత.ఠభారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. త్వరలోనే సెట్స్ పైకి వెళ్లనున్న ఈ సినిమా గురించి నిర్మాత మాట్లాడుతూ 'అక్షయ్ పూర్తిస్థాయి యాక్షన్ మోడ్‌లోకి తిరిగి వస్తున్నారు. ఇది ఓ ఏలియన్ సర్వైవల్ థ్రిల్లర్. హారర్ అంశాలతోపాటు, మిలిటరీ రియలిజం కూడా ఇందులో ఉంటాయి. అంతర్జాతీయ సాంకేతిక బృందం ఈ సినిమాకోసం పనిచేయబోతున్నది. 'సముక్' భారతీయ సినీ చరిత్రలో ఇంతకు ముందు రాని ప్రయత్నం' అని తెలిపారు.

## నా శరీరంలో మార్పులు చూసి..
## ప్లాస్టిక్ సర్జరీ అనుకున్నారు: అవికా గోర్

ఇటీవలే 'అగ్లీ స్టోరీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన కథానాయిక అవికా గోర్ ప్లాస్టిక్ సర్జరీలు, కాస్మోటిక్ ట్రీట్‌మెంట్లు చేయించుకుందంటూ సోషల్ మీడియాలో గాసిప్స్ వినిపిస్తున్నాయి. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఈ రూమర్లపై ఆమె స్పందిస్తూ ఫుల్ క్లారిటీ ఇచ్చింది. తమపై వస్తున్న సర్జరీ వదంతులను అవికా పూర్తిగా తోసిపుచ్చింది. "నేను ముఖంపై ఒక చిన్న ట్రీట్‌మెంట్ తీసుకున్న మాట వాస్తవమే. కానీ, అది అందం కోసం చేయించుకున్న సర్జరీ కాదు.. కేవలం నా ముఖంపై ఉన్న పింపుల్స్ (మొటిమలు) తగ్గించుకోవడానికి మాత్రమే. దురదృష్టవశాత్తూ అది కూడా సరిగా పనిచేయలేదు" అని వెల్లడించింది. నటిగా స్క్రీన్‌పై ప్రెజెంటబుల్‌గా కనిపించడం ముఖ్యం కాబట్టి, అవసరాన్ని బట్టి అప్పుడప్పుడు పార్లర్‌కు వెళ్లి బ్లడ్ సెల్స్ క్లీనింగ్, బైఫిషియల్ లాంటి సాధారణ ఫేషియల్స్ చేయించుకునేదాన్ని తప్ప ఎలాంటి కాస్మోటిక్ సర్జరీలు చేయించుకోలేదని స్పష్టం చేసింది.

"నాకు 7 ఏళ్ల వయసున్నప్పటి నుండే మేకప్ వేసుకోవడం అలవాటైంది. నా చర్మాన్ని కాపాడుకోవడానికి సన్‌స్క్రీన్ ఎక్కువగా వాడతాను. అసలు ఒక చిన్న టాటూ వేయించుకోవాలన్నా, కనీసం హెయిర్ కట్ చేయించుకోవాలన్నా మా అమ్మ పర్మిషన్ కావాలి..



అలాంటిది అంత పెద్ద సర్జరీలు నేను ఎలా చేయించుకోగలను?" అని అవికా ఎదురు ప్రశ్నించింది. శరీరంలో వచ్చిన మార్పులు, ఫిట్‌నెస్ గురించి మాట్లాడుతూ.. "నా శరీరతత్వం ఏంటంటే.. చాలా త్వరగా బరువు పెరుగుతాను. అంతే వేగంగా బరువు తగ్గుతాను. వయసు పెరిగే కొద్దీ అమ్మాయిల శరీరంలో సహజంగానే మార్పులు వస్తాయి. కానీ, నన్ను చిన్నప్పటి నుండి చూస్తున్న జనాలు ఆ మార్పులను గమనించి ప్లాస్టిక్ సర్జరీ అనుకుని పొరబడ్డారు" అని చెప్పింది. ఇండస్ట్రీలో సమంత, రష్మిక మందన్నా, పూజా హెగ్డే వంటి స్టార్ హీరోయిన్లు తమ బాడీని ఎంత పర్‌ఫెక్ట్‌గా మెయింటైన్ చేస్తారో చూసి తాను ఎంతో ఇన్‌స్పైర్ అయ్యానని, వారిలాగే తాను కూడా జిమ్‌లో కఠినమైన వర్కవుట్స్ చేస్తూ సహజంగానే బరువు తగ్గానని అవికా గోర్ క్లారిటీ ఇచ్చింది.

## వారణాసి... హైదరాబాదులో
## మహేష్ బాబుపై పాట చిత్రీకరణ!



సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న వారణాసి చిత్రంపై ఓ ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన కీలకమైన పాటను హైదరాబాద్‌లోని కాటేదాన్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఇది కేవలం ఓ సాధారణ డ్యాన్స్ నంబర్ కాదని, కథను ముందుకు నడిపించే ముఖ్యమైన పాట అని తెలుస్తోంది.ఈ గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్ షూటింగ్‌ను ఈ ఏడాది ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని రాజమౌళి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పలు ప్రధాన షెడ్యూల్స్‌ను పూర్తి చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో నీటి కొరత కారణంగా, ముందుగా ప్లాన్ చేసుకున్న ఓ అండర్‌వాటర్ సీక్వెన్స్‌ను కూడా విజయవంతంగా చిత్రీకరించారు.ఈ సినిమాలో ప్రియాంకా చోప్రా మందాకిని పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రంలో మహేశ్ బాబు 'రుద్ర' అనే సాహస యాత్రికుడిగా కనిపించనుండగా, ఓ ప్రత్యేక ఘట్టంలో శ్రీరాముడి పాత్రలోనూ కనిపిస్తారని ప్రచారం జరుగుతోంది. విలన్‌గా పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' పాత్రలో నటిస్తున్నారు.ఈ భారీ చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. అయితే, ఈ షూటింగ్ వివరాలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన ఇంకా రావాల్సి ఉంది.

## ఆద్యంతం సంగీతభరితంగా
# సింగ్ గీతం



94ఏండ్ల వయసులో ప్రఖ్యాత దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన విభిన్న కథా చిత్రం 'సింగ్ గీతం'. భారతదేశపు తొలి మ్యూజికల్ ఫాంటసీగా రూపొందిన ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని వైజయంతీ మూవీస్ సమర్పణలో, స్వప్న సినిమా పతాకంపై నాగ్‌అశ్విన్ నిర్మించారు. ఒక దిగ్గజ దర్శకుడు, ఒక లెజెండరీ నిర్మాణ సంస్థ కలిసి రూపొందించిన ఈ చిత్రం ద్వారా అయాన్, అహల్య బమ్రూ, శాలిని కొండేపూడి ప్రధాన పాత్రధారులుగా పరిచయం అవుతున్నారు. జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఆదివారం వైజాగ్‌లో ఈ సినిమాకు చెందిన ప్రత్యేక ఈవెంట్‌ని మేకర్స్ నిర్వహించారు. దేశంలో ఇప్పటివరకూ రాని కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందిందని, ఇంత గొప్ప సినిమాకు హీరోను కావడం తన అదృష్టమని హీరో అయాన్ అన్నారు. ఈ సినిమాలో భాగం కావడం పట్ల అహల్య బమ్రూ, శాలినీ కొండేపూడి ఆనందం వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి సంగీతం అందించిన దేవిశ్రీప్రసాద్ మాట్లాడుతూ 'సింగీతం సినిమాకు సంగీతం అందించడం నా అదృష్టం. అరుదుగా వచ్చే అవకాశం ఇది. ఇది కంప్లీట్ మ్యూజికల్ ఫిల్మ్. అంతా మనసుపెట్టి పనిచేశాం. సింగీతంగారికోసమైనా ఈ సినిమా తప్పక అంతా చూడాలి' అని పేర్కొన్నారు.

### డివిజన్లు పెరిగిన తర్వాతే

# జీవీఎంసీ ఎన్నికలు

**విశాఖపట్నం(భారత శక్తి)** మహా విశాఖ నగర పాలక సంస్థ జీవీఎంసీ పాలక వర్గం మార్చి 17తో పదవీ విరమణ చేసింది. దాంతో అంతా మాజీలు అయ్యారు. కొత్తగా ఎన్నికలు నిర్వహిస్తే మరోసారి కార్పొరేటర్ అనిపించుకోవాలని అంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. పదవి పోయి అపుడే రెండు నెలలు పై దాటింది. ఇలా మాజీ కార్పోరేటర్లు ఉంటే ఆశావహులు కూడా అనేక మంది రేసులోకి వస్తున్నారు. అందరి ఆలోచనలు ఎన్నికల మీదనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం సెప్టెంబర్ లో ఎన్నికలు నిర్వహిస్తుంది అన్న వార్తలతో అంతా వేచి చూస్తున్న వేళ ఉంది. అయితే జీవీఎంసీ ఎన్నికలు వాయిదా పడతాయని తాజాగా వస్తున్న వార్తలు అయితే ఆశావహులలో ఆందోళన కలిగిస్తున్నాయి.ఎందుకు జీవీఎంసీ ఎన్నికలు వాయిదా పడతాయి అంటే వార్డుల సంఖ్యను పెంచాలన్న డిమాండ్ వల్లనే అని అంటున్నారు. జీవీఎంసీకి 98 వార్డులు ప్రస్తుతం ఉన్నాయి. అయితే ప్రతీ పదిహేను వేల మందికి ఒక డివిజన్ అన్న విధానం మేరకు కార్పోరేషన్ వార్డులు విభజించాలని ప్రభుత్వం సూచించిన నేపధ్యంలో జీవీఎంసీ అధికారులు కసరత్తు చేసి 120 దాకా వార్డులను పెంచారు. ఆ ముసాయిదాను ప్రభుత్వానికి పంపించారు కూడా. అయితే అలా కాదు వార్డులను ఏకంగా 150 దాకా పెంచాలని స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి ఒత్తిడి వస్తోంది అని తెలుస్తోంది.అయితే మరో ముప్పై వార్డులు పెంచాలి అంటే జీవీఎంసీకి పక్కన ఉన్న అరవై దాకా ఉన్న పంచాయతీలను జీవీఎంసీలో విలీనం చేసుకోవాల్సి ఉంటుంది. అలా చేయడం వల్ల వార్డుల సంఖ్య బాగా పెరుగుతుంది. పెందుర్తి, ఆనందపురం, భీమునిపట్నం, పద్మనాభం మండలాలలో జీవీఎంసీలో విలీనం చేయాలని డిమాండ్ అయితే ఉంది. వాటికి ఆయన పంచాయతీలలో కూడా సుముఖత ఉంది అని అంటున్నారు. పెద్ద కసరత్తు గానే : అయితే జీవీఎంసీలో ఈ వార్డుల విభజన అన్నది పెద్ద కసరత్తు గానే చూస్తున్నారు. ఇదంతా అయ్యేసరికి కనీసంగా ఆరు నుంచి ఎనిమిది నెలల సమయం పడుతుందని అంటున్నారు. దాంతో సెప్టెంబర్ నెలలో ఎన్నికలు జీవీఎంసీకి ఉండే చాన్స్ లేదని అంటున్నారు. ఇక వార్డుల సంఖ్య పెరిగితే కూటమిలోని మూడు పార్టీల ఆశావహులకు పోటీ చేసేందుకు వీలు కలుగుతుంది. అదే సమయంలో పరిశ్రమలు అభివృద్ధి అంతా రూరల్ సెక్టార్ వైపుగానే ఉంది. అందువల్ల అక్కడ పంచాయతీలను జీవీఎంసీలో చేర్చితే అర్బన్ లుక్ వస్తుందని అభివృద్ధి కూడా వేగవంతం అవుతుందని, అనుమతులకు కూడా సులువుగా ఉంటుందని భావిస్తున్నారు.ఇదిలా ఉంటే విశాఖ ఉత్తర నియోజకవర్గానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు కూడా జీవీఎంసీ వార్డులను 150 దాకా పెంచాలని కోరుతున్నారు. ఈ మేరకు ఆయన మున్సిపల్ మంత్రి నారాయణను కలిసి వినతి చేశారు. కూటమి ప్రభుత్వానికి ఇప్పటికే ఎమ్మెల్యేలు కూడా దీని మీద కోరారని అంటున్నారు. ప్రభుత్వ పెద్దలు కూడా జీవీఎంసీ విస్తరణకు అంగీకరించారని చెబుతున్నారు. దాంతో జీవీఎంసీ వార్డులు బాగా పెరుగుతాయని చెబుతున్నారు. అదే కనుక జరిగితే మాత్రం ఎన్నికలు వాయిదా పడడం ఖాయంగా కనిపిస్తోంది. దాంతో రాష్ట్రంలో మిగిలిన కార్పోరేషన్లు మున్సిపాలిటీలతో పాటుగా జీవీఎంసీ ఎన్నికలు ఉండవన్న చర్చ సాగుతోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## రాజ్యసభ రేసు..టీడీపీ నుంచి బరిలో ఐదుగురు

**కర్నూలు (భారత శక్తి):** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు రాజ్యసభ ఎన్నికల చర్చ వేడెక్కుతోంది. మరో నెల రోజుల్లో రాష్ట్రానికి చెందిన నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానుండటంతో అధికార కూటమిలో ఆసక్తికరమైన రాజకీయ సమీకరణాలు కనిపిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ , జనసేన, భారతీయ జనతా పార్టీ మధ్య స్థానాల పంపకం ఎలా ఉండబోతుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. అదే సమయంలో ఈ స్థానాల కోసం పలువురు నేతలు, వ్యాపారవేత్తలు, పార్టీకి సన్నిహితులు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం వినిపిస్తున్న సమాచారం ప్రకారం నాలుగు స్థానాల్లో రెండు టీడీపీకి, ఒక్కో స్థానం జనసేన, బీజేపీకి కేటాయించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అసెంబ్లీలో బీజేపీకి పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలు లేకపోయినా, కేంద్రంలోని ఎన్డీఏ లో కీలక భాగస్వామి కావడంతో ఒక రాజ్యసభ సీటు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే గతంలో విజయసాయి రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన స్థానాన్ని బీజేపీకి కేటాయించిన నేపథ్యంలో ఈసారి మూడు స్థానాలు టీడీపీకి, ఒకటి జనసేనకు ఇవ్వొచ్చనే ప్రచారం కూడా సాగుతోంది.బీజేపీ అధిష్ఠానం రాజ్యసభలో తమ బలం పెంచుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టిన పరిస్థితిలో ఒక్క సీటు కూడా ఇవ్వకుండా ఉండటాన్ని ఆ పార్టీ అంగీకరిస్తుందా అన్నది సందేహంగా మారింది. ఒకవేళ బీజేపీకి స్థానం దక్కితే రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పేరు ముందంజలో ఉందని అంటున్నారు. లేదంటే ఇతర రాష్ట్రాల నాయకత్వం సూచించిన అభ్యర్థికి అవకాశం వెళ్లే అవకాశమూ ఉందని ప్రచారం జరుగుతోంది.జనసేన విషయానికి వస్తే, ఆ పార్టీకి కేటాయించే అవకాశం ఉన్న ఒకే ఒక్క స్థానానికి గట్టి పోటీ నెలకొంది. వ్యాపారవేత్త లింగమనేని రమేశ్ పేరు బలంగా వినిపిస్తోంది. ఆయనకు అవకాశం లభిస్తే కొన్ని సామాజిక వర్గాల సమీకరణాలపై ప్రభావం పడొచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అదే సమయంలో టీడీపీలో ఆశలు పెట్టుకున్న కొందరు నేతలకు నిరాశ ఎదురయ్యే అవకాశం ఉందనే చర్చ కూడా సాగుతోంది.టీడీపీలో కూడా రాజ్యసభ టికెట్ కోసం పెద్ద ఎత్తున లాబీయింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. లోకేశ్ కు సన్నిహితుడిగా పేరున్న కిలారు రాజేశ్ భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ మాజీ ఎంపీ గల్లా జయదేవ్, మాజీ రాజ్యసభ సభ్యుడు కంభంపాటి రామ్మోహన్ రావు పేర్లు వినిపిస్తున్నాయి. అయితే వీరిలో చాలామంది ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో అందరికీ అవకాశం దక్కే పరిస్థితి కనిపించడం లేదు.ఇక ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచన కూడా టీడీపీ అధిష్ఠానంలో ఉందని చెబుతున్నారు. వర్ల రామయ్య, అయ్యన్నపాత్రుడు కుమారుడు విజయ్ పేర్లు కూడా చర్చలో ఉన్నాయి. ప్రాంతీయ సమతూకం దృష్ట్యా రాయలసీమ నాయకత్వానికి కూడా అవకాశం ఇవ్వొచ్చనే ప్రచారం జరుగుతోంది. దీంతో రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి పేరు కూడా వినిపిస్తోంది. మొత్తంగా చూస్తే రాజ్యసభ ఎన్నికలు అధికార కూటమిలో రాజకీయ ఉత్కంఠను మరింత పెంచుతున్నాయి.

### ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు

## పరిష్కరించాలి: సంక్షేమ కమిటీ వినతి



జనగామ(భారత శక్తి)మే 25: తెలంగాణ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించింది. జనగామ డిపో మేనేజర్ కు, జనగామ జిల్లా కలెక్టర్ కు ప్రతినిధి బృందం వినతి పత్రం సమర్పించి ముఖ్యమంత్రి కార్యాలయానికి తెలుపవలసిందిగా కోరారు. ఆర్పిఎస్--2017 అమలు, పెండింగ్ బకాయిల చెల్లింపు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పీఎఫ్, డీడీ బకాయిలు తదితర అంశాలను ఈ వినతి పత్రం లో ప్రస్తావించారు.రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది విశ్రాంత ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. 2017 వేతన సవరణకు సంబంధించిన ప్రయోజనాలు ఇప్పటికీ పూర్తిగా అందలేదని, ప్రభుత్వం వెంటనే ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ చెల్లింపులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అలాగే ఉద్యోగులకు రావాల్సిన పీఎఫ్, డీడీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలను ఆలస్యం చేయకుండాచెల్లించాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులు వృద్ధాప్యంలో ఇబ్బందులు పడుతున్నందున ప్రభుత్వం మానవతాదృక్పథంతోస్పందించాలని చేస్తున్నట్లు విజ్ఞప్తి చేశారు.ఈ వినతిపత్రాన్ని తెలంగాణ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ కమిటీ జనగామ డిపో పరిధి నాయకులు ముస్త్యాల ముత్తయ్య. జి. యాకయ్య, ఎస్ బి ఎన్ రాజు, ఇ ఆర్ రెడ్డి, డి. ఉపచారి, టి. ఆర్. చందర్, బి. నరసింహులు, యు ఎన్. రెడ్డి, ఆర్. రాజేశం, ఎం డి షాబుద్దీన్, ఎల్ ప్రతాప్, ఏ ఎస్ ఎం రెడ్డి. డి కె మూర్తి, ఎం. బాలరాజు ముఖ్య నాయకులు పాల్గొని వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కొద్ది సేపు డిపో గేటు వద్ద తమకు న్యాయం చేయాలని కోర్టు ధర్నా నిర్వహించి అనంతరం డిపో మేనేజర్ స్వాతి ని కలిసి ఆమెకు వినతి పత్రం సమర్పించారు.

### జూన్ నుంచి అందుబాటులోకి

# భోగాపురం ఎయిర్ పోర్టు

**శ్రీకాకుళం,(భారత శక్తి)** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించిన పనులను అత్యంత వేగంగా పూర్తి చేసి, జూన్ నెలాఖరు నాటికి విమానాశ్రయాన్ని సిద్ధం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. జూన్‌లో ఎయిర్‌పోర్టు పనులు ముగియనుండటంతో, జులై నుంచి ఇక్కడి నుంచి అధికారికంగా విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయిఎయిర్‌పోర్టు ప్రారంభానికి ముందే అంతర్జాతీయ విమానయాన సంస్థలు భోగాపురం నుంచి సర్వీసులు నడిపేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. ఇందులో భాగంగా సింగపూర్ ఎయిర్‌లైన్స్ అనుబంధ చౌక ధరల విమానయాన సంస్థ కీలక ప్రకటన చేసింది. ఈ ఏడాది జులై 8వ తేదీ నుంచే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి తమ విమాన సర్వీసులను నడుపుతామని సదరు సంస్థ అధికారికంగా వెల్లడించింది. దీనితో ఎయిర్‌పోర్టు ప్రారంభమైన తొలి రోజుల్లోనే ఉత్తరాంధ్రకు సింగపూర్‌తో అంతర్జాతీయ కనెక్టివిటీ లభించనుంది. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి రావడం వల్ల విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల ప్రజలకు అంతర్జాతీయ ప్రయాణాలు మరింత సులభతరం కానున్నాయి. విశాఖపట్నం ఐటీ, ఫార్మా రంగాలు మరింత వృద్ధి చెందడానికి, పర్యాటక రంగం విస్తరించడానికి ఈ ఎయిర్‌పోర్టు కీలక మైలురాయిగా మారనుంది. గడువులోగా పనులన్నీ పూర్తి చేసి జులైలో విమానాలను పరుగులు పెట్టించడానికి కూటమి ప్రభుత్వం అన్ని రకాల చర్యలను ముమ్మరం చేసింది. ఉత్తరాంధ్రలోని ఫార్మా, ఆక్వా, ఐటీ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయడానికి వీలుగా ఇక్కడ ఒక భారీ అంతర్జాతీయ కార్గో టెర్మినల్ ను కూడా ఏర్పాటు చేస్తున్నారు.కాగా ఈ విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ సంస్థ నిర్మిస్తోంది. ఎయిర్‌పోర్ట్ మొదటి దశ పూర్తి కాగానే, ఇక్కడి నుంచి ఏడాదికి సుమారు 60 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణించేలా వసతులు కల్పిస్తున్నారు. ఇక్కడ నిర్మిస్తున్న రన్‌వే పొడవు సుమారు 3.8 కిలోమీటర్లు. దీనివల్ల ప్రపంచంలోనే అతిపెద్ద ప్రయాణీకుల విమానమైన ఎయిర్‌బస్ ఏ380 లాంటి జంబో జెట్ విమానాలు కూడా ఇక్కడ సులభంగా ల్యాండ్ అవ్వగలవు.

జూలై నుంచి సింగపూర్ కుఉత్తరాంధ్ర ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే నిర్మాణ పనులు చివరి దశకు చేరుకోగా, మరికొన్ని వారాల్లోనే ఈ ఎయిర్‌పోర్ట్ ప్రజలకు అందుబాటులోకి రానుందనే వార్త ప్రాంత ప్రజల్లో ఉత్సాహాన్ని పెంచుతోంది. జూలై తొలి వారంలోనే విమానాశ్రయాన్ని అధికారికంగా ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని సమాచారం.ఈ ప్రాజెక్ట్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా జూలై 5న ప్రారంభించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత జూలై 8 నుంచి పూర్తి స్థాయిలో విమాన సర్వీసులు ప్రారంభమవుతాయని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే పలు విమానయాన సంస్థలు తమ కార్యకలాపాలను భోగాపురం నుంచి ప్రారంభించేందుకు అంతర్గతంగా ఏర్పాట్లు చేసుకుంటున్నాయని చెబుతున్నారు.ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం ప్రత్యేకతగా మారింది. జూలై 4న అల్లూరి జయంతి ఉండటంతో, మరుసటి రోజే విమానాశ్రయం ప్రారంభం జరగడం ఉత్తరాంధ్ర ప్రజలకు భావోద్వేగపూరితమైన అంశంగా మారుతోంది. ఒకవైపు అల్లూరికి ఘన నివాళి, మరోవైపు ప్రాంత అభివృద్ధికి భారీ అడుగు అనే భావన ప్రజల్లో కనిపిస్తోంది. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభం తర్వాత విశాఖపట్నం విమానాశ్రయం భవిష్యత్తుపై కూడా చర్చ సాగుతోంది. ప్రస్తుతం ఉన్న విశాఖ ఎయిర్‌పోర్ట్ నేవీ ఆధీనంలోని ప్రాంతంలో ఉండటంతో విస్తరణకు పరిమితులు ఉన్నాయి. ఈ కారణంగానే కొత్త అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం అవసరం చాలా కాలంగా ఉందని అధికారులు చెబుతున్నారు. భోగాపురం ప్రారంభమైతే ప్రధానంగా అంతర్జాతీయ, దేశీయ విమానాల రాకపోకలు అక్కడికే మారే అవకాశం ఉందని భావిస్తున్నారు.ఇప్పటికే కొన్ని ఎయిర్‌లైన్స్ తమ ప్రయాణికులకు కొత్త విమానాశ్రయానికి సంబంధించిన సమాచారం అందిస్తున్నట్లు తెలుస్తోంది. సింగపూర్ ఎయిర్‌లైన్స్ సహా మరికొన్ని సంస్థలు జూలై నుంచి భోగాపురం నుంచే సేవలు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నాయని సమాచారం. దీంతో ప్రయాణికులు కూడా కొత్త ఎయిర్‌పోర్ట్‌కు అలవాటు పడే పరిస్థితి ఏర్పడుతోంది. ఇక ఈ ప్రాజెక్ట్ చుట్టూ మరో రాజకీయ చర్చ కూడా మొదలైంది. ప్రస్తుతం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ ఎయిర్‌పోర్ట్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టారని చెబుతున్నారు. గత రెండేళ్లుగా ఆయన ఈ ప్రాజెక్ట్ పురోగతిని దగ్గరుండి పర్యవేక్షించారని రాజకీయ వర్గాలు అంటున్నాయి. అయితే త్వరలో కేంద్ర కేబినెట్ విస్తరణ జరిగే అవకాశం ఉందన్న వార్తలతో అప్పటికీ ఆయన అదే శాఖలో కొనసాగుతారా లేదా అనే చర్చ మొదలైంది. భోగాపురం విమానాశ్రయం ప్రారంభం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలక మలుపుగా మారుతుందని స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమలు, పర్యాటకం, ఉద్యోగ అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతానికి అంతర్జాతీయ గుర్తింపు కూడా వస్తుందని భావిస్తున్నారు.

### ఉండవల్లి కొండ ప్రాంతంలో

# అదుపులోకి మంటలు

#### - స్థానికులు ఆందోళన చెందవద్దన్న అధికారులు



**విజయవాడ(భారత శక్తి)**(ఉండవల్లి కొండల్లో అగ్ని రాజుకున్న ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ, అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులతో ఫోనులో మాట్లాడారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయని అధికారులు తెలిపారు. సాయంత్రం అగ్ని ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, ఫైర్ ఇంజిన్లు ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసే చర్యలు ప్రారంభించారు. కాలనీలు, జనవాసాల వైపు మంటలు విస్తరించకుండా అగ్నిమాపక శాఖ సిబ్బంది చూసారు. చర్చి దగ్గర్లోకి మంటలు వచ్చిన వెంటనే ఫైర్ ఇంజన్లతో మంటలను ఆర్పివేసారు. కొండ దిగువ నివాస ప్రాంతాలకు మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. ప్రమాదం లేదని సిబ్బంది అలెర్టుగా ఉన్నారని సిఎంకు గుంటూరు జిల్లా కలెక్టర్ వివరించారు. ఉండవల్లి సమీపంలోని కుమ్మరిగుంట చెరువు వద్ద రెండు ఫైర్ ఇంజన్లను అందుబాటులో అధికారులు వుంచారు. ఫైర్ సేఫ్టీ వాహనాలు చేరుకోగలిగిన ప్రాంతం వరకు వెళ్లి పైపుల సహాయంతో మంటలు అదుపు చేసారు. ఇళ్లకు సమీపంలో మంటలు లేవని అగ్నిమాపక సిబ్బంది అలెర్టుగా ఉన్నారని తెలిపారు.

మంటలు పూర్తిగా ఆరిపోయేవరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సిఎం ఆదేశించారు. అవసరమైతే ఇతర ప్రాంతాల నుంచి అగ్నిమాపక వాహనాలను తెప్పించాలని ఆదేశించారు. స్థానిక ప్రజలు ఆందోళన చెందకుండా ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సిఎం ఆదేశించారు.

### అడ్మినిస్ట్రేషన్‌లో

# లోకేష్ మార్క్

**గుంటూరు,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మంత్రి నారా లోకేశ్ తీసుకుంటున్న నిర్ణయాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారుతున్నాయి. ముఖ్యంగా ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి రాజకీయంగా ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ముందుగానే జాగ్రత్త పడుతున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ప్రభుత్వంపై విమర్శలు వచ్చే అంశాల్లో కేవలం రాజకీయ సమాధానాలకే పరిమితం కాకుండా, అసలు సమస్య ఎక్కడ ఉందో గుర్తించి వెంటనే పరిష్కారం చూపించే విధానాన్ని లోకేశ్ అనుసరిస్తున్నారని అధికారులు, విశ్లేషకులు చెబుతున్నారు.ఇటీవల రాష్ట్ర స్థాయి దివ్యాంగుల సంఘం ప్రతినిధులు మాజీ సీఎం జగన్‌ను కలిసి యూనివర్సిటీ ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్‌లో తమకు రావాల్సిన రిజర్వేషన్లు ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై జగన్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ దివ్యాంగులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ఘటన రాజకీయంగా చర్చకు దారి తీసింది. అయితే సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో అధికార పార్టీ ప్రతిపక్షంపై విమర్శలు చేయడం లేదా రాజకీయంగా ఎదురుదాడి చేయడం సహజం. కానీ ఈ అంశంలో లోకేశ్ వ్యవహరించిన తీరు భిన్నంగా ఉందని చెబుతున్నారు.విద్యాశాఖ అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించిన లోకేశ్, సమస్య ఎందుకు వచ్చింది? ఎక్కడ లోపం జరిగింది? దానికి బాధ్యులు ఎవరు? అనే అంశాలపై ఆరా తీశారని సమాచారం. ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తున్న సమయంలో దివ్యాంగులు ప్రతిపక్ష నేతను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని అధికారులను ప్రశ్నించారనే చర్చ సాగుతోంది. కేవలం రాజకీయ పరమైన నష్టం కాకుండా, ప్రజలకు న్యాయం ఆలస్యం కావడంపైనా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారని అంటున్నారు.

దివ్యాంగులకు ఎలాంటి అన్యాయం జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని, పూర్తి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్టు సమాచారం. సమస్యను రాజకీయంగా పెద్దది కాకముందే పరిష్కరించాలనే దిశగా లోకేశ్ వేగంగా స్పందించారని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దీనిని కొత్త తరహా పాలనా శైలిగా కూడా కొందరు అభివర్ణిస్తున్నారు.ఇప్పటికే విద్యా రంగంలో పలు మార్పులు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్న లోకేశ్, చిన్న చిన్న అంశాలపైనా ప్రత్యేక దృష్టి పెడుతున్నారని చెబుతున్నారు. గతంలో పాఠ్యపుస్తకాలలో లింగ సమానత్వానికి విరుద్ధంగా ఉన్న కొన్ని చిత్రాలను గుర్తించి వెంటనే మార్పులు చేయించిన ఘటనను కూడా ఇప్పుడు గుర్తు చేస్తున్నారు. అదే విధంగా దివ్యాంగుల సమస్య విషయంలో కూడా ఆలస్యం చేయకుండా స్పందించడం ద్వారా ప్రభుత్వంపై విమర్శలకు అవకాశం ఇవ్వకూడదనే వ్యూహంతో ముందుకెళ్తున్నారని అంటున్నారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రతిపక్షం విమర్శలు చేస్తూనే ఉంది. అలాంటి పరిస్థితుల్లో ప్రతి అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా పరిపాలనా కోణంలో చూసి పరిష్కారం చూపడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంచాలనే ప్రయత్నం లోకేశ్ చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### బయోస్పియర్ రిజర్వ్ వెనుక

## 16 సంవత్సరాల కష్టం

**తిరుపతి,(భారత శక్తి)** మానవ మనుగడ సాఫీగా సాగాలన్నా, పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉండాలన్నా జీవవైవిధ్యం ఎంతో అవసరం. మనకు కావాల్సిన స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం అన్నీ ప్రకృతి నుంచే లభిస్తాయి. కానీ, పెరుగుతున్న కాలుష్యం, అడవుల నరికివేత, వాతావరణ మార్పుల వల్ల ఎన్నో అరుదైన జీవజాతులు నేడు అంతరించిపోయే ప్రమాదంలో పడ్డాయి. ఈ నేపథ్యంలో 'ప్రకృతిని రక్షించుకోవడం అంటే.. మనల్ని మనం కాపాడుకోవడమే' అనే ఉద్దేశంతో శేషాచలం అడవుల ప్రాధాన్యతపై ప్రత్యేక కథనం."ఇండియన్ స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం.. తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) పరిధిలోని శేషాచలం అటవీ ప్రాంతం ఏకంగా 89.40 శాతం పచ్చదనంతో అలరారుతోంది.

అడవుల అద్భుత నిర్వహణలో ఈ ప్రాంతం దేశంలోనే అత్యుత్తమ స్థానంలో నిలిచినట్లు ఐఎస్ఎఫ్ఆర్ స్పష్టం చేసింది.జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడంలో ప్రజలు భాగస్వాములు కావాలి. అడవులు, వన్యప్రాణుల రక్షణలో అటవీశాఖకు సహకరించినప్పుడే మానవ మనుగడకు భరోసా కలుగుతుంది. జీవవైవిధ్య క్షీణతను అడ్డుకోవడం అనేది ఒక్కరితో సాధ్యమయ్యే పని కాదు, అది సమస్త మానవాళి ఉమ్మడి కర్తవ్యం. పర్యావరణ పరిరక్షణ కోసం క్షేత్రస్థాయిలో మనం చేసే ప్రతి చిన్న ప్రయత్నమూ అమూల్యమైనదే. శేషాచలం అడవులు దక్షిణ భారతదేశంలోనే అత్యంత ముఖ్యమైన జీవవైవిధ్య హాట్ స్పాట్ గా గుర్తింపు పొందాయి. ఈ అడవుల ప్రత్యేకతలు క్రింది విధంగా ఉన్నాయి. తూర్పు కనుమలలో భాగమైన ఈ ప్రాంతాన్ని 2010లో యునెస్కో 'బయోస్పియర్ రిజర్వ్'గా ప్రకటించింది.

ఇది ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల్లో కలిపి దాదాపు 4,756 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. ఇందులో శ్రీవేంకటేశ్వర జాతీయ అభయారణ్యం కూడా ఉంది. ప్రపంచంలో మరెక్కడా లభించని, అంతరించిపోతున్న అరుదైన ఎర్రచందనం వృక్షాలకు ఈ అడవులు నిలయంగా ఉన్నాయి.

అలాగే ఇక్కడ దాదాపు 1,500 జాతుల వనమూలికలు (ఔషధ మొక్కలు) ఉన్నాయి. అంతరించిపోతున్న అరుదైన వన్యప్రాణులైన దేవాంగ పిల్లి (స్లెండర్ లోరిస్), బంగారు బల్లి, ఎలుక జింక (మౌస్ డీర్), బెట్టు ఉడుత వంటి జీవులకు ఈ అడవులు ఆవాసంగా మారాయి. వీటితో పాటు 178 నుండి 215 విభిన్న రకాల పక్షి జాతులు ఇక్కడ జీవిస్తున్నాయి.

# గీతం కె.ఎస్.పి.పి.ని సత్కరించిన తెలంగాణ పోలీసు అకాడమీ

**- కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ తరఫున జ్ఞాపికను స్వీకరించిన రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ**

**సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, మే 25:**.వృత్తిపరమైన శిక్షణ, ప్రజా సేవ రంగాలలో 40 ఏళ్ల ఘనమైన సేవను పూర్తిచేసుకున్న సందర్భంగా, రాజా బహదూర్ వెంకట రామరెడ్డి తెలంగాణ పోలీసు అకాడమీ (ఆర్బీవీఆర్ఆర్ టీజీపీఏ) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కె.ఎస్.పి.పి.)ని ఒక స్మారక చిహ్నంతో సత్కరించింది.హైదరాబాదులోని తెలంగాణ పోలీసు అకాడమీ ప్రాంగణంలో జరిగిన ఒక అధికారిక కార్యక్రమంలో, తెలంగాణ గౌరవ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ఈ స్మారక చిహ్నాన్ని గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్, పూర్వ సంచాలకుడు పి.ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీసు అకాడమీ తాము కొనసాగిస్తున్న విద్యాపరమైన సహకారాలు, సంస్థాగత భాగస్వామ్యాలను గుర్తించి, యునిసెఫ్, ఐఐటీ హైదరాబాదు, జేఎన్టీయూ హైదరాబాదు, తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ వంటి పలు ప్రముఖ సంస్థలను కూడా సత్కరించింది.సుపరిపాలన, విధాన విద్య, పరిశోధన, నాయకత్వ అభివృద్ధి, సామర్థ్య నిర్మాణం వంటి అంశాలను ప్రోత్సహించడంలో విద్యా సంస్థలకు, ప్రజా సేవా సంస్థలకు మధ్య పెరుగుతున్న సమన్వయాన్ని ఈ కార్యక్రమం ప్రత్యేకంగా చాటి చెప్పింది. సమాజ, సంస్థాగత పురోగతికి దోహదపడే అర్థవంతమైన సహకారాలను పెంపొందించడంలో కె.ఎస్.పి.పి.కి ఉన్న నిబద్ధతను ఈ సన్మానం మరింత బలోపేతం చేసింది.



జర్నలిస్టుకు బెదిరింపులు, సింగిల్ విండో

# ప్రెసిడెంట్ పై కేసు నమోదు



**పోరుమామిళ్ల, భారతశక్తి ప్రతినిధి, మే 25:** జర్నలిస్టును దుర్భాషలాడి, ప్రాణభీతి కలిగించేలా బెదిరింపులకు పాల్పడిన పోరుమామిళ్ల సింగిల్ విండో ప్రెసిడెంట్ కల్లూరి వెంకట కృష్ణారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మైదుకూరు డీఎస్పీ ఆదేశాల మేరకు పోరుమామిళ్ల పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోరుమామిళ్లకు చెందిన సీనియర్ రిపోర్టర్ దియ్యాల శ్రీనివాసులు ప్రైమ్ 9 టీవీలో పోరుమామిళ్ల, కలసపాడు, బి.కోడూరు, శ్రీ అవధూత కాశినాయన మండలాల రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. కాగా పోరుమామిళ్ల సింగిల్ విండో ప్రెసిడెంట్‌గా ఉన్న కల్లూరి వెంకట కృష్ణారెడ్డి, ప్రైమ్ 9 సంస్థకు చెందిన క్యాలెండర్ ప్రకటన (అడ్వర్టైజ్‌మెంట్) నిమిత్తం రూ. 15,000 ఇవ్వాల్సి ఉంది. అయితే ఐదు నెలలు గడిచినా సదరు మొత్తాన్ని ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. ఈ నెల 23న ఉదయం, సాయంత్రం వేళల్లో జర్నలిస్ట్ శ్రీనివాసులు ఫోన్ చేసి డబ్బులు అడిగినప్పటికీ కృష్ణారెడ్డి నుంచి స్పందన కరువైంది. దీంతో ఆయన కృష్ణారెడ్డి ఇంటికి వెళ్లడంతో ఆ సమయంలో కృష్ణారెడ్డి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతూ జర్నలిస్టును నోటికొచ్చినట్లు దుర్భాషలాడటమే కాకుండా, తల్లిని దూషిస్తూ అసభ్య పదజాలంతో విరుచుకు పడ్డారు. కర్రతో దాడి చేయడానికి ప్రయత్నించాడని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ బద్వేల్ నియోజకవర్గం అధ్యక్షుడు ఆవుల కిషోర్, ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి రఘురాములు, నరసింహ, సురేష్ బాబు, అన్నిక కిషోర్, కమల్, భాస్కర్ రెడ్డి, శ్రీకాంత్, ప్రసాద్, మైదుకూరు డీఎస్పీని కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జర్నలిస్టుపై దాడి ప్రయత్నం, బెదిరింపుల ఉదంతాన్ని తీవ్రంగా పరిగణించిన డీఎస్పీ, తక్షణమే కేసు నమోదు చేయాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. డీఎస్పీ ఆదేశాల మేరకు పోరుమామిళ్ల ఎస్ఐ పి. హనుమంతు స్పందించి, మే 24న సింగిల్ విండో ప్రెసిడెంట్ వెంకట కృష్ణారెడ్డిపై ఎఫ్ఐఆర్ (నెం. 65/2026) నమోదు చేశారు. కొత్త చట్టం (దీమీ) లోని సెక్షన్లు 126(2), 351(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జిల్లాలో 77 మంది పంచాయతీ

# కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్

భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల జిల్లా, మే 25: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సాధారణ బదిలీలో భాగంగా జిల్లాలోని 77 మంది పంచాయతీ కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్ సోమవారం నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమక్షంలో జిల్లా పంచాయతీ రాజ్ అధికారులు ప్రక్రియను చేపట్టారు. మొత్తం 77 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి . వారికి నూతన గ్రామ పంచాయతీలను కేటాయించడం జరిగింది. కౌన్సెలింగ్ లో జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ఫుద్దిన్ సిబ్బంది పాల్గొన్నారు.

70 మంది చిన్నారులకు

# సైకిళ్లు పంపిణీ చేసిన జగ్గారెడ్డి

- ప్రత్యేకంగా 8 ఏళ్ల లోపు చిన్నారులకు సైకిల్స్ పంపిణీ



**సంగారెడ్డి,భారతశక్తి ప్రతినిధి, మే 25:** సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సైకిల్స్ పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. తాజాగా మరో 70 మంది చిన్నారులకు జగ్గారెడ్డి సైకిల్స్ పంపిణీ చేశారు. 8 ఏళ్ల లోపు వయసున్న చిన్నారులకు సైకిల్స్ అందించేలా ప్రత్యేకంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటివరకు మొత్తం 400 సైకిల్స్ పంపిణీ పూర్తి అయ్యింది. తమ కార్యాలయంలో ఆధార్ జిరాక్స్ ఇచ్చి, పేర్లు నమోదు చేసుకున్న అందరికీ విడతల వారీగా సైకిల్స్ అందిస్తామని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.లి

### మరో 156మందికి టోకెన్స్ పంపిణీ

సైకిల్స్ పంపిణీ కార్యక్రమం వద్దకు వచ్చి, గతంలోనే తమ పేర్లను నమోదు చేసుకున్న 156మంది చిన్నారులకు జగ్గారెడ్డి టోకెన్స్ అందించారు. వచ్చే ఆదివారం వారికి సైకిల్స్ అందిస్తామని చెప్పారు.

### చిన్నారులతో ముచ్చటిస్తూ..!

సైకిల్స్ పంపిణీ సందర్భంగా జగ్గారెడ్డి చిన్నారులతో ముచ్చటిస్తూ సరదాగా గడిపారు. వారితో కరచాలనం చేస్తూ, హాయ్ చెబుతూ వారితో కలిసిపోయారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకుడు కూన సంతోష్, సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# హ్యాండ్లూమ్ టెక్స్ టైల్ టెక్నాలజీలో ప్రవేశాలు

**భారత శక్తి ప్రతినిధి, కడప, మే 25:**శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ అఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీ, వెంకటగిరి, తిరుపతి జిల్లా,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుచుచున్న సంస్థ. 1992 వ సంవత్సరంలో ప్రారంభించబడిన ఈ సంస్థలో హ్యాండ్ లూమ్స్ అండ్ టెక్స్ టైల్స్ టెక్నాలజీలో 3 సంవత్సరముల డిప్లొమా కోర్సులో శిక్షణ ఇచ్చి కేంద్ర ప్రభుత్వ జౌళి శాఖ వారిచే సర్టిఫికేట్స్ జారి చేయబడును. ఈ సంస్థ లో దక్షిణ భారతదేశం లోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు,కేరళ,కర్ణాటక, మహారాష్ట్ర మరియు పాండిచ్చేరి,రాష్ట్రములకు సంబంధించిన అభ్యర్థులకు ప్రవేశాలు కల్పించబడుచున్నాయి. భారతదేశంలోఉన్న 11 హ్యాండ్ లూమ్ ఇనిస్టిట్యూట్స్ లో వెంకటగిరి ఇనిస్టిట్యూట్ ఒకటి. 10వ తరగతి పాస్ అయిన అభ్యర్ధ్యులుకు వారి మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పించబడుతాయి. ఇంటర్మీడియట్ (ఎం.పి.సి) మరియు ఐటిఐ (2 సంవత్సరములు) పాస్ అయిన వారు నేరుగా రెండవ సంవత్సరంలో చేరవచ్చు. ఈ కోర్సు చదివేవారందరు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు స్టైపెండ్ నెలకు రూ:2500/- పొందుటకు అర్హులు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి వెంటనే క్యాంపస్ సెలెక్షన్స్ ద్వారా అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించబడును మరియు చేనేత మరియు జౌళి శాఖకు సంబంధించిన ప్రభుత్వఉద్యోగాల కొరకు వీరికి అవకాశం కలదు. ఈ కోర్సు పూర్తి చేసిన అభ్యర్ధ్యులకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుటకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఉన్నత చదువులు చదవాలనుకున్న వారు ఈ కోర్సు చేసిన తరువాత నేరుగా రెండవ సంవత్సరం బి. టెక్. నందు ప్రవేశించవచ్చు. ఇతర వివరముల కొరకు కాలేజి వెబ్ సైట్ ‍www.iihtvgr.com ను సందర్శించ గలరు. మరింత సమాచారం కొరకు ఫోన్ 9399936872, 9866169908 ‍ 9010243054 లను సంప్రదించగలరు.

# ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత: మంత్రి కొండా సురేఖ

## - పర్యావరణ పరిరక్షణతోనే భావితరాలకు భద్రమైన భవిష్యత్ :మంత్రి దామోదర రాజనర్సింహ



**సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, మే,25:** అడవుల నరికివేత, పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసు కుంటున్నాయని, ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో రూ. 1.44 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన జిల్లా అటవీశాఖ కార్యాలయ భవనాన్ని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మరియు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, టి జి ఐ సి చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వన మహోత్సవ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా బొంతపల్లి సమీపంలో "అమృతవనం", "హరితవనం" పేర్లతో రెండు ఆధునిక ఎకో పార్కులను అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. సంగారెడ్డి, పరిసర ప్రాంతాల ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ప్రకృతి అందాలను ఆస్వాదించేలా పార్కుల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించినట్లు మంత్రి తెలిపారు. పర్యాటకుల స్పందన ఆధారంగా 'నైట్ స్టే' సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అడవుల సంరక్షణ కోసం అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని, రిజర్వ్ ఫారెస్టుల చుట్టూ పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసి అడవి జంతువులు గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలోనే నారాయణఖేడ్, జహీరాబాద్‌తో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా ప్రకృతి వనాల ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని సంరక్షించడం ద్వారా ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు. ప్రకృతి సంపదను సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణ ద్వారానే భావితరాలకు భద్రమైన భవిష్యత్ అందించగలమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, మరియు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వన మహోత్సవ కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, ప్రకృతి వనాలను అభివృద్ధి చేయడం జరుగుతోందని తెలిపారు. సంగారెడ్డి జిల్లా బొంతపల్లి వద్ద ఏర్పాటు చేసిన అమృతవనం, హరితవనం వంటి ఎకో పార్కులు ప్రజలకు ప్రకృతి సౌందర్యాన్ని చేరువ చేయడంతో పాటు పర్యావరణ సమతుల్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి జి ఐ ఐ సి చైర్ పర్సన్ నిర్మల జయప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, నారాయణఖేడ్ శాసనసభ్యులు డా. సంజీవరెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ వనిత సంతోష్, జిల్లా అటవీశాఖ అధికారి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్లాలి

- ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్‌పై విస్తృత అవగాహన కల్పించాలి:
- రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్



**కడప, మే 25(భారత శక్తి ) :** వైఎస్సార్ కడప జిల్లాలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయాలని రాష్ట్ర స్థాయి ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కడప జిల్లా మహిళా జిల్లా సమాఖ్యలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో జూమ్ వీసీ ద్వారా జిల్లా స్థాయి డీబ్రీఫింగ్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ ప్రాధాన్యతపై సిబ్బందికి సమగ్రంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా "సీడ్ ఫెలటైజేషన్" విధానాన్ని ప్రతి రైతుకు చేరవేయాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన వివరాలను రైతులకు తెలియజేసి, అక్కడి సిబ్బందితో కలిసి ఫీల్డ్ స్థాయిలో సీడ్ ఫెలటైజేషన్ చేసి విత్తనాలు వేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి గ్రామంలో పంటల పరిస్థితులను అధ్యయనం చేసి, ఆ ప్రాంత పరిస్థితులకు అనుగుణంగా ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. వరి సాగు ఉన్న ప్రాంతాల్లో రైతులతో చర్చించి, వరితో పాటు ఇతర పంటలను కూడా ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేలా ప్రోత్సహించాలని అన్నారు. ఏడాది పొడవునా పంటలు సాగు అయ్యే విధంగా రైతులను ప్రోత్సహించి, మంచి దిగుబడులు మరియు నాణ్యమైన ఉత్పత్తులు సాధించేలా మార్గనిర్దేశనం చేయాలని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి సుబ్రమణ్యం రావు మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి క్యాడర్ గ్రామ స్థాయిలో రైతులతో సమావేశాలు నిర్వహించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా చర్చించాలని సూచించారు.

ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులు, ఎలినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులకు తగిన పంటల ఎంపికపై సలహాలు ఇవ్వాలని తెలిపారు. వివిధ ప్రకృతి వ్యవసాయ మోడళ్లను రైతులతో అమలు చేయించి, ఈ ఏడాది లక్ష్యాలను సాధించేందుకు ప్రతి క్యాడర్ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్వీ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాల పురోగతిని వివరించారు. భవిష్యత్ కార్యాచరణపై సిబ్బందికి దిశానిర్దేశం చేస్తూ, అన్ని కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు: అడిషనల్ కలెక్టర్ సంగీత



**సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, మే 25:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సత్వరంగా, పారదర్శకంగా పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా, నిర్ణీత గడువులోగా చర్యలు పూర్తి చేయాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంగీత ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 102 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌కు 44, సంగారెడ్డి డివిజన్‌కు 17, ఆందోల్ డివిజన్‌కు 07, నారాయణఖేడ్ డివిజన్‌కు 16, జహీరాబాద్ డివిజన్‌కు 18 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లోయలో పడిన కారు.. 8 మంది మృతి



**రాయ్ గఢ్ (భారత శక్తి):** మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. రాయ్&ఢ జిల్లాలో కారు లోయలో పడిపోయింది. ప్రమాదంలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. పోలాద్పూర్ - మహాబలేశ్వర్ రోడ్డులోని అంబెనాలి ఘాట్ వద్ద ఘటన జరిగింది. దాపోలి నుంచి సతారాకు ప్రయాణిస్తుండగా కారు లోయలో పడింది.మృతులను సతారాకు చెందినవారుగా పోలీసులు గుర్తించారు

# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

## - మహిళా గ్రామ సంఘ భవనాలకు వర్చువల్‌గా భూమి పూజ చేసిన ముఖ్యమంత్రి




**సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, మే 25:** ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలువురు మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా నిర్మించనున్న 8 వేల మహిళా గ్రామ సంఘ భవనాలకు వర్చువల్ విధానంలో భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ సంకల్పమన్నారు. గ్రామీణ మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, ఉపాధి నైపుణ్య శిక్షణ పొందడానికి, వారు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించడానికి మహిళా గ్రామ సంఘ భవనాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు ఇప్పటికే రూ. 60,472 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని, వచ్చే ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలను అందించి మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందేలా ప్రభుత్వం తోడ్పడుతుందని పేర్కొన్నారు. పెట్రోల్ బంకులు, ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే బస్సుల కొనుగోలు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటులో కూడా మహిళా సంఘాలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. మహిళల సంక్షేమం, సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని గుర్తు చేశారు. ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీ ద్వారా మహిళా సంఘ సభ్యులకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చామని తెలిపారు. అనంతరం పలు జిల్లాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులు తమ విజయ గాథలను,అనుభవాలను పంచుకున్నారు. దసంగారెడ్డి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్,టిజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, డీఆర్‌డీఓ జ్యోతి, బీడబ్ల్యూఓ, ఇంజనీరింగ్ అధికారులు, ఇతర జిల్లా అధికారులు, మహిళా సమాఖ్య సభ్యులు వీక్షించారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy